
# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:5 171 మే 2025 హైదరాబాద్

- తెలంగాణలో ఆధునికత; సురవరం
- గంగాపురం చెన్నకేశవాలయం - చారిత్రక అంశాలు
- ప్రజా కళలు; అరుణోదయ
- తెలుగు వైతాళికుడు - సురవరం ప్రతాపరెడ్డి
- "ప్రజల వెంట నడవడమే నా సాహిత్య ప్రయోజనం"- పి. చంద్
- ప్రజల మనిషి నవల - ప్రాసంగికత



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

మే 2025

సంచిక : 5

సంపుటి : 15



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహా మండలి

**అల్లం నారాయణ**

చైర్మన్(పూర్వ)–ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ గణేష్

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

**సంపాదకురాలు**

స్నేహలత ఎం.

**సంపాదకవర్గం**

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డిటిపి, లే ఔట్ :** స్నేహ

**కవర్ డిజైన్ :** శేషు



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం.2–95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్–500 007.

మెయిల్: **nadusthunnatelangana@gmail.com**

**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

*చీకటి కన్నీళ్లను*
*తన హృదయంలో దాచుకొని*
*అడవి మేల్కొంటుంది*

*అడవంటే*
*ఎంతకూ తీరని*
*పత్రహరిత మోహం*

*తుమ్మెదల మకరందాన్ని*
*కానుకగా ఇచ్చి*
*అడవి హాలాహలాన్ని మింగుతుంది*

*అడవి పువ్వులు రాలిపోతూ*
*పచ్చని ఆకాశాన్ని*
*వాగ్దానం చేస్తున్నాయి*

*మైదానానికి*
*ప్రేమలేఖ రాసి*
*అడవి చితాభస్మమవుతుంది*

**31 మే, 2025**


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| తెలంగాణ ఆధునికత; సురవరం | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 5 |

**ప్రొఫెసర్**

| | | |
|---|---|---|
| ప్రజాకళలు; అరుణోదయ | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 6 |

**సామాజికం**

| | | |
|---|---|---|
| అరుణోదయ పాట... ఉద్యమ బావుటా | **డా. డి.ఉదయ్‌భాను** | 9 |

**తొవ్వముచ్చట**

| | | |
|---|---|---|
| "ప్రజల వెంట నడవడమే నా సాహిత్య ప్రయోజనం" -పి.చంద్ | **బొడ్డుపల్లి అఖిల్** | 12 |

**పరిశోధన**

| | | |
|---|---|---|
| తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి | **డా.ఆర్.గోపాల్** | 20 |
| గంగాపురం చెన్నకేశవాలయం-చారిత్రక అంశాలు | **పదకంటి మహేష్** | 22 |

**విమర్శ**

| | | |
|---|---|---|
| తెలుగు నవలా సాహిత్యంలో 'ప్రపంచీకరణ' | **భైరపోగు శివకుమార్** | 30 |
| తెలంగాణ ధూంధాంలో కవులు, గాయకుల పాత్ర | **డా.సుజాత ఆజ్మీరా** | 35 |
| ప్రజల మనిషి నవల; ప్రాసంగికత | **డా. ఇమ్మిడి మహేందర్** | 39 |
| తెలంగాణ సాహిత్య వికాసం-కథా ప్రక్రియ ప్రస్థానం | **డా.లావుడ్య శ్రీదేవి** | 42 |
| సమాజ ప్రతిబింబాలు-యూట్యూబ్ జానపద పాటలు | **జంగిటి వేణు** | 45 |

**పరిశోధన పరిచయం**

| | | |
|---|---|---|
| ఆంధ్రజ్యోతి దినప్రతిక సాహిత్య పుటలు: విమర్శనాత్మక పరిశీలన(2015-17) | **డా. కె.లావణ్య** | 49 |

సంపాదకీయం

# తెలంగాణ ఆధునికత; సురవరం

ప్రొఫెసర్ చింతకింది కాశీం

పారిశ్రామిక విప్లవం ప్రపంచానికి ఆధునికతను పరిచయం చేసింది. ఫలితంగా ఆలోచనలో, ఆచరణలో, ఉత్పత్తి విధానంలో అనూహ్యమార్పులు చోటుచేసుకున్నాయి. తమ ప్రయోజనం కోసమైనా పెట్టుబడిదారులు కొత్త ఆలోచనలను ప్రోత్సహించారు. నూతన పరికల్పనలకు కావల్సిన ప్రాతిపదికను రూపొందించారు. శాస్త్ర సాంకేతిక రంగాలలోనే కాకుండా సామాజిక శాస్త్రాలలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. వీటి ఆధారంగా సాహిత్య, సాంస్కృతిక రంగంలో కొత్త ఆలోచనలకు తావుదొరికింది. పారిశ్రామిక విప్లవం సృష్టించిన విధ్వంసాన్ని సృజనకారులు వివిధ రూపాలలో వ్యక్తంచేసారు. ఈ కాలంలో రొమాంటిసిజం సాహిత్య రంగంలోకి ప్రవేశించింది. భూస్వామ్య ఆనవాళ్లున్న సాహిత్యం మెల్లగా కదలబారింది.

ప్రపంచంలో జరిగిన మార్పులను భారతదేశం స్వీకరించింది. బ్రిటిష్‌వారి ప్రవేశంతో ఘనీభవించిన మన సమాజం మార్పులకు గురైంది. ఆంగ్ల విద్య పరిచయంతో కొత్త అధ్యయన పద్ధతి, ఆలోచనా స్రవంతి అలవడింది. విస్మరణకు గురైన కొన్ని సామాజిక సమూహాలు ప్రధాన స్రవంతిలోకి రావడానికి కొద్దిపాటి వెసులుబాటు దొరికింది. ఆధిపత్య వర్గాలకు కూడా ఆంగ్ల సాహిత్య పరిచయం వలన కొత్త ఆలోచనలు వచ్చాయి. ముఖ్యంగా కలకత్తా, మద్రాస్, బాంబే నగరాలలో విశ్వవిద్యాలయాల ఏర్పాటు వలన కులీనవర్గాలకు ఆంగ్లవిద్య అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా సంఘ సంస్కరణ, జాతీయ భావాలు వారిలో ప్రోది అయ్యాయి. యధాతథస్థితి నుంచి సమాజం ముందుకు వెళ్లవలసిన అవసరాన్ని వీళ్లు గుర్తించారు. ఈ మార్పులన్నీ తెలుగు నేలకు కూడా ప్రసరించాయి. ఆంగ్ల విద్యను అందుకున్న మొదటితరం విద్యావంతులు తెలుగు నేల మీద జరగవలసిన మార్పుల గురించి తీవ్రంగా మదనపడ్డారు. తీరాంధ్ర ప్రాంతంలో క్రైస్తవ మిషనరీలు రావటం మూలంగా సమాజంలో కొంతమార్పు జరిగింది. ఆంధ్ర ప్రాంతంలో ఆధునికతకు సంబంధించిన భావాలు విస్తరించాయి.

ఆధునిక ఉత్పత్తి పద్ధతికి, విద్యకు, మార్పులకు దూరంగా ఉండిన తెలంగాణ, ఫ్యూడల్ సంబంధాలలో కొనసాగింది. కాన్గీ బడుల్లో విద్య నేర్చుకున్న తెలంగాణ మొదటితరం విద్యావంతులు ఇక్కడి సమాజంలో రావల్సిన మార్పుల గురించి చర్చించడం మొదలు పెట్టారు. ఉర్దూ సాహిత్యంలో ఉన్న ప్రగతిశీల భావాలను అర్థంచేసుకొని తెలంగాణ నేల మీద మౌలిక మార్పు గురించి తపనపడ్డారు. ఈ కాలంలో పాలమూరు జిల్లా అలంపూర్ తాలూకాలో పుట్టిన సురవరం ప్రతాపరెడ్డి తుంగభద్ర నదిని దాటి కర్నూల్ నేల మీద అడుగు పెట్టాడు. అక్కడి ఆంగ్ల పాఠశాలలో విద్యాభ్యాసం చేయటం వలన కొత్త ప్రపంచానికి సంబంధించిన ఆలోచనలు బాల్యంలోనే అలవడ్డాయి. కర్నూల్ నుంచి ఉన్నతవిద్య కోసం మద్రాస్ వెళ్లిన సురవరం తెలుగు పత్రికారంగంలో జరిగిన కృషి గురించి తెలుసుకున్నాడు. వేదం వెంకటరాయశాస్త్రి లాంటి పెద్దల పరిచయం వలన ఆయనకు కొత్త సంస్కారం అబ్బింది.

ఇంటర్మీడియట్ విద్య కోసం హైదరాబాద్ నిజాం కాలేజీలో చేరిన ప్రతాపరెడ్డి, ఇక్కడి నిజాం పాలనలో దిగజారిపోయిన తెలంగాణ ప్రజల జీవితాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేసాడు. రాజ్‌బహదూర్ వెంకటరామారెడ్డి సహకారంతో రెడ్డి హాస్టల్ ఉద్యోగంలో చేరాడు. ఏ మనిషినైనా అధ్యయనమే తీర్చిదిద్దుతుందని సురవరం ప్రతాపరెడ్డి విషయంలో కూడా రుజువైంది. ఆ హాస్టల్‌లో ఉన్న వెయ్యి పుస్తకాలను చదవటమే కాకుండా ఆ లైబ్రరీని పదకొండు వేల పుస్తకాల నిలయంగా మార్చాడు. ఆ క్రమంలో ఆయన చదివిన 'వార్ ఆఫ్ ఇండియన్ ఇండి పెండెన్స్' పుస్తకం విశేషంగా ప్రభావితం చేసింది. వీరసావర్కర్ రాసిన ఈ పుస్తకం ప్రభుత్వ నిషేధానికి గురైంది. ఈ పుస్తకాన్ని చదివిన వారెవరైనా ఆనాడు నేరస్తులే అని ప్రభుత్వం భావించింది. కనుక కొంతకాలానికి సురవరం నేరస్తుడయ్యాడు. ఆ తర్వాత తెలంగాణ సమాజంలో రావల్సిన సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పుల కోసం ఆయన నడుంకట్టాడు. సాంస్కృతిక పోరాటమే కొన్నిసార్లు సామాజిక, రాజకీయ, ఆర్థిక పోరాటాలకు ఆలంబనగా ఉంటుంది. తెలంగాణ విషయంలో ఇదే రుజువైంది. తెలంగాణ ప్రజలలో కొత్త భావాలను పురికొల్పడానికి పత్రిక తప్ప ఇంకో సాధనం లేదని సురవరం భావించాడు. కనుక కొందరి సహాయంతో 'గోల్కొండ' పత్రికను నెలకొల్పాడు.

తెలంగాణ సమాజంలో ఆధునిక భావాలు రూపొందడానికి కృషిచేసిన మొదటివ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణ రచయితల సంఘం, విజ్ఞానవర్ధిని పరిషత్తు, లక్ష్మణరాయ పరిశోధన మండలి లాంటి సంస్థల ఏర్పాటు, నిర్వహణలో ప్రతాపరెడ్డి ప్రత్యక్ష భాగస్వామి. ఈ సంస్థలన్నీ తెలంగాణ సమాజంలో సాంస్కృతిక చలనాలకు మూలబిందువుగా నిలబడ్డాయి. రచయితగా, కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా, పత్రికా సంపాదకుడిగా, ఆంధ్ర మహాసభ నాయకుడిగా సురవరం చేసిన విశేషకృషి తెలంగాణ సమాజంలో ఆధునికత రావడానికి దోహదపడింది. ఆంధ్ర ప్రాంతంతో పోల్చుకుంటే ఇక్కడి సమాజంలో మార్పులు రావటానికి అనేక అవరోధాలున్నాయి. నిరంకుశ నిజాం పరిపాలన పౌరుల ప్రాథమిక సత్వాలను కూడా నిరాకరించి గస్తీ నిషాన్ చట్టాన్ని తీసుకొచ్చిన వేళ సురవరం కలం యోధుడిగా ప్రజలవైపు నిలబడ్డాడు.

# ప్రజాకళలు; అరుణోదయ

ప్రొఫెసర్ చింతకింది కాశీం

1990 అనుకుంటాను 'అన్నా అమరుడురా మన రాంనర్సన్న అమరుడా' అనే పాటను విన్నాను. ఆ పాటను కాస్త మార్పులు చేసి 'అన్నా అమరుడురా అంబేద్కరన్నా అమరుడురా' అని పాడుకునేవాళ్లం. ఈ పాట అరుణోదయ నుంచి వచ్చిందని తెలియడానికి నాకు పదేళ్లు పట్టింది. అలా అరుణోదయ తెలియకుండానే ఆ సంస్థ నుంచి వెలువడిన పాట విన్నాను. ఇక ఈ ముప్పైఐదేళ్లు అరుణోదయ పాట వింటూనే ఉన్నాను. జననాట్యమండలి పాట మమ్మల్ని విప్లవానికి పరిచయం చేసింది. అరుణోదయ పాట మాలో ఆలోచనలను ప్రోది చేసింది. ఈ రెండింటి ప్రభావం నుంచి తప్పించుకోలేని మేము మెల్లగా విప్లవ సాహిత్యానికి ముఖ్యంగా కవిత్వానికి అభిమానులుగా మారిపోయాం. ఒకరకంగా పాటలే మా తరాన్ని విప్లవాచరణకు పురికొల్పాయి. మౌఖిక పాటల పరంపరలో ఎదిగివచ్చిన మాకు విప్లవ పాట జీవితసత్యాన్ని బోధచేసింది.

గూడ అంజన్న రాసిన 'ఊరు మనదిరా ఈ వాడ మనదిరా' పాట గనీభవించిన గ్రామాన్ని కళాత్మకంగా వ్యక్తం చేసింది. మండుతున్న గ్రామాలలోని ఉత్పత్తి సంబంధాలు మా అవగాహనలోకి వచ్చాయి. ఆ ఉత్పత్తి సంబంధాలను కదలబార్చడానికి కావలసిన రాజకీయ చైతన్యం అడపాదడపా గ్రామాల్లోకి వచ్చేపోయే దళాలు అందించాయి. బాల్యంలో దళాలు చెప్పే రాజకీయాలతో మాకు ఏ మాత్రం తాదాత్మ్యం లేదు, కానీ వాళ్లు పాడే పాటల కోసమే ఇంట్లో గొడవపడి రాత్రి సభలకు వెళ్లేవాళ్లం. ఈ పాటలే మమ్మల్ని చదువువైపు, సమాజం వైపు, పోరాటాల వైపు, విప్లవాల వైపు నడిపించాయి. మాలాంటి వారినే కాదు తెలుగునేల మీద లక్షలాది మందిని విప్లవాచరణ వైపు నడిపించిన శక్తి ఈ పాటలకు ఉంది. తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగంలో ప్రజానాట్యమండలి, జననాట్యమండలి, అరుణోదయ ప్రభంజనాన్ని సృష్టించాయి. ప్రజాకళారూపాలను సమాజానికి పరిచయం చేసాయి.

1920-1925 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు కావలసిన ప్రాతిపదిక ఏర్పడినా 1934 వరకు ఆంధ్ర ప్రాంతంలో సంస్థారూపం ధరించలేదు. రైతుకూలి సంఘాలు ఏర్పడి పనిచేస్తుండిన కాలం. అలాగే పట్టణ ప్రాంతంలో బస్తీల్లో పనిచేసిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఉన్నారు. కొన్ని పారిశ్రామిక వాడల్లో కార్మిక సంఘాలు ఏర్పడి పనిచేస్తున్నాయి. ఈ మొత్తం సందర్భాన్ని ప్రజలకు బోధించడం కోసం కళ అవసరమొచ్చింది. ఉద్యమ నిర్మాణంలో అదొక సాధనంగా ఉండింది. జాతీయోద్యమంలో బ్రిటిష్ వ్యతిరేక పాటలు కొన్ని వచ్చాయి. వాటిలో ప్రజల బాణీలో ఉన్న పాటలు విశేష ఆదరణను పొందాయి. గరిమెళ్ల సత్యనారాయణ, మద్దూరి అన్నపూర్ణయ్య వర్గరహిత సమాజ భావనతో పాటలు రాసారు. ఈ కాలంలోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. దేశవ్యాపితంగా కమ్యూనిస్టు, అభ్యుదయ శక్తులు ఫాసిస్టు వ్యతిరేక భావజాలాన్ని ప్రచారం చేసారు. అప్పుడే తెలుగు నేల మీద ముఖ్యంగా కృష్ణా జిల్లాలో యువజన సంఘాలు ఏర్పడ్డాయి. ఫాసిస్టు వ్యతిరేక శిబిరాలు ఏర్పడ్డాయి. "సైనిక శిక్షణ మాటున వ్యాయామశాలలు, వయోజన పాఠశాలలు లేచాయి. కాలక్షేపం కోసం, ఫాసిస్టు వ్యతిరేకతను ప్రజల్లో వ్యాపింపజేయడానికి కళారూపాల ద్వారా ప్రచారం అవసరంగా మారింది" (కె.వి.ఆర్, ప్రజానాట్యమండలి జ్ఞాపకాలు; 2002 పుట. 8) దేశవ్యాపితంగా జరిగిన మార్పులలో భాగంగా 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' ఏర్పడింది. మధ్యతరగతిలో ఆధునిక ప్రజాస్వామ్య భావాలను కలిగించడం ప్రజానాట్యమండలి లక్ష్యంగా ఉండింది. కళ కళ కోసం కాదు. సమాజిక ప్రయోజనం కోసం అనే భావనను ఈ కాలం ముందుకు తెచ్చింది.

కమ్యూనిస్టు పార్టీ మీద నిర్బంధం, నిషేధం విధించడం, నిషేధం ఎత్తివేయడం 1952 నాటి సాధారణ ఎన్నికలు... ఇలా ఒక దాని తర్వాత మరొకటి అనేక మార్పులు జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో స్తబ్ధత ఏర్పడింది. పూర్తికాలం కార్యకర్తలు, కవులు, కళాకారులు జీవిక కోసం వివిధ వృత్తుల్లోకి వెళ్లిపోయారు. మరోవైపు దేశంలో రాజకీయ అస్థిరత్వం ఏర్పడింది. నిరుద్యోగం పెరిగింది. రైతుల సమస్యలు తీరలేదు. జాతీయోద్యమ ఆకాంక్షలు నెరవేరలేదు. ఈ అశాంతి నుంచి నక్సల్బరి నిప్పురవ్వ దేశమంతా రాజుకున్నది. భారతదేశాన్ని కొత్తగా వ్యాఖ్యానించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమం మీద రష్యా, చైనా విప్లవాల ప్రభావం ఉండింది. రష్యా విప్లవ ప్రభావంతో రూపొందిన వాళ్లు సంప్రదాయ కమ్యూనిస్టులుగా ఉండిపోయారు. చైనా విప్లవ ప్రభావం నక్సల్బరి పంథాకు పునాది వేసింది. మూడవ ప్రపంచ దేశాలలో విప్లవం, వర్గపోరాటం రూపొందడానికి కావలసిన సైద్ధాంతిక దృక్పథాన్ని చైనా విప్లవం, మావో అందించారు. 1929 మే 4న విద్యార్థి

ఉద్యమం తదనంతర కాలంలో చైనా సాంస్కృతిక విప్లవానికి నాంది పలికింది.

నక్సల్బరి రాజకీయాలు సాహిత్య, సాంస్కృతిక రంగాలలో నూతన మార్పును కోరుకున్నాయి. శ్రీకాకుళ పోరాటం నిర్దిష్టంగా తెలుగు సమాజంలో రావలసిన మార్పులను నిర్దేశించింది. నక్సల్బరి శ్రీకాకుళ పోరాటాలు దేశంలో విద్యార్థి, యువత, మేధావి వర్గాన్ని విస్తృతంగా ఆకర్షించాయి. వ్యవసాయిక దేశంలో అత్యధికులు నిరక్షరాశ్యులుంటారు, కనుక వ్యవసాయిక విప్లవానికి కావలసిన సాంస్కృతిక పరికరాలను కొత్తగా సమకూర్చుకోవలసిన అవసరాన్ని ఆ కాలం కోరుకున్నది. 'విప్లవకర వర్గాల దగ్గరకు విప్లవాన్ని తీసుకెళ్లే మౌఖిక, దృశ్య కళారూపాల ఆవశ్యకతను గుర్తించి దానిని 'గ్రామాలకు తరలండి' రాజకీయ లక్ష్యానికి అన్వయించి గడ్డివేళ్ల స్థాయిలో జరిగిన ఎర్రరంగ స్థల నిర్మాణమే జననాట్యమండలి'. బి.నర్సింగరావు చొరవతో అప్పటికే ఏర్పడి పనిచేస్తుండిన ఆర్ట్‌లవర్స్ జననాట్యమండలికి బీజరూపం. ప్రజల పాటలను తీసుకొని విప్లవానికి అన్వయించి పాడటం ప్రారంభించింది మొదట ఈ సంస్థ సభ్యులే. ఈ సంస్థ పరిచయంలోకి వచ్చిన గద్దర్ పాట, ఆటలో తీసుకొచ్చిన గుణాత్మక మార్పులు తర్వాతి సాంస్కృతిక రంగ స్థలానికి ప్రాతిపదికలుగా ఉన్నాయి. జననాట్యమండలి ఏర్పాటు 1972లో జరిగినప్పటికి దాని బీజరూపం 1966 నుంచే ప్రారంభమయింది. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు, ప్రదర్శనా కళారూపాల మీద విశేష ప్రభావం వేసాయి. పాటను అల్లటం మౌఖిక వారసత్వం నుంచి నేర్చుకొని విప్లవానికి అనువుగా రాయటం కవులకు ఈ కాలమే నేర్పింది. శివసాగర్, చెరబండరాజు, గూడ అంజయ్య, గద్దర్ పాట రచనలో, గానంలో నూతన ఒరవడిని సృష్టించారు. ప్రజాకళా రూపాలను వర్గపోరాటానికి అన్వయించి విప్లవాన్ని ఎలా ప్రచారం చేయవచ్చో ఈ కవులు తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగానికి పరిచయం చేసారు. ఆట, పాట, ప్రదర్శన పద్ధతిలో విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టిన వ్యక్తి మాత్రం గద్దరే. మునుపటి ప్రజానాట్యమండలి అనుభవాలను స్వీకరించి జననాట్య మండలికి పురుడు పోసిన వ్యక్తి ఆయననే. అప్పటికే విరసం పుట్టి సాహిత్య రంగంలో ప్రభంజనాన్ని సృష్టించింది. కవులు, కళాకారులు ప్రజలవైపేననే చారిత్రక సత్యాన్ని చాటింది. సుబ్బారావు పాణిగ్రాహి, చినబాబు నెలకొల్పిన త్యాగపూరిత సంప్రదాయం కళా, సాహిత్య రంగానికి అనుసరణీయంగా మారింది.

దేశంలో జరుగుతుండిన అనేక మార్పులకు విశ్వ విద్యాలయాలు పులకరించాయి. ఎగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబాల నుంచి అప్పుడప్పుడే ఉన్నత చదువుల్లోకి ప్రవేశించిన యువత ఆలోచనల మీద నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాల ప్రభావం పడింది. కలకత్తా, జోద్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలు విప్లవ రాజకీయాలకు వేగంగా స్పందించాయి. ఇక్కడి విద్యార్థులు కొందరు విప్లవ నిర్మాణాలకు పూనుకున్నారు. నిజాం వ్యతిరేక పోరాటం నడిపిన ఉస్మానియా విశ్వవిద్యాలయం నక్సల్బరీ రాజకీయాలకూ స్పందించింది. జార్జిరెడ్డి ఈ కాలపు కథా నాయకుడుగా ముందుకు వచ్చాడు. విద్యార్థి రంగంలో ఆయన ప్రారంభించి నెలకొల్పిన సంప్రదాయం తర్వాతి తరానికి నమూనాగా నిలబడింది. సమాజంలో జరుగుతున్న మౌలిక మార్పులకు విద్యార్థులు స్పందించకుండా ఉండలేరని ఆ తరం గుర్తుచేసింది. ప్రజా రాజకీయాలను మేధో స్థాయిలో చర్చించి, విశ్లేషించి ఆచరణలోకి తీసుకెళ్లవలసిన అవసరాన్ని వాళ్లు గుర్తించారు. స్వయంగా జార్జిరెడ్డి పూనికలో విప్లవ విద్యార్థుల సమూహం ఏర్పడింది. హైదరాబాద్, గుంటూరు, తిరుపతి నగరాలలో విప్లవ విద్యార్థి నిర్మాణాలు ప్రారంభం కావడానికి జార్జిరెడ్డి ఆచరణనే కారణం. శ్రీకాకుళం, ఇల్లెందు, ములుగు, మంథని, గోదావరిలోయ పోరాటాలన్ని ఈ కాలం విద్యార్థులను ముందుకు తోయడానికి కనిపించని శక్తులుగా పనిచేసాయి.

విప్లవ రచయితల సంఘం ఏర్పడి శ్రీశ్రీ దానికి అధ్యక్షుడు కావడం సాహిత్య రంగంలో సంచలనం తీసుకొచ్చింది. ఈ ప్రభావం కూడా విద్యార్థుల మీద ఉంది. పాణిగ్రాహి, శివసాగర్, గూడఅంజయ్య, చెరబండరాజు, గద్దర్ మొదలైన వారి రచనాశైలి విద్యార్థులను కూడా ఆకర్షించింది. పదునెక్కుతున్న విశ్వవిద్యాలయాలను చూసి ఓర్చుకోలేని సంఘ్‌పరివార్ శక్తులు జార్జిరెడ్డిని ఓయూలో హత్యచేసాయి. 1974 ఏప్రిల్ 14న జార్జిరెడ్డి వర్ధంతి సభను జరపాలని తన మిత్రులు ఓయూలో ప్లాన్ చేసారు. అప్పటికి కొద్దిరోజుల ముందు నుంచే జననాట్యమండలి లాంటి మరో సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనలకు నిర్మాణరూపం ఇవ్వవలసిన చారిత్రక సందర్భం ముందుకు వచ్చింది. చుట్టూ చీకటి ఆవరించి ఉన్నప్పుడు వ్యక్తుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా 'అరుణోదయం' కాక తప్పదు. అలా ఒక విద్యార్థి సంఘం, కళాసంఘం ఒకే వేదిక నుంచి ప్రదర్శన కావటం చరిత్రకు దొరికిన అరుదైన అవకాశం. ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో కళారంగం పట్ల ఆసక్తి ఉన్న వాళ్లు సమావేశమై ప్రదర్శనను రూపొందించారు. విద్యార్థి సంఘం వేదిక మీద ఇచ్చే ప్రదర్శనల గురించి వారి ఆలోచనలు కొనసాగాయి. కానూరి వెంకటేశ్వరరావు, జంపాల ప్రసాద్, చలపతిరావు, గూడ అంజయ్య, లలిత, అంబిక ఈ మొత్తం ప్రాసెస్‌లో పాత్రదారులు, సూత్రదారులు.

రైతాంగానికి అర్థమయ్యే భాషలో పాట రచన ఉండాలనే అవగాహనను అరుణోదయ తన ప్రాథమిక లక్షణంగా

స్వీకరించింది. ఆనాడు చలపతి మాటలతో అరుణోదయ పాట ఆరంభమయ్యేది. అప్పటికే ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సంప్రదాయంలో ఎదిగి కొండపల్లి సీతారామయ్య పర్యవేక్షణలో ప్రజానాట్యమండలి కళాకారుడిగా మారిన కానూరి వెంకటేశ్వరరావు(1916–2015) రాంనర్సయ్య పూనికతో అరుణోదయ నిర్మాణంలోనూ, విస్తరణలోనూ భాగమయ్యాడు. ప్రగతిశీల విద్యార్థి సంఘం నేపథ్యం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రూపొందిన సందర్భంలో వేదిక మీద ఇచ్చే ప్రదర్శనలకు శిక్షణను ఇవ్వడం కోసం ఇల్లెందు నుంచి కానూరి హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంకు వచ్చాడు. ఆ విధంగా 1974లో పీడీఎస్‌యూ, అరుణోదయ ఒకేసారి ఆవిర్భవించాయి. రెండింటికి ఓయూ వేదిక కావడం చరిత్రకు లభించిన అరుదైన గౌరవం.

విద్యార్థి సంఘం మహాసభల్లో కానూరి దర్శకత్వంలో అరుణోదయ కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. వేదిక మీద గొల్లసుద్దులు, ప్రగతి భాగోతం, పిట్టలదొర కళారూపాలు వేదికకు కొత్తదనాన్ని ఇచ్చాయి. ఈ నేపథ్యంగా అరుణోదయకు కానూరి, గూడ అంజయ్య, చలపతి, లలిత పూర్తికాలం కార్యకర్తలుగా మారారు. కాశీపతి తన ఉపన్యాసాలతో, పాటల రచనతో అరుణోదయకు కుడిఎడమగా ఉన్నాడు. 1975 జనవరి/ఫిబ్రవరిలో అనంతపురంలో జరిగిన విరసం సభల్లో అరుణోదయ బుర్రకథను చెప్పి కొత్త ఒరవడికి నాంది పలికింది. నాజర్ చెప్పే బుర్రకథలో చాలా మార్పులు చేసి అరుణోదయ ప్రదర్శించింది. ఒకవైపు జననాట్యమండలి, మరోవైపు అరుణోదయ తెలుగు కళారంగాన్ని విశేషంగా ప్రభావితం చేసాయి. ఈ సంస్థల కళా ప్రదర్శనలు ప్రజల మీద రాజకీయ ప్రభావం వేసాయి. పాలకులు భయకంపితులై నిర్బంధాన్ని ప్రయోగించారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో అరుణోదయ నాయకత్వాన్ని, కళాకారులను అరెస్టు చేసి నిర్బంధించారు. గూడఅంజయ్య, చలపతిలను అరెస్టు చేసారు. కానూరిని నిర్బంధంలోకి తీసుకున్నారు.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోనూ, ఆ తర్వాత విస్తృతమైన రాజకీయ ఆచరణలోనూ అరుణోదయ ముందువరుసలో నిలబడింది. గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటాలను దేశవ్యాపితంగా ప్రచారం చేయడంలో అరుణోదయ ముందున్నది. వర్గపోరాట రాజకీయాలనే కాకుండా సమాజంలో ముందుకొచ్చిన ప్రతీ సామాజిక పోరాటాలను కూడా అరుణోదయ ఈ యాభై ఏళ్లలో గానం చేసింది. చేస్తున్నది. కారంచేడు గ్రామంలో మాదిగ పల్లె మీద కమ్మలు దాడి చేసి మాదిగలను హత్యచేసిన సందర్భంలో అరుణోదయ వారికి అండగా నిలబడింది. బీసీలకు రిజర్వేషన్లు కావాలని జరిగిన మండల్ కమీషన్ ఉద్యమంలోనూ ముందు వరుసలో తమ పాటలను అందించారు. గ్లోబలైజేషన్ ప్రవేశంతో ధ్వంసమైన గ్రామాలకు ఆర్ద్రతతో అరుణోదయ గానం చేసింది. వర్తమానంలో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అరుణోదయ ప్రత్యేక అధ్యాయాన్ని రచించుకున్నది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రస్తావన లేకుండా, విమల పాట లేకుండా ఏ తెలంగాణ సభ పరిపూర్తి కాలేదు.

అరుణోదయ అర్థశతాబ్దిలో(1974–2024) మూడు తరాల కవులను, కళాకారులను తెలుగు సమాజానికి అందించింది. మొదటితరంలో వ్యవస్థాపక సభ్యులు కానూరి, గూడ అంజయ్య. కానూరి గొంతులో వ్యక్తమయ్యే వ్యంగ్యం బహుశ మరే కళాకారుడికి సాధ్యం కాలేదు. బుర్రకథ, ఒగ్గుకథ, పాటరచన, పాట పాడే విధానం ఆయనకు ఆయననే సాటి. తన జీవితం వందేళ్లు. ప్రజా రాజకీయాలే తప్ప మరో మాట లేదు. నిబద్ధత, నిమగ్నత ఆయనను చూసి నేర్చుకోవలసిందే. గూడ అంజయ్య పాట రచనలో నూతన ఒరవడిని సృష్టించాడు. దళిత సామాజిక వర్గం నుంచి ఎదిగిరావటం వలన పాట బాణీలోనూ, శైలిలోనూ, ఇతివృత్తంలోనూ కొత్తదనం ప్రవేశించింది. నేరుగా వర్గ పోరాట రాజకీయాలను ప్రజలకు అర్థమయ్యే పద్ధతిలో ఆయన రాసాడు. ‘ఊరుమనదిరా, ఈ వాడమనదిరా’ పాట ఆ నాటికి అదొక అద్భుతం. ఇక రెండో తరంలో నాగన్న, జయరాజు, గోరెటి ఎంకన్న, మిత్ర, విమల పాటను, ప్రదర్శన రీతిని మరో తలంలోకి తీసుకెళ్లారు. శివసాగర్ ప్రవేశపెట్టిన విప్లవ కాల్పనికతను పాటలోకి సాధికారికంగా తీసుకొచ్చిన పాటకవులు జయరాజు, ఎంకన్న, మిత్ర. విప్లవం ఎంత సౌందర్యాత్మకమయినదో సమాజానికి అర్థం చేయించడానికి వీళ్ల పాటలు పూనుకున్నాయి. విప్లవం చుట్టూ కేంద్రీకృతమయిన అనేక సామాజిక అంశాలను ఈ కవులు తమ పాటల ద్వారా వ్యక్తం చేసారు. బాల గాయకురాలిగా అరుణోదయలోకి ప్రవేశించిన విమల తన గాత్రం ద్వారా తెలుగు ప్రజలను ముగ్ధులను చేసింది. తన గొంతులో ఉండే ప్రత్యేక సరళి వలన ఆమె ఏ పాటనైనా ప్రజలకు చేరువ చేయగలుగుతుంది. ఇక మూడోతరంలో సంతోష్, శక్తి, సాయిచంద్, అనిత, మల్సూర్ మొదలైన కళాకారులు అరుణోదయంలో ఉదయిస్తూనే ఉన్నారు. అరుణోదయ విప్లవం విజయవంతమయ్యే వరకు ఉదయిస్తూనే ఉండాలి.

**జ్ఞాపికలు:**


1. ప్రజా కళారంగ మహాశిఖరం; 2014
2. ప్రజానాట్యమండలి జ్ఞాపకాలు; 2002
3. అరుణోదయ నివేదిక(ముసాయిదా); 2016


T

# అరుణోదయ పాట... ఉద్యమ బావుటా

డా.డి.ఉదయ్‌భాను

భారతదేశం అనేక సామాజిక సంక్లిష్టతల పుట్ట. సంపద మీద అధికారం కోసం దోపిడీ వర్గాలు కులం, మతం అనే భావజాల ఆయుధాలు వినియోగించి శ్రామిక జనావళిని ముక్కలు చెక్కలుగా విభజించాయి. పీడిత ప్రజలంతా అంతర్గత వైరుధ్యాలలో మునిగి తేలుతూ సమైక్యం కాకుండా చేసి, ఆధిపత్య వర్గాలు పబ్బంగడుపుకుంటున్నాయి. తిరోగామి శక్తుల భావజాల కుయుక్తులను అర్థం చేసుకుని అశేషమైన శ్రామిక ప్రజలంతా ఏకమై సమష్టి కృషి, సమష్టి ఉత్పత్తి, సమష్ట సంపద, సమష్టి అనుభవం ఉండే సమాజ నిర్మాణం కోసం పోరాడడం అవసరం. ఆ అవసరాన్ని ప్రజలంతా ఒక్కరోజులో గుర్తించకపోవచ్చు. తమ జీవితాల్లోని సమస్యలకు, బాధలకు కారణాలేమిలో లోతుగా అర్థం కాకపోవచ్చు. సామాజిక ఉత్పత్తిలో తమకు దక్కుతున్న వాటా ఎంతో, తమ శ్రమ ఏ విధంగా దోపిడీకి గురౌతుందో, గురిచేస్తున్న శక్తులేవో, అవి రూపొందించి అమలు చేస్తున్న భావజాల చట్రాలేవో తెలుసుకునే చైతన్యం లేకపోవచ్చు. కానీ శ్రమజీవులే సామాజిక ఛోదకశక్తులు అన్న వాస్తవాన్ని ప్రజలకు అర్థం చేయించి పోరాటాల వైపు నడిపించే గురుతరమైన బాధ్యత ఉద్యమ సంస్థలు, శక్తుల మీద ఉంటుంది. యాభై సంవత్సరాల క్రితం ఏర్పడిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అటువంటి విశేషమైన బాధ్యతను తలకెత్తుకుని గణనీయమైన కృషి చేసింది. పీడిత ప్రజల గొంతుకగా పాలకవర్గాల దోపిడీ స్వభావాన్ని విశ్లేషిస్తూ, నిలదీస్తూ, ఎదురిస్తూ వచ్చింది. శ్రామిక శక్తుల జీవితాల్లోని అన్ని సమస్యలకు మూల కారణాలను గతితార్కికంగా వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచి ఉద్యమోన్ముఖులను చేసింది. గడిచిన యాభై సంవత్సరాల కాలంలో తెలుగు నేలమీద నడిచిన అన్ని ఉద్యమాల్లో క్రియాశీలమైన పాత్రను పోషించింది.

దోపిడీ పీడనలు లేని సమాజం ఏర్పడాలంటే బలమైన రాజకీయ ఉద్యమం మాత్రమే కాదు, దానిని చైతన్యయుతంగా నిర్మాణం చేసే సాంస్కృతిక పోరాటం కూడా అవసరం. భౌతిక ఉద్యమాలు బౌద్ధిక పోరాటాల వల్లనే ఏర్పడతాయి. బౌద్ధిక పోరాటాలు భౌతిక ఉద్యమాల నుండి ప్రేరణ పొందుతాయి. ఇట్లా పీడిత ప్రజా విముక్తిలో సాంస్కృతిక చైతన్యం నిర్వహించే పాత్ర చాలా కీలకమైనది. నక్సల్బరీ వసంత మేఘ గర్జన తర్వాతి విప్లవోద్యమ గమనానికి ప్రచార వాహికగా మాత్రమే కాకుండా సాంస్కృతిక రంగంలోని అనేక తిరోగమన భావాలను ఎదిరించే చైతన్యాన్ని ప్రజలకు అందించింది అరుణోదయ. పాట, నాటకం, వక్తృత్వం వంటి అనేక కళారూపాలను చేపట్టి ప్రజావిముక్తి పోరాటాన్ని ఎత్తిపట్టింది.

ఉత్తర తెలంగాణ నుండి దక్షిణ తెలంగాణకు విస్తరించిన విప్లవోద్యమ గమనంలోని ప్రతి మలుపును గానం చేసింది. గోదావరి లోయలో రాజుకున్న నిప్పు తెలంగాణ అంతటా పాకడంలో అరుణోదయ పాత్ర కీలకమైనది. విప్లవోద్యమాన్ని ప్రతీకాత్మకంగా వివరిస్తూ **"సినుకు సినుకు కురిసిన నేలన మట్టిపెళ్ల వాసన"** వీస్తున్నదని చెప్పింది. **"ఆరుద్ర పురుగులు ఎర్రగా భూతల్లి ఎదలో ఊరాయని"** చెప్పింది. అదే సందర్భంలో **"సినుకు సినుకు కురవని నేలన సిత్రమైన వాసన భూమితల్లి బతుకులు కాలుతున్న వాసన.. అది కమురుతున్న వాసన"** అని విశ్లేషించింది. **"గోదాముల్లో ధాన్యమున్నది కరువుయాత్ర చెయ్యరా.. నీ కాయకష్టమును దోచిన సర్కారు నీకే రుణపడి ఉందిరా"** అంటూ ప్రజా పోరాటానికి పిలుపునిచ్చింది. అట్లా సింగరేణి కార్మికులు, బీడీ కార్మికుల పక్షాన నిలబడి, విప్లవ గొంతును వినిపిస్తూ, మహిళా ఉద్యమానికి కూడా ఊతంగా నిలబడింది. విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను ఎలుగెత్తి చాటింది. విప్లవోద్యమం మీద పాలకవర్గాలు అమలు చేసిన నిర్బంధాన్ని ప్రశ్నించింది. 2004లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలైట్లతో శాంతి చర్చలు జరుపుతామని ఆహ్వానించింది. కానీ దాని వెనుక దాగున్న అసలు ఉద్దేశాన్ని బయటపెడుతూ చర్చల ప్రతినిధిగా వచ్చిన రియాజ్‌ను అనతికాలంలోనే బూటకపు ఎన్కౌంటర్ చేసి చంపేసింది. ఈ సందర్భంలో అరుణోదయ పాట నరహంతక రాజ్యస్వభావాన్ని ఎండగట్టింది. **"వలను తెంపె సొరచేప ఆదమరిస్తివయ్యా అది నీ వేటకే తుపాకులతో బయలు దేరెనయ్యా.. శాంతిసమత దానికసలు గిట్టవంటనయ్యా ప్రజలమేలు దానికేది పట్టవంటనయ్యా.. నీతో కలిసి చర్చించిన హైద్రాబాదులోనే నిను బంధించిన చంపినా రాజ్యమెవరిదయ్యా.. రియాజూ రియాజూ"** అంటూ ప్రభుత్వ కుట్రకోణాన్ని బట్టబయలు చేసింది. బూటకపు ఎన్కౌంటర్లు జరిగిన ప్రతి సన్నివేశాన్ని ఒడిసిపట్టుకున్న అరుణోదయ విప్లవకారుల త్యాగాలను ఎత్తిపడుతూ, రాజ్య నిర్బంధ దోరణులను ప్రజల

ముందుంచింది. **"బంధి విముక్తి బంధనాలు తొలిగినప్పుడే.. పొద్దుపొడుపు గుండెల్లోన పొడిసినప్పుడే"** అంటూ సందేశాన్ని పంచింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యను రూపొందించిన మహోన్నతమైన నాయకుల్లో ఒకడు, త్యాగి, భారతదేశం గర్వించదగిన వాగ్గేయకారుడు, ప్రజాగాయకుడు అయిన రామనర్సయ్య మీద అరుణోదయ **"అన్నా అమరుడురా మన రామనర్సయ్య"** అంటూ పాడిన పాట అజరామరం. **'మార్క్స్ బోధన చేసి, లెనిన్ బాటన నడిచి, మావో మార్గమే అనుసరించి భరత భూమిన చాటి, ప్రజల బాగును కోరి, ప్రజా సంఘాలు పెట్టి, ప్రగతి మార్గం చూపి, ప్రథమ శ్రేణిలో నిలిచిన'** ఒక ప్రజా సాంస్కృతిక సేనాని సమాజాన్ని ఎలా ప్రభావితం చేయగలరో, ప్రజా ఉద్యమంలో ఒక గొంతుక ఎటువంటి పాత్రను పోషించగలదో ఈ పాట తెలియజేస్తుంది. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడంలో ఒక అమరుడు చేసిన కృషిని మాత్రమే కాకుండా శ్రామికవర్గ నినాదాన్ని కూడా ఈ పాట ఎత్తిపట్టింది.

భారతదేశ అభివృద్ధికీ, పురోగమనానికి కులం అతిపెద్ద అవరోధం. సమాజంలోని ఏ ఒక్క రంగాన్ని కూడా అది వదిలిపెట్టలేదు. అన్ని జీవన రంగాలను పట్టిపీడిస్తూ మనుషుల మధ్య బలమైన అడ్డుగోడలు కట్టిందీ, పీడిత శక్తుల ఐక్యతకు అవరోధమై నిలబడిందీ కులమే. భారతదేశంలోని ఏ ప్రజా పోరాటమైన కుల సమస్యను విస్మరిస్తే దాని మనుగడే ప్రశ్నార్థకం కాకమానదు. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం కలిగిన అరుణోదయ కుల సమస్యను కూడా గుర్తించదగిన స్థాయిలోనే పరిగణంలోకి తీసుకుంది. మొత్తంగా సమాజంలో ఉన్న కుల సమస్యకు వ్యతిరేకంగా పోరాడుతూనే, పీడిత కులాల అంతర్గత సమస్యల పట్ల కూడా ప్రజాస్వామిక స్ఫూర్తితో వ్యవహరించింది. దళితుల్లో ఒకటైన మాల కులాన్ని పీడిత కులాలన్నింటికీ ప్రతీకగా రూపొందించి అరుణోదయ గానం చేసిన పాట, శ్రామిక కులాల జీవిత వాస్తవికతను పట్టిస్తుంది. **"భూమిలేని కూలి సైన్యం.. బువ్వలేని స్థితి దైన్యం.."** అంటూ సాగే ఆ పాటలో దళిత సమస్యకూ, భూమికీ ఉన్న గతితార్కిక సంబంధాన్ని ప్రజల భాషలో వ్యక్తం చేసింది. ప్రపంచంలో ఎక్కడైనా శ్రమలో పాల్గొనేవాళ్లే దీనులుగా, కూడు గూడు గుడ్డ లేకుండా జీవిస్తున్నారు. దానికి కారణం వారికి సంపద మీద హక్కు లేకుండా పోవడమే. నిర్దిష్టంగా భారతదేశ పరిస్థితులను పరిగణంలోకి తీసుకున్నప్పుడు.. ఈ దేశం వ్యావసాయిక దేశం. పీడితులు భూములను సాగు చేసి పంటలు పండిస్తుంటారు, కానీ వారికి శ్రమకు తగిన ఫలితం లేకపోగా, కనీసావసరాలు కూడా సరిగ్గా తీర్చుకోలేని పరిస్థితి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం దున్నేవారికే భూమి లేకపోవడం. బ్రిటీష్ పాలనా కాలంలో కెన్యా దేశంలో అయినా, భారతదేశంలోని తెలంగాణలో అయినా జరిగిన పీడిత ప్రజల సాయుధ పోరాటాల ప్రధాన ఎజెండా 'దున్నేవారికే భూమి దక్కాలి' అని. ఈ దేశంలో భూములను దున్నేవారు, పంటలను తీసేవారు ప్రధానంగా శ్రామిక కులాలే. వారి విముక్తి భూమి మీద హక్కులు సాధించడంలోనే ఉన్నాయనే మార్క్సిస్టు అవగాహన ఉన్నది కనుకనే అరుణోదయ శ్రామికులకూ, భూమికీ ఉన్న సంబంధాన్ని ప్రజలకు వివరించాలనుకున్నది. అదే సమయంలో భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను రాజ్యం ఎలా కాలరాస్తుందో కూడా ఈ పాట సునిశితంగా ఎలుగెత్తి చెప్పింది. కులవ్యవస్థను సృష్టించిన ఆధిపత్య కులాలు ఇవ్వాళ ఎలా కార్పొరేట్ శక్తులతో మిలాఖతై ప్రజలను పీడిస్తున్నాయో చెప్పడం కేవలం అరుణోదయ లాంటి విప్లవ సాంస్కృతిక సంస్థలకే సాధ్యం అని ఈ పాట రుజువు చేస్తుంది. అందుకే ఈ పాటలో ఇంకొకచోట **"దొరపటేళ్లు మనువు మనుమలు రాసిరమ్మా తలరాతలు"** అనే తాత్వికార్థాన్ని చెప్పే పాదాలున్నాయి. దళిత సమస్య గురించి అరుణోదయ గానం చేసిన పాటల్లో అత్యంత జనాదరణ పొందిన పాట **"మాదిగోళ్ల దప్పులొచ్చెనే.. మానవ హక్కుల దండోరేసి.."** అనేది. ఈ పాట అందించే సందేశం చాలా లోతైనది. **"కత్తికి తిత్తికి పొత్తుగలిపి పొతం జేసే విద్య నేర్చి.. కప్పదీసిన గోదల తోలును ఉప్పుతోని రాసి కడిగి.. కుళ్లిపోయే తోలునేమో బళ్లెమోలె తీర్చిదిద్ది.. తంగేడు తోడ్కతోని దాన్ని లందలోన నానబెట్టి.. లంద వాసన పీల్చుకోని లోకానికి గంధం పంచితే.. ఊరికావల నివాసాలు-తాటి కమ్మల ఆవాసాలు"** ఉండడమేంటని మాదగ సమాజం గుండె గొంతుకల్లో ఉన్న ఆవేదనను ఆకాశానికి వినిపించి, సభ్యసమాజాన్ని చైతన్యం చేసింది అరుణోదయ. అంతమాత్రమే కాదు.. మాదిగలు తయారు చేసిన తోలు పాత్ర లేని శ్రామిక కులాల ఉత్పత్తులేవీ లేవని చెప్పింది. ఈ పాటలోని సారాంశమంతా మాదిగల గొప్పదనం చెప్తున్నట్లు కనిపిస్తుంది గానీ, లోతుగా అర్థం చేసుకుంటే శ్రమజీవుల మధ్య అనివార్యమైన సంబంధాన్ని చెప్తుంది. అంతిమంగా భారత రాజ్యాంగం దళిత కులాలకు కేటాయించిన ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు దళితులందరికీ సామాజిక న్యాయం ప్రకారం దక్కాలనీ, అదే ప్రజాస్వామిక న్యాయం అనీ నొక్కిచెప్పింది. ఇట్లా ఉమ్మడి దళిత సమస్యలను, అంతర్గత సమస్యలను గానం చేస్తూనే, **"కష్టజీవులందరినీ కులాలుగా విడగొట్టిన.. మాలమాదిగల నడుమ మాసిపోని గీతలు గీసిన.. శ్రమతోటే మానవ జాతని.. పనిపాటే నాగరికతని.. అంటరాని హక్కుల బాటకు అపార్థాలు వద్దని చాటి.. ఆస్తిపాస్తుల్లేనివారే పోరులోన ముందుంటారని.. మాదిగోళ్ల దప్పులొచ్చెనే.."** అని, దళితులు అంతర్గత సమస్యలు పరిష్కరించుకొని అంతిమంగా చేయాల్సిన

ఐక్య పోరాటాన్ని గుర్తు చేసింది అరుణోదయ. ఈ సాంస్కృతిక వ్యాన్‌గార్డ్ అక్కడితోనే ఆగిపోలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దళితుల మీద ఎక్కడ ఏ దాడి జరిగినా, వెనువెంటనే అక్కడికి చేరుకొని అగ్రవర్ణ దురహంకారాన్నీ, ఆధిపత్య శక్తుల కౌటిల్యాలనూ ప్రశ్నించింది, పీడిత కులాల గొంతుకై నిలబడింది.

సమాజంలో ఉన్న పీడితులందరిలో పీడితులు స్త్రీలు. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా అన్ని దేశాల్లో, అన్ని సమాజాల్లో అందరికంటే ఎక్కువగా హింసకు గురయ్యేది మహిళలే. స్త్రీ విముక్తి విప్లవంలోనే ఉన్నది అనే ఎరుక ఉన్నది అరుణోదయ దృక్పథం. బ్రాహ్మణీయ హిందూత్వం, కార్పొరేట్ శక్తుల విషపూరితమైన భావజాలం రెండూ కలిసి సమాజంలో వ్యాపింపజేసిన సంస్కృతి మూలంగా మహిళల మీద.. మరీ ముఖ్యంగా ఆడపిల్లల మీద జరుగుతున్న లైంగిక దాడుల మీద అరుణోదయ వెలువరించిన పాటలు హృద్యమైనవి. **"చిన్నారీ ఓ చిన్నారీ.. నా కంటి వెలుగుల నా పాపాయీ.. నిన్ను చిదిమేసిన ఆ చేతులెవరివీ.. ఆ కాలయములు ఎవరురా.."** అనే పాటను జాగ్రత్తగా వింటే మహిళా సమస్య వెనుకున్న శక్తుల నిజస్వరూపం అవగతమవుతుంది. **"ఆ చేతులెవరివి"** అన్న మాటలోనే స్త్రీ సమాజానికి శత్రువు ఎవ్వరు, ఏమిటి అనేది విశదమవుతుంది. ఇట్లా స్త్రీ సమస్యల మీద అరుణోదయ వెలువరించిన పాటలు అనేకం. తొంభైలలో ప్రారంభమైన ప్రపంచీకరణ విధ్వంసం గురించి కూడా అరుణోదయ అనేక పాటలు వెలువరించింది. నూతన ఆర్థిక విధానాల పుణ్యమా అని గ్రామాలు ఖాళీ అయిపోయి, వలస బాటపట్టిన ప్రజలు ఎందరో ఉన్నారు. అట్లా వలస వెళ్లిన భర్తల కోసం భార్యలు, కొడుకుల కోసం తల్లులు పడిన ఆవేదనను కూడా అరుణోదయ గానం చేసింది. **"పొట్టగడవ పొద్దులేక.. బతుకుదెరువు దిక్కులేక.. ఎద్దెవుసం ఏట్లబాయె ఎరువు సెలక అమ్ముదాయె.. ఊరు నిన్ను సాగనంపెనా ఓ మామో సెందురయ్య.. కరువు నిన్ను ఎల్లగొట్టెనా నా మామో సెందురయ్య"** అంటూ సాగే ఈ పాట తెలంగాణలోని గ్రామాల విషాదకర పరిస్థితులను కళ్లముందు ఉంచింది. **"కంటినీళ్ల కాపురాలురో.. ఏండ్ల కొద్ది ఎదురు చూపులో"** అంటూ ఇంటి ఆదెరువైన పురుషుల కోసం మహిళలు పడే ఆవేదనను రోధనాభరితంగా గానం చేసింది.

తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కల అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అరుణోదయది ప్రత్యేకమైన స్థానం. మార్క్సిస్టు భావజాలం కలిగిన వ్యక్తులు, శక్తులకు ప్రత్యేక తెలంగాణ కోసం మిలిటెంట్ పోరాటాలు చేయాలనే అవగాహన ఉన్నది. కానీ సైద్ధాంతిక అవగాహనను కార్యాచరణగా మార్చింది అరుణోదయ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2009లో ప్రారంభమైన మలిదశ ఉత్తరార్థ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణ ప్రజలందరికీ తీరని శోకాన్ని మిగిల్చిన ప్రతీఘాతుక ఉద్యమానికి నాయకత్వం వహించింది బడా పెట్టుబడిదారుడైన లగడపాటి రాజగోపాల్. ప్రజల చెమటానెత్తురులను జుర్రుకొని ఆయన నిర్మించిన 'ల్యాంకో హిల్స్' మీద ఎర్రజెండా ఎగురవేసి జైలు గోడలను ముద్దాడింది అరుణోదయ. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో కేసీఆర్ పార్టీ పెట్టకముందే.. 1996 కాలంలో ప్రజా తెలంగాణ డిమాండ్‌ను ముందుకు తీసుకొచ్చి, ప్రజలను చైతన్యం చేయడంలో అరుణోదయ కీలకమైన పాత్ర పోషించింది. **"జనం దరువు"** పేరుతో సూర్యాపేటలో జేయేసీ పేరు మీద పెట్టిన మీటింగ్‌లో అరుణోదయ కీలకమైన భూమిక పోషించిన చరిత్ర ఉన్నది. **"దప్పుల్ల ఎయ్ దరువెయ్ రా.. దప్పుల దరువేసి ఆడంగా తెలంగాణ లేసి పాడంగా..గల్లున గజ్జెలు మోగంగా జిల్లలన్ని పిడికిలెత్తంగా.. పల్లెలు కోలాటమాడంగా.. పట్నాలు చిందేసి దుంకంగా.. బతుకమ్మ ఆటరా.. బోనాల జాతరా.."** అంటూ తెలంగాణ సబ్బండ జనాల ఉద్యమ నినాదాన్ని గానం చేసిన అరుణోదయ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను చాటిచెప్పిన సంస్థల్లో ముందువరుసలో నిలబడింది. **"ఆడుదాం దప్పుల్లో దరువెయ్‌రా.. పల్లే తెలంగాణ పాట పాడరా"** అనే పాట తెలంగాణ ప్రజల చెవుల్లో నాడే కాదు నేటికీ మార్మోగుతూనే ఉంది. మలిదశ తెలంగాణ ఉద్యమం పుట్టుకురావడం వెనుక ఆంధ్రా పెట్టుబడిదారులు ప్రపంచబ్యాంకు తాబేదార్లతో కుమ్మక్కై చేసిన కుట్రలను బట్టబయలు చేసే నేపథ్యం ఉన్నదని ఈ పాట తెలియజేస్తుంది.

ఇట్లా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గడిచిన ఈ యాభై సంవత్సరాలలో అడ్రస్ చేయని ఏ సామాజిక సమస్యా లేదు. ప్రజల సమస్యల మీద పోరాడడం కోసం ఎక్కడ తన అవసరం ఉందో, అక్కడికి తప్పకుండా వెళ్లి ప్రజల పక్షాన నిలబడి, ప్రజాగానం చేసింది. వర్తమానంలో ప్రజల మీద అమలవుతున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని శక్తివంచన లేకుండా ఎదిరించే కార్యక్రమాన్ని తీసుకున్నది. ఈ యాభై సంవత్సరాలలో అరుణోదయ తయారు చేసిన వందలాది కళాకారులు తెలంగాణలోని అనేక గ్రామాల్లో ఉన్నారు. ఎందరెందరో తమ లక్ష్యం కోసం చేసే ప్రయాణంలో అమరులయ్యారు. సమాజ గమనాన్ని అర్థం చేయించే వందలాది పుస్తకాలు కూడా అరుణోదయ ప్రజల కోసం, ప్రజల భాషలో ప్రచురించింది. ఇట్లా.. తాను ఎంచుకున్న లక్ష్యంలో అలుపెరుగని పోరాటం చేస్తున్న అరుణోదయ, భవిష్యత్తులో ప్రజాపోరాటంలో గతంలోవలెనే కొనసాగాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. T

## తొవ్వ ముచ్చట

# ప్రజల వెంట నడవడమే నా సాహిత్య ప్రయోజనం

– పి.చంద్

ఇంటర్వ్యూయర్: బొడ్డుపల్లి అఖిల్

*యాభై ఏళ్ల క్రితం కల్లోల కాలమొకటి తెలుగు నేలను తాకింది. అది మట్టి మనుషులు అందరూ ఒక్కటై వాళ్ళ వెట్టి బతుకులపైన తిరుగుబాటు చేసిన కాలం. సాహిత్యాన్ని 'నువ్వు ఎటువైపు నిలబడతావని' నిర్దాక్షిణ్యంగా ప్రశ్నించిన కాలం. ఆ కాలం సాహిత్యకారులకు నిర్దిష్ట సాహిత్య ప్రయోజనాన్ని నిర్ణయించింది. ఆనందాలను, మోక్షాలను పక్కకునెట్టి ప్రజలే అంతిమ సాహిత్య ప్రయోజనం అని నినదించింది. ఆ కాలంలో అనేకమంది సాహిత్యకారులు బయటికి వచ్చారు. ప్రజల, ప్రజా పోరాటాల పక్కకు వాళ్ళ అక్షరాలను నిలబెట్టారు. అందులో కొంతమంది సాహిత్యకారులు వాళ్ళ పేర్లను కూడా ప్రపంచానికి చెప్పలేదు. ఆ వెల్లువలో వచ్చిన ఒక రచయిత మట్టిలోపల రాలుతున్న చెమట చుక్కలను అక్షరాలుగా బయటికి తీసాడు. శ్రామికులు తట్టల్లో నింపుకున్న కన్నీళ్లను చమ్మాస్ తో వాక్యాల్లోకి నింపాడు. అభివృద్ధి మింగిన ప్రకృతి ఘోషను ఆర్ద్రంగా అక్షరీకరించాడు. అతను పుస్తకాలలో వినిపించిన సింగరేణి కార్మికుల సమ్మె సైరన్. పదుల కలాల పేర్లతో పలికిన ప్రజా పోరాటం. దశాబ్దాల అజ్ఞాత సాహిత్య ప్రయాణం. నాలుగు అక్షరాలు రాసి గుర్తింపు అడుక్కుంటున్నకాలంలో పదుల్లో పుస్తకాలు రాసినా, అక్షరాల మధ్యలోనే దాక్కున్న శ్రామిక వర్గ రచయిత పి. చంద్(పూరుగొండ యాదగిరి)తో నడుస్తున్న తెలంగాణ తరపున బొడ్డుపల్లి అఖిల్ జరిపిన సంభాషణ.*

**1. మీ బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగ జీవితాన్ని తెలియజేయండి?**

నేను సెప్టెంబర్ 11, 1954లో వరంగల్ లోని ఉర్సు ప్రాంతంలో పుట్టాను. మా నాన్న పూరుగొండ మల్లయ్య అజాంజాహీ మిల్లు కార్మికునిగా పని చేసేవారు. అమ్మ వీరమ్మ బీడీ కార్మికురాలు. మేముండే ప్రాంతంలో ఎక్కువగా కూలీలు, హమాలీలు, రిక్షా కార్మికులు, చేతి వృత్తులు చేసుకుని బతికే వాళ్లు ఉండేది. అంతో ఇంతో అక్షరజ్ఞానం ఉన్న వాళ్ళు దుకాణాల్లో గుమస్తాలుగా పనిచేసేవారు. ఒక విధంగా చెప్పాలి అంటే ఏ రోజుకు ఆ రోజు రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప బ్రతుకు గడవని పరిస్థితి ఉండేది. చుట్టూ బీదరికం, కష్టాలు, కన్నీళ్లు చూస్తూ పెరిగాం. ఆ రోజుల్లో ఇంట్లో పిల్లలు చదువుకోవటం కూడా కష్టంగా ఉండేది. కాస్త అక్షరాలు తెలిసి నాల్గో, ఐదో చదివేసరికి ఏదో ఒక పనిలో చేరిపోయేవాళ్ళు. వీటికి తోడు తాగుడు వంటి వ్యసనాలకు బలై చాలా కుటుంబాలు చితికిపోయేవి.

మా ఇంటి పక్కనే ఉన్న వేంకటేశ్వర ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివి ఉర్సు హై స్కూల్లో పదవతరగతి వరకు చదివాను. తర్వాత హనుమకొండలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, లాల్ బహదూర్ కాలేజీలో డిగ్రీ చదివాను. మేము ఎదిగి వచ్చిన కాలం సమాజంలో పెను మార్పులు జరిగిన కాలం. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వచ్చింది. హై స్కూల్ విద్యార్థులుగా మేము అందులో పాల్గొన్నాం. అప్పటి పాలకులు ఆ ఉద్యమాన్ని దారుణంగా అణచివేయడంతో ప్రజల అసంతృప్తి విప్లవోద్యమానికి నేపథ్యమైంది. మేం డిగ్రీ చదువుకునే రోజుల్లో విప్లవ విద్యార్థి ఉద్యమాలకు అంకురార్పణ జరిగింది. ఆ రోజుల్లో వరంగల్లో రాడికల్ విద్యార్థి సంఘం చాలా బలంగా పనిచేసి ఆ తరం వారిపై ప్రభావం చూపింది. ఆ ఒరవడిలో కొట్టుకు పోయి పనిచేస్తున్న క్రమంలోనే ఎమర్జెన్సీలో అరెస్టు కావడం, రంగసాయిపేట పోలీస్ స్టేషన్ లాకప్లో మూడు నెలల చిత్రహింసల తర్వాత డి.ఐ.ఆర్ లో జైలుకు పంపారు. కేంద్రంలో జనతా ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసులు ఎత్తివేసారు. మే 1977లో సింగరేణిలో క్లర్క్ గా ఉద్యోగం వచ్చింది. కానీ అక్కడ బొగ్గు గని కార్మికుల దుర్భర పరిస్థితులు చూసిన తర్వాత కష్టజీవుల బ్రతుకులు ఎక్కడ చూసినా ఒక్క తీరుగానే ఉన్నాయని అర్థమైంది. ఎక్కడో ఒక చోట నిలబడి పోరాడకుండా ప్రజల బతుకులు మారయని స్థిరమైన అభిప్రాయం ఏర్పడింది.

**2. పూరుగొండ యాదగిరి పి. చంద్ గా మారిన పరిస్థితి గురించి చెప్పండి? సాహిత్య రంగం మీకు ఎప్పుడు పరిచయం అయింది?**

సింగరేణి ఆవిర్భవించి అప్పటికి దాదాపు శతాబ్దకాలం అయింది. కానీ కార్మికుల దుర్భర పరిస్థితులలో మార్పులేదు.



సింగరేణి ఆవిర్భవించిన తొలి యాభై ఏళ్ళలో ఎటువంటి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు లేవు. అందుకు యాజమాన్యంలో కీలకంగా వ్యవహరించిన బ్రిటీష్ వలసవాదుల కుట్రలు ఒక కారణమైతే నిజాం పాలనలోని ఫ్యూడల్ దోపిడి మరో కారణం. ఆ నేపథ్యంలోనే సింగరేణి బొగ్గుగనులలో కామ్రేడ్ దేవూరి శేషగిరిరావు నాయకత్వంలో కమ్యూనిస్టులు సింగరేణిలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు చేపట్టారు. 1940 ప్రాంతంలో సింగరేణిలో మొట్టమొదటి ట్రేడ్ యూనియన్ స్థాపించారు. యూనియన్ నాయకత్వంలో కార్మికులు అనేక పోరాటాలు చేపట్టి అనేక హక్కులు సాధించారు. కాంట్రాక్టు విధానం రద్దు చేయించగలిగారు. స్త్రీలను అండర్ గ్రౌండ్లో పని చేయించే విధానం రద్దయింది. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలైనాయి. కానీ 1948, మే 15నాడు దేవూరి శేషగిరిరావును నిజాం పోలీసులు కాల్చి చంపారు. తర్వాతి కాలంలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాట విరమణ ప్రకటన చేయడం, క్రమంగా కమ్యూనిస్ట్ పార్టీలో రివిజనిజం ప్రబలిపోయింది. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ఆర్థిక పోరాటాలకే పరిమితం కావటం, దాని నాయకులు ఫక్తు పైరవీ కారులుగా మారటంతో కార్మికుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. మరోవైపు కాలరీ ప్రాంతంలో గుండాల గుండాయిజం మొత్తంగా కార్మికుల పరిస్థితి దుర్భరంగా మార్చింది.

ఈ నేపథ్యంలోనే హైదరాబాద్, వరంగల్ వంటి దూరప్రాంతాలకు చదువుకోసం వెళ్లిన కార్మికుల పిల్లలు విప్లవభావాలతో ప్రభావితులై కార్మికుల బ్రతుకుల్లో మార్పు తీసుకురావడంతో సింగరేణి విప్లవ కార్మికోద్యమానికి బీజాలు పడ్డాయి. కానీ ఈ లోపు ఎమర్జెన్సీ ప్రకటనతో కొంత స్తబ్దతకు లోనై జనతా ప్రభుత్వంలో దొరికిన వెసులుబాటు కాలంలో నిర్దిష్టమైన రూపం సంతరించుకుంది. కార్మికులు తమ సమస్యలపై పోరాడడం మొదలైంది. ఇలా వెల్లువెత్తిన కార్మికుల పోరాటాలను అణచటానికి ప్రభుత్వం అనేక నిర్బంధాలను అమలు జరిపింది. ఈ నేపథ్యంలో కార్మికుల సమ్మెలను అణచటానికి మేనేజ్మెంటు బ్రిటీష్ కాలంనాటి మస్టర్ల కోత చట్టాన్ని అమలు జరిపింది. దానికి వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు యాభై ఆరు రోజులు వీరోచిత సమ్మె పోరాటం చేసారు. ఆ సమ్మె సందర్భంగానే విప్లవ కార్మిక సంఘం 'సింగరేణి కార్మిక సమాఖ్య' ఆవిర్భవించింది. అటు తరువాత కాలంలో అనేకమైన పోరాటాలు చేసి భారత కార్మికోద్యమ చరిత్రలోనే నూతన అధ్యాయం సృష్టించింది. సికాస తీవ్ర

నిర్బంధాలను ఎదుర్కొన్నది. మెరకల్లాంటి దాదాపు వందమంది విప్లవకారులు పోలీసులు జరిపిన బూటకపు ఎన్కౌంటర్లో అమరులైనారు. కార్మికుల న్యాయమైన పోరాటాలను, వారికి నాయకత్వం వహించిన పోరాటయోధుల త్యాగాలను ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలియచేయాలనే లక్ష్యంతోనే నేను సాహిత్యం రాసాను.

ఇక మీ ఇంకో ప్రశ్న సాహిత్యం ఎప్పుడు పరిచయం అయ్యింది అన్నదానికి సమాధానం చెప్పాలంటే కొంత కష్టమే. ఎందుకంటే నా చుట్టూ ఉన్న జనం ఇంత కష్టపడ్డా ఎందుకు వాళ్ళ బ్రతుకులు బాగుపడడం లేదు అనే ప్రశ్న నా అంతరాంతరాల్లో వేధించేది. దానికి సమాధానం వెతుక్కునే క్రమంలోనే నేను విపరీతంగా పుస్తకాలు చదివేవాన్ని. మొదట అణా, పది పైసలకు కిరాయికి దొరికే డిటెక్టివ్ నవలలు మొదలుకొని క్రమంగా కథలు, నవలలు, సామాజిక, తాత్విక అంశాల వరకు విపరీతంగా చదవటం అలవాటైంది. క్రమంగా నా ఆలోచనలు విస్తరించి ఒక నిర్దిష్ట రూపం తీసుకొని నేను ఎవరివైపు నిలబడాలో తేల్చిచెప్పింది. దీనికి తోడు ఆనాటి కాలమాన పరిస్థితులు దోహదపడ్డాయి. నేను అర్థం చేసుకున్న, పరిశీలించిన విషయాలు బయటి ప్రపంచానికి తెలియజేయాలన్న తపన నన్ను సాహిత్యకారున్ని చేసింది.

**3. దాదాపుగా ఇరవై మారుపేర్లతో సాహిత్యాన్ని రాశారు. కారణం ఏమిటి?**

బహుశా అంతకుమించి ఎక్కువే అయి ఉంటాయి. ఎందుకంటే చిన్న కాగితం ముక్క దొరికినా చంపేసిన రోజులవి. రాజ్యహింస తీవ్రస్థాయిలో కొనసాగింది. అటువంటి సమయంలో విప్లవోద్యమం గురించి ప్రజలు చేస్తున్న పోరాటాల గురించి రాయడం అంటే చావును కొని తెచ్చుకోవటమే. మరోవైపు రాయకుండా ఉండలేని పరిస్థితి. అందుకే అనేక మారుపేర్లతో రాయాల్సి వచ్చింది. కొన్ని పేర్లయితే నాకు కూడా గుర్తులేవు. ఎప్పటికప్పుడు ఏదో ఒక పేరుతో పంపేవాన్ని. అది కాకుండా స్థానిక పత్రికలకు లేబరోని గోదు, తుపాకి రామన్న కథలు, తట్టా చమ్మాస్ వంటి శీర్షికలతో వ్యాసాలు రాసాను. చాలా పత్రికలకు బినామీగా వ్యాసాలు రాసేవాన్ని. సింగరేణిలో 1997 తర్వాత సంస్కరణల అమలు మొదలైన తర్వాత పరిణామాల గురించి ఒక 'కేసు స్టడీ'లా పరిశీలన చేసి 'సింగరేణి సంస్కరణలు ఒక పరిశీలన' అన్న పుస్తకం రాసాను. ఈ పుస్తకం సంస్కరణల బండారాన్ని నగ్నంగా బయటపెట్టింది. మేనేజ్మెంట్ ఏమి చేయలేక ఆ పుస్తక ప్రతులను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి తగలబెట్టింది. ఇంకా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ బొగ్గు సంపద ఎలా తరలించుకుపోతున్నారో, ఎంత సంపద కొల్లగొడుతున్నారో సవివరంగా తెలియజేస్తూ 'సింగరేణి వ్యాసాలు' రాసాను. సింగరేణి వ్యాసాలు, తెలంగాణ వ్యాసాలు పుస్తకాలుగా వచ్చాయి. ఇలా ఇంకా చాలా పుస్తకాలు రాసాను. వేజు బోర్డు పేరు మీద కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని, వాస్తవానికి విరుద్ధంగా తప్పుడు లెక్కలతో ఎలా మసిపూసి మారేడు కాయ చేస్తున్నారో తెలియజేసే 'బొగ్గు గని కార్మికుల వేతన ఒప్పందాలు ఒక పరిశీలన' వంటి పుస్తకాలు రాసాను. అయితే ఇవన్నీ కూడా నా పేరు మీద కాకుండా మిత్రుల పేరు మీద, సంస్థల పేరు మీద వచ్చినవి. వాస్తవాలు తెలియజెప్పాలనే కోరిక ఒక వైపు. మరోవైపు సింగరేణిలో పనిచేస్తూ మేనేజ్మెంటుకు వ్యతిరేకంగా వాస్తవాలు రాయడం వలన వచ్చే సమస్యలు, రాజ్యహింస వంటి అనేక కారణాల వలన ఉద్దేశపూర్వకంగానే అజ్ఞాత రచయితగా పనిచేయాల్సి వచ్చింది.

**4. అంటే మీరు కథలు, నవలలే కాకుండా వ్యాసాలు కూడా రాసారా?**

అవును. ఇలా రాసినవి దాదాపు పది నుండి పదిహేను పుస్తకాలున్నాయి. ఇవి కాకుండా సింగరేణిలో విప్లవ కార్మికోద్యమ చరిత్రను పుస్తకంగా రాసాను. అది ఇంకా అముద్రితంగానే ఉంది.

**5. మీ రచనలు ఎక్కువగా సింగరేణి కార్మికోద్యమం, విప్లవోద్యమం కేంద్రంగా సాగినవి. అందుకు కారణం ఏమిటి?**

అందుకు కారణం బహుశా నేను నడిచిన వచ్చిన కాలం కావచ్చు. కార్మిక కుటుంబంలో పుట్టి ఉద్యోగ రీత్యా కార్మికుల మధ్య పని చేసాను. ముఖ్యంగా నేను పని చేసిన కాలంలో కార్మికులు చైతన్యవంతులై తమ హక్కుల కోసం, అణచివేతలకు వ్యతిరేకంగా, దోపిడికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాలం. అంతవరదాక భయం భయంగా బ్రతికిన కార్మికులను చైతన్యపరిచి విప్లవోద్యమం వారిని పోరాడే యోధులుగా మార్చిన కాలం. నా చుట్టూ జరిగిన, జరుగుతున్న పరిణామాలను సమాజానికి తెలియచెప్పాలనే లక్ష్యంతోనే సింగరేణి కార్మిక సాహిత్యం రాసాను.

అదే సమయంలో ఒక్క సింగరేణి పోరాటాలే కాదు. అటు అదిలాబాద్ గిరిజనుల పోరాటాలు, ఇటు మైదాన ప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా 'దున్నేవానికి భూమి'

అనే నినాదంతో రైతు కూలీలు ఉవ్వెత్తున పోరాటాలు చేస్తున్న సందర్భం అది. ఈ మొత్తం ప్రభావం నా సాహిత్యం మీద ఉంది. అందుకే గిరిజనుల మీద, రైతు కూలీల మీద, అమరుల త్యాగాల మీద అనేక నవలలు, కథలు రాసాను.

**6. మలిదశ తెలంగాణ ఉద్యమ కేంద్రంగా రాసిన సాహిత్యం గురించి చెప్పండి?**

మలిదశ ఉద్యమం జరుగుతున్న కాలంలో ఆ ఉద్యమం యొక్క న్యాయబద్ధత గురించి రాసిన కథలు వచ్చినవి. అదే సమయంలో ఉద్యమం జరుగుతున్న కాలంలోనే ఉద్యమం మీద రెండు నవలలు రాసాను. అందులో ఒకటి 'తెలంగాణ తల్లి'. రెండోది 'సకల జనుల సమ్మె'. తెలంగాణ తల్లి నవలలో మూడు తరాలుగా తెలంగాణలో జరుగుతున్న సాయుధ పోరాటం గురించి తెలియజేస్తే, సకల జనుల సమ్మె నవల 2011లో జరిగిన సకల జనుల సమ్మె పోరాటాన్ని సింగరేణి కార్మికులు ఎలా విజయవంతం చేసారో కళ్లకు కదుతుంది. అటు తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక కూడా టి. ఆర్. ఎస్. ప్రభుత్వం కూడా ప్రజలను ఎలా మోసం చేసిందో 'శవయాత్ర', ' స్థూపం', ' ప్రజలు అజేయులు' వంటి కథలు తెలియజేస్తాయి.

**7. తెలుగు సాహిత్య ప్రస్థానంలో విప్లవ సాహిత్య స్థానాన్ని మీరు ఏ విధంగా చూస్తారు?**

విప్లవ సాహిత్యం ప్రధానంగా ప్రజలకు సంబంధించింది. అసమానలతో, దోపిడితో కూడుకున్న ప్రస్తుత సమాజంలో ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు అనేక త్యాగాలతో పోరాడుతున్నారు. విప్లవ సాహిత్యం అలా పోరాడే ప్రజలకు తోడుగా నిలవాలి. వారి ఆకాంక్షలను వ్యక్తపరచాలి. వారి న్యాయబద్ధ పోరాటాలను ఎలుగెత్తి చాటాలి. వారి పోరాట అనుభవాలను రికార్డు చేసి ముందు తరాలకు అందించాలి. ప్రజల పోరాటాలకు నైతిక మద్దతు ప్రకటించాలి. వారి పోరాటాలు ముందుకు సాగేలా విప్లవ సాహిత్యం దోహదపడాలి. అయితే ప్రజలు చేస్తున్న విస్తృత స్థాయి పోరాటాలను అక్షరబద్ధం చేసి సమాజానికి అందించడంలో సాహిత్యకారులు వెనకబడే ఉన్నారనిపిస్తుంది. అంటే ప్రజలు పోరాటం చేస్తున్నంత స్థాయిలో విప్లవ సాహిత్యం రావడం లేదు. ఈ ఖాళీని సాహిత్యకారులు పూరించాలి. విస్తృత స్థాయిలో ఇంకా రచనలు రావాలి. ఇక మిగతా సాహిత్యం గురించి అంటారా ? ఎవరి బాధ వారిది. వాళ్ళ బాధలను వాళ్ళు చెప్పుకోనీయ్.

**8. విప్లవ నవలకు మీరిచ్చే నిర్వచనం ఏమిటి ? విప్లవ నవలలో శైలి, శిల్ప నిర్మాణం ఎలా ఉండాలి?**

విప్లవ సాహిత్యం గురించి ముందు ప్రశ్నలో కొంత వివరించాను. ఇక విప్లవ నవల గురించి చెప్పాలంటే ముఖ్యంగా నవలా ప్రక్రియలో విస్తృత స్థాయి జీవితాన్ని చిత్రించే అవకాశం ఉంటుంది. చదివే పాఠకులను కూడా ఆ కాలమాన పరిస్థితుల్లోకి తీసుకుపోయి పాఠకుడిని అనుభూతి చెందేలా చేస్తుంది. ఆ మేరకు పాఠకులపై ప్రభావం చూపుతుంది. అందుకోసం రచయిత కొంత హెూం వర్కు చేయాలి. ముఖ్యంగా విప్లవోద్యమం మీద నవల రాయాలనుకున్నప్పుడు మనం ఏ విషయం మీద రాయాలనుకుంటున్నామో ఆ విషయం మీద సమగ్రంగా అధ్యయనం చేయాలి. ప్రతి చిన్న విషయం పట్ల శ్రద్ధ పెట్టి అవగాహన చేసుకోవాలి. అవసరమైన నోట్స్ రాసుకోవాలి. విప్లవోద్యమం బయట ఉండి విప్లవోద్యమం మీద ఏదైనా నవల రాయాలి అనుకునే వాళ్ళు మరింత కష్టపడాలి. ఆ ఉద్యమంతో అనుబంధం ఉన్న ప్రత్యక్ష, పరోక్ష వ్యక్తులను కలిసి అనుమానాలు ఏవైనా ఉంటే నివృత్తి చేసుకోవాలి. ఇలా విషయ సమగ్రత చేకూర్చుకున్న తర్వాత దాన్ని కళాత్మకంగా పాఠకుల హృదయాలను ఆకట్టుకునేలా రాయడానికి పూనుకోవాలి. ఇక శైలి, శిల్పాల విషయానికి వస్తే ఎంత గొప్ప విషయాన్ని అయినా పేలవంగా చెబితే అది విఫల ప్రయోగం అవుతుంది. ఉదాహరణకు చెప్పాలంటే మన దగ్గర బంగారం ముద్ద ఉంది కదా అని దాన్ని మెడలో వేసుకుని తిరగలేము. దాన్ని అందమైన నగగా చేసినప్పుడే దానికి అందం వస్తుంది. అలాగే రచనకు శైలి, శిల్పాలు కూడా ఎంతగానో దోహదపడతాయి. వాటిని అధ్యయనం చేయడం ద్వారా, అభ్యాసం ద్వారా రచనను మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది. అంతిమసారంలో పాఠకున్ని ఆకట్టుకునేలా చెప్పకుంటే మన శ్రమ విఫలమవుతుంది.

**9. చాలావరకు జీవిత చరిత్రలే నవలలుగా రాసారు ఎందుకు?**

నిజమే. నేను రాసిన నవలలు సగానికి పైగా జీవిత చరిత్రలుగానే సాగినవి. వాస్తవానికి నేను వ్యక్తుల జీవిత చరిత్రలు రాసినప్పటికీ వాళ్ల వ్యక్తిగత జీవితంతో పాటు వాళ్లు నిర్మించిన ఉద్యమాల గురించి, ఆ కాలమాన పరిస్థితుల గురించి చెప్పటమే లక్ష్యంగా రాసాను. మరో మాటలో చెప్పాలంటే ఆయా ఉద్యమాల గురించి చెప్పాలనే లక్ష్యంతో ఆ ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తుల జీవితాన్ని ఆధారంగా చేసుకొని రచనలు చేసాను. ఈ క్రమంలో తొలినాటి సింగరేణి కార్మిక ఉద్యమాన్ని చిత్రించే ప్రయత్నంలో

భాగంగా 'శేషగిరి' నవల రాసాను. సింగరేణిలో విప్లవ కార్మికోద్యమం ప్రారంభాన్ని చెప్పటానికి 'విప్లవాగ్ని', 'నెత్తుటి ధార', 'వీరుడు' నవలలు రాసాను. అలాగే అరవై ఏళ్ళ భారత కార్మిక ఉద్యమంతో పెనవేసుకుపోయి అంతర్జాతీయ కార్మిక సంఘం అధ్యక్షునిగా పనిచేసిన కే.ఎల్. మహేంద్ర జీవిత చరిత్ర ఆధారంగా 'అంతర్జాతీయ శ్రామికు యోధుడు' నవల రాసాను. బుర్ర చిన్నన్న (మాధవ్) జీవితం ఆధారంగా పాతికేళ్ల నల్లమల విప్లవోద్యమం గురించి 'నల్లమల' నవల రాసాను. మూడు తరాల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని, అందులో భాగస్వామి అయినా సంగంరెడ్డి సత్యనారాయణ (ముచ్చర్ల సత్యనారాయణ) జీవితం ఆధారంగా 'ధిక్కారకెరటం' నవల రాసాను. నిజాం కాలం నాటి మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అనామక పోరాట యోధుల అసమాన త్యాగాలకు ప్రతినిధిగా 'బండ్రు నరసింహులు' నవల వచ్చింది. సింగరేణిలో అమలు జరిగిన రాజ్య హింసను తెలిపేందుకు బాలగోపాల్ కేంద్రంగా 'హక్కుల యోధుడు' నవల రాసాను. ఇట్లా జీవిత చరిత్రల ఆధారంగా వచ్చిన నవలలన్నీ దాదాపుగా ఆయా ఉద్యమాల గురించి చెప్పే క్రమంలోనే వచ్చినవే. అయితే నేను రాసిన నవలల్లో జీవిత చరిత్రలే కాదు. పర్యావరణ సమస్యల మీద, తెలంగాణ ఉద్యమం మీద, మానవ సంబంధాల మీద, జనం జీవితం మీద రాసినవి కూడా చాలా ఉన్నాయి

**10. ఇంతవరకు మీరు ఎన్ని నవలలు రాసారు?**

దాదాపు ముప్పై నవలలు రాసాను. అందులో ఇరవై నాలుగు మాత్రమే ప్రచురణ అయినవి. ఇంకా పది నవలలు ప్రచురించాల్సి ఉంది.

**11. మీరు రాసిన నవలల్లో స్త్రీ పాత్రల గురించి చెప్పండి?**

సమాజంలో సగభాగమైన స్త్రీలు పాల్గొనకుండా ఏ పని ముందుకు సాగదు. ఏ ఉద్యమం విజయవంతం కాదు. శత్రువు పెద్ద ఎత్తున కేంద్రీకరించి కార్మికుల పోరాటాలను అణచివేయడానికి చూసినపుడు విప్లవకారులను కడుపులో పెట్టుకొని దాచుకున్నది, తాము తినే కంచంలోని అన్నం ముద్దపెట్టి సాదుకున్నది స్త్రీలే. తీవ్ర నిర్బంధ పరిస్థితి ఉన్నప్పుడు విప్లవకారులు బయటికి పోలేని సందర్భంలో తమ కడుపులో పుట్టిన పిల్లల మలమూత్రాలను ఎత్తివేసినట్టు ఎత్తివేసి కాపాడుకున్నది స్త్రీలే. వాళ్ళ సహాయ సహకారాలు లేకుంటే సింగరేణిలో విప్లవకార్మికోద్యమం మనుగడ కొనసాగించేదా? అటువంటి స్త్రీల పాత్ర లేకుండా విప్లవ సాహిత్యం ఎలా ఉంటుంది? శేషగిరి నవలలో కామమ్మ, దార కనకమ్మ, శాంతమ్మ, జుట్టు పోచమ్మ పాత్రలు ప్రధానంగా కనిపిస్తాయి. నెత్తుటి ధార నవలలో సింగరేణి విప్లవోద్యమంలో తొలి మహిళా అమరురాలైన 'జిలాని బేగం' చుట్టే కథ నడుస్తుంది. ఆశ్రయం పొందిన విప్లవకారుల్ని చుట్టుముట్టిన పోలీసుల నుండి రక్షించడం కోసం చివరి క్షణం వరకు ప్రయత్నించి అమరురాలైన 'నిరంజన' త్యాగం ఎవరికి తీసిపోనిది. అంతర్జాతీయ శ్రామిక యోధుడు నవలలో కె. ఎల్. మహేంద్ర సతీమణి 'ప్రమీలాతాయి'. ఈమె ఆ రోజుల్లోనే ఉన్నత చదువులు చదివి ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిర్వహించిన పాత్ర, ఆమె చేసిన సాహసం అసమాన్యమైనది. నా నవలలోనే కాకుండా కథలలో కూడా త్యాగమయ స్త్రీ పాత్రలు ఎన్నో ఉన్నాయి. 'అమ్మ కథ'లో తన కొడుకును పోలీసులకు పట్టించి విప్లవోద్యమాన్ని కాపాడిన తల్లి పాత్ర, 'ఒక తల్లి కథ'లో విప్లవోద్యమంలో భర్తతోపాటు పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన తన కొడుకును దహనం చేయడానికి కూడా వీలు లేని పరిస్థితిలో గంగపాలు చేసిన తల్లి పాత్ర మనకు కన్నీళ్లు తెప్పిస్తాయి . వారి త్యాగపూరిత జీవితాలు మన కళ్ళ ముందు నిలుస్తాయి

**12. భూదేవి నవలలో 'భూదేవి' పాత్రకు ప్రేరణ ఏమిటి?**

భూదేవి నవల ముఖ్యంగా ఓపెన్ కాస్ట్ గనుల క్రింద నిర్వాసితులైన ప్రజల కన్నీటి కథ. నిర్వాసితులు కావడం అంటే బ్రతుకు లేకుండా పోవడమే. పొట్ట చేత పట్టుకుని రెక్కలు తెగిన పక్షుల లాగా వలస పోవడమే. ఓపెన్ కాస్ట్ గనుల కోసం భూమిని తలక్రిందులు చేయగా కృత్రిమంగా ఏర్పడిన బొందల వల్ల, గుట్టలుగా పోసిన మట్టి దిబ్బల వలన ఏర్పడే పర్యావరణ విధ్వంసం అంతా ఇంతా కాదు. భవిష్యత్తులో ఆ ప్రాంతం జీవకోటి నివసించలేని ఎడారి ప్రాంతంగా మారిపోతుంది. ఒక్క ఓపెన్ కాస్ట్ గనుల వల్లే కాదు ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు, గుట్టల విధ్వంసం వలన బలవంతంగా నిర్వాసితులు అవుతున్న కోట్లాదిమంది మూలవాసుల బ్రతుకు విధ్వంసానికి, పర్యావరణ విధ్వంసానికి ప్రతీక భూదేవి పాత్ర. విధ్వంసం అవుతున్న ప్రకృతే భూదేవి పాత్రకు ప్రేరణ. కేవలం భూదేవి పాత్రకే కాదు ప్రకృతి విధ్వంసం కేంద్రంగా నేను రాసిన అనేక రచనలకు ప్రేరణ అయింది. భూముల్లో సంపద ఉంటే వాళ్ళ బ్రతుకు ఎందుకు బాగుపడలేదు ? ఎవరి అభివృద్ధి, ఎవరి వినాశనం అన్న మౌళిక ప్రశ్నను లేవనెత్తుతుంది. అలాగే పర్యావరణ విధ్వంసం మీద ముఖ్యంగా గ్రానైట్ క్వారీలు ప్రజల బ్రతుకుల్లో సృష్టించే

కల్లోలాన్ని తెలియచేసే దేవుని గుట్ట నవల, అలాగే గనుల క్రింద, ప్రాజెక్టుల కింద ప్రజలను నిర్వాసితులను చేసే క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ వంటి తంతులు ఎంత మోసపూరితంగా జరుగుతాయో, ఎంత బూటకంగా ఉంటాయో తెలియజెప్పే నవల మా ఊరి కథ. ఇంకా పర్యావరణ విధ్వంసం మీద చాలా కథలు రాసాను. భూ నిర్వాసితులు అనే కథల సంపుటి కూడా వచ్చింది.

**13. ' శృతి' నవలలో కామ్రేడ్ శృతి జీవితాన్ని చిత్రించటానికి మిమ్మల్ని కదిలించిన అంశాలు ఏమిటి?**

ప్రపంచీకరణ తీవ్రమైన తర్వాత పాలకవర్గాలు న్యాయమైన తమ సమస్యల కోసం పోరాటం చేసే ప్రజలపై భౌతిక దాడులే కాకుండా మానసికమైన దాడిని కూడా తీవ్రతరం చేసారు. అందులో ప్రధానంగా సమాజంలో అత్యంత చొరవగలిగిన యువతరాన్ని, ముఖ్యంగా విద్యార్థి లోకాన్ని కార్పొరేట్ భ్రమలు కల్పించి సమాజం నుండి దూరం చేసారు. నిర్వీర్యపరిచారు. కార్పొరేట్ భ్రమల బూటకత్వాన్ని అర్థం చేసుకొని వాస్తవ ప్రపంచంలోకి వచ్చి ప్రజల బ్రతుకులు బాగుపడాలన్నా, సమాజం బాగుపడాలన్నా పోరాటం తప్ప మార్గం లేదని గ్రహించిన నేటి యువతరానికి శృతి, వివేక్ లు ప్రతీకలుగా నిలిచారు. కానీ దురదృష్టం ఏమిటంటే కొద్ది నెలలు మాత్రమే విప్లవోద్యమంలో పనిచేసి శత్రువు తూటాలకు అమరులైనారు. వారు అందించిన స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచింది. అందుకే కార్పొరేట్ దోపిడీ నగ్నత్వాన్ని అర్థం చేసుకుంటూ వాస్తవాన్ని గ్రహిస్తున్న నేటి యువతరానికి వాళ్ళు మార్గదర్శకులు అయ్యారు. ఏ ఆదర్శాల కోసం యువకిశోరాలు తమ అమూల్యమైన ప్రాణాలు త్యాగం చేశారో చెప్పాలనే లక్ష్యంతో శృతి నవల రాసాను.

**14. ఇప్పుడు సింగరేణిలో సాహిత్య వాతావరణం ఎలా ఉంది?**

సాహిత్యం సమాజానికి అద్దం లాంటిది. సమాజం ఎలా ఉంటే అలా సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. ఇప్పుడు సింగరేణి పరిస్థితి చాలా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే సింగరేణి పూర్తిగా తలక్రిందులుగా అయింది. భారతదేశంలో సింగరేణి మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థ. ఇప్పుడు కూడా సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థే కానీ దాదాపు పనులన్నీ కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు సింగరేణిలో లక్ష పదహారు వేల మంది కార్మికులు పని చేశారు. కానీ ప్రస్తుతం కార్మికుల సంఖ్య నలభై వేల లోపు తగ్గిపోయింది. పర్మనెంట్ కార్మికుల స్థానంలో ఇప్పుడు కాంట్రాక్టు కూలీలు పని చేస్తున్నారు. వీరికి ఏ హక్కులు ఉండవు. వీరు ఏ సౌకర్యాలు నోచుకోరు. కనీస వేతనాలకు కూడా లేని దుర్భర పరిస్థితిలో కాంట్రాక్ట్ కూలీలు పనిచేస్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంత వాసులకి ఉపాధి ఉన్న సింగరేణిలో ఇప్పుడు బలవంతపు తొలగింపులకు గురై ఇంటిదారి పడుతున్నారు. పాలకులు అనుసరిస్తున్న నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రభుత్వ బొగ్గు పరిశ్రమ సంక్షోభంలో పడింది. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అగ్గువ సగ్గువకు బొగ్గు బ్లాకులు కేటాయిస్తూ వాటి మనుగడను ప్రశ్నార్థకం చేసారు. అదే సమయంలో కార్మికులు ఎన్నో ఏండ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి కార్మికులపై ఉక్కు పాదం మోపారు. కార్మిక ప్రతిఘటన పోరాటాలు కూడా సన్నగిల్లినవి. పోరాటాల కేంద్రంగా సృజన జరిగే సాహిత్యం కూడా సన్నగిల్లింది. అయితే ఈ పరిస్థితి ఎల్లకాలం ఉండదు. మళ్ళీ కార్మికులు పోరాడవలసిన అనివార్యమైన పరిస్థితులు పాలకులు సృష్టిస్తారు. ఫలితంగా కార్మిక పోరాటాలు రాక తప్పదు. ఆ పోరాటాల నుండి నూతన నాయకత్వం పుట్టుకొస్తుంది. పోరాటంతో పాటే సాహిత్యం, సాహిత్యకారులు పుట్టుకొస్తారు. ఈ నిశ్శబ్దాన్ని చేధిస్తూ కార్మికులను పోరాటాలకు సమాయత్తం చేయడంలో సాహిత్యం ఎంతో దోహదపడుతుంది.

**15. విప్లవోద్యమం వెనుక పట్టు పట్టిన పరిస్థితులలో విప్లవ రచయితల కర్తవ్యం ఏమిటి?**

శత్రువు నుండి నిర్బంధం తీవ్రమైనప్పుడు వెనుక పట్టు పట్టడం వర్గ పోరాటంలో సహజమే. వర్గ సమాజంలో అసలు సమస్య దోపిడి. కొద్దిమంది పెట్టుబడిదారుల లాభాల కోసం అశేష జనాలను బలి పశువులు చేయడం. ఈ అసమానతలు కొనసాగినంత కాలం పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయి. అయితే అన్ని కాలాలలో ఒకే పరిమాణంలో ఈ పోరాటాలు ఉండవు. కొంత కాలం ఉధృతంగా సాగిన పోరాటాలు తర్వాత కొంత కాలం స్తబ్దతకు గురికావచ్చు. విప్లవ సాహిత్యం కూడా దానికి అనుగుణంగానే ప్రయాణం చేస్తుంది. విప్లవ రచయిత వర్గ స్పృహ కలిగినవాడు. సమాజ భౌతిక పరిస్థితులపై అవగాహన కలిగినవాడు. విప్లవోద్యమ అవగాహనతో సాహిత్య సృజన చేసేవాడు. అందుకే ఏ కాలానికి అవసరమైన సాహిత్యాన్ని ఆ కాలానికి, ఆ కాలంలో ఉన్న ప్రజలకు అందించాలి. రచయితలు ప్రజల పక్షం వహించి మరింత పట్టుదలగా పనిచేయాలి. ప్రజా పోరాటాలకు మద్దతు తెలపాలి.

ఉద్యమాలు వెనకపట్టులో ఉన్నప్పుడు, ప్రజా చైతన్యం తగ్గినప్పుడు వారిని చైతన్యవంతులను చేసి పోరాటం ముందుకు నడపాల్సిన చారిత్రక బాధ్యత రచయితలపై ఉంది.

**16. ఇప్పుడు సాహిత్యం సమాజంపై ప్రభావం చూపే స్థితిలో ఉందని అనుకుంటున్నారా?**

సాహిత్యం ఇప్పుడే కాదు ఎప్పుడూ ప్రజలపై ప్రభావం చూపుతుంది. అద్దంలో మన ముఖం మనమే చూసుకుని తీర్చిదిద్దుకున్నట్టు సాహిత్యం కూడా ప్రజలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం నెలకొని ఉన్న గ్లోబల్ కల్చర్ హోరులో ప్రజా సాహిత్యం వెనుక పట్టుపట్టినట్టు కనిపించవచ్చు. కానీ అది వాస్తవం కాదు. ప్రజా సాహిత్యం ప్రజల కేంద్రంగా సాగుతుంది. వాళ్ళ బతుకులను, వాళ్ళ ఆశలను, ఆకాంక్షలను వ్యక్తీకరిస్తుంది. ఒక ఉన్నతమైన మానవ సమాజాన్ని కలలు కంటుంది. దాన్ని సాధించుకోవడానికి ప్రజలు చేస్తున్న పోరాటాలకు మద్దతు తెలుపుతుంది తలక్రిందలుగా నడుస్తున్న సమాజాన్ని సక్రమంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తుంది. అందుకే ప్రజలు ఉన్నంతవరకు ప్రజా సాహిత్యం ఉంటది. ఆ మేరకు ప్రజలపై తప్పక ప్రభావం చూపుతుంది.

**17. కొత్తగా సాహిత్యం రాస్తున్న ఈ తరం రచయితలకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?**

ఈ తరం రచయితలు విస్తృతంగా రాయాలి. కృషి చేస్తే ఎవరైనా రచనలు చేయవచ్చు. అయితే కొత్త రచయితలకు నేను ఇచ్చే సలహా ఏమిటంటే ముందుగా ప్రజల్లోకి వెళ్లాలి. వాళ్ల బాధలు, గాధలు, కష్టాలు, కన్నీళ్లు, ఆశలు, ఆకాంక్షలను లోతుగా అధ్యయనం చేయాలి. అధ్యాయం చేసుకున్న విషయాలను అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న వాటిని అక్షరబద్ధం చేయాలి. రెండవది రచనల్లో నైపుణ్యం సాధించడానికి అభ్యాసం చేయాలి. ఒకటికి రెండుసార్లు తిరగరాయాలి. అందుకోసం ప్రసిద్ధ రచయితల రచనలు అధ్యయనం చేయడం ద్వారా మన నైపుణ్యం పెంపొందించుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యమైనది మనం ఎవరి కోసం రాస్తున్నామో, ఎందుకోసం రాస్తున్నామో స్పష్టత ఉండాలి. అంటే స్పష్టమైన దృక్పథంతో రచనలు చేయాలి. ఇట్లా నిరంతరం అధ్యయనం, అభ్యాసం, పరిశీలన దృక్పథం ఉంటే ఎవరైనా మంచి రచనలు చేయొచ్చు.

**18. మీరు సాహిత్య సృజన ఏ ప్రయోజనం ఆశించి చేశారో అది నెరవేరిందని అనుకుంటున్నారా?**

కష్టపడేవారు మంచిగా బ్రతకాలి అన్నది నా కల. కానీ సమాజం అట్లా లేదు. పంట పండించి అందరికీ తిండి పెట్టే రైతుకు తిండి కరువై ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. ఎంత కష్టపడ్డా తిండికి నోచుకోని వారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ బియ్యంతో జనాభాలో సగం మంది బతుకుతున్నారంటే సమాజంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం అవుతుంది. నిరుద్యోగ యువతకు భవిష్యత్తు కనబడటం లేదు. ఎంత చదివినా ఉద్యోగం దొరకని పరిస్థితి ఉంది. మరోవైపు కార్పొరేట్ దోపిడీ విశృంఖలమై దేశ సంపదను ఇబ్బడి ముబ్బడిగా కాజేస్తుంది. ఇంత తారతమ్యాలతో, అసమానలతో, అన్యాయాలతో దోపిడీ వికృత కరాళనృత్యం చేస్తుంది. అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. అట్లా పోరాడే ప్రజలకు మద్దతుగా నిలవడమే నా సాహిత్య ప్రయోజనంగా భావించాను. అందు కోసం నా వంతు ప్రయత్నం చేసాను, చేస్తున్నాను. దోపిడి లేని సమసమాజ నిర్మాణం కోసం ప్రజలు చేసే పోరాటాలు వారి అంతిమ గమ్యాలను చేరేంతవరకు సాగుతూనే ఉంటాయి. అలా వెళు న్న ప్రజల వెంట నడవడం నా సాహిత్య ప్రయోజనం అనుకుంటున్న. ప్రజల ఆశలు నెరవేరిన రోజు నాకు సంతృప్తి.

**19. మీ రచనలను మీరు ఎక్కువగా సెల్ఫ్ ప్రమోట్ చేసుకోలేదు అనే అభిప్రాయం ఉంది. దీనికి మీ సమాధానం ఏమిటి?**

సెల్ఫ్ ప్రమోషన్ అంటే మీ ఉద్దేశం ఏమిటి? నేను ఇంత గొప్పగా రాసాను అంత గొప్పగా రాసాను అని చెప్పుకోవడమా? అందులో అర్థం లేదు. ఎందుకంటే నేను ఒక విప్లవకారుని గురించి ఒక నవలో, కథో రాసాను అనుకోండి. దాని ఉద్దేశం ఏమిటి? ఆయన ప్రజల కోసం ఎలా పని చేసాడు, ఏం చేసాడు, ఎటువంటి కష్టనష్టాలు ఎదుర్కొన్నాడు, ఎటువంటి త్యాగాలు చేసాడు అనేవి తెలుసుకొని వాటిని నేను ఒక క్రమ పద్ధతిలో రాయటానికి ప్రయత్నించాను. అప్పుడు ఆ పుస్తకం యొక్క నిజమైన క్రెడిట్ ఆ పోరాట యోధునికి చెందాలి తప్ప అక్షరాల్లోకి మార్చిన వారికి కాదు. కానీ ప్రస్తుత దోపిడీ వ్యవస్థలో ఆ సంస్కృతి లేదు. ఆరు కాలాలు కష్టపడి పంట పండించిన రైతుకు గిట్టుబాటు కావడం లేదు. కానీ ఆ రైతు దగ్గర పంట కొని మార్కెట్ చేసే దళారికి ఇబ్బడి ముబ్బడిగా లాభాలు వస్తున్నాయి. అదే సంస్కృతితో సాహిత్యాన్ని చూడడం సరైనది కాదు. రచనలు ప్రజలకు ఉపయోగమైతే బ్రతుకుతాయి. లేదంటే కాలగర్భంలో కలిసిపోతాయి. అంతేతప్ప ఎవరో ప్రమోషన్ చేస్తేనో లేదా డీ ప్రమోట్ చేస్తేనో పోయేవి కాదు. రచన చేయడం అన్నది నాకు ఇష్టమైన పని. అంతేగాని వాటిని ప్రచురించడం, ప్రజల్లోకి తీసుకుపోవడం నాతోని అయ్యే పని కాదు. అందుకే నలభై ఏళ్ల కింద విప్లవ కార్మికోద్యమ

నేపథ్యంలో పురుడు పోసుకున్న బొగ్గులు లాంటి నవలలు ఇంకా ప్రచురణకు నోచుకోలేదు. అయినా నా సాహిత్యం తప్పకుండా ప్రజల్లోకి పోతుందనే బలమైన నమ్మకం మాత్రం ఉంది.

**20. మీ సాహిత్య ప్రస్థానం లో మీ కుటుంబం పాత్ర ముఖ్యంగా మీ సహచరి పాత్రను ఎలా చూస్తారు?**

నా సహచరి ఇందిర సహాయ సహకారం లేకుండా ఇదంతా చేయడం నాకు అసలు సాధ్యమయ్యేది కాదు. ఎందుకంటే మాది ఆర్థికంగా అంతంత మాత్రమే నడిచే కుటుంబం. ఉద్యోగాల మీదనే ఆధారపడిన జీవితాలు. అలాంటి పరిస్థితిలో కేవలం రచనలు చేయడం కోసం ఉద్యోగం మధ్యలో వదిలేసాను. గడియ పురుషత్ లేకుండా గవ్వ ఆదాయం లేకుండా సాహిత్యమే లోకంగా బ్రతికే పిచ్చి మాలోకాలను భరించడం చాలా కష్టం. అటువంటి కష్టాన్ని నా సహచరి ఇష్టంగా భరించింది. కుటుంబ వ్యవహారాలు అన్ని తానే చక్కదిద్దుకుంటూ నా మానాన నన్ను వదిలేసి అన్ని రకాలుగా సహకరించింది. నా సహచరి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**21. భవిష్యత్తులో ఇంకా మీ నుండి ఎలాంటి రచనలు ఆశించవచ్చు?**

నేను చుట్టూ ఉన్న ప్రజల జీవితాలను చూసి వారు పోరాటాలకు, త్యాగాలకు ప్రభావితమై వాటిని ముందు తరాలకు అందించాలనే బలమైన కోరికతో రచనలు చేసాను. అయితే ఇంకా చెప్పాల్సిన జీవితాలు చాలా ఉన్నాయి. చేయాల్సిన పని చాలా ఉంది. రాయాల్సినవి ఇంకా ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం సాహిత్యం రాయడం అనివార్యమైంది. హై పిచ్ లో దాడి చేస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతి ప్రజల మెదళ్లను మొద్దుబారుస్తున్నది. అవాస్తవాలు వాస్తవాలుగా, వాస్తవాలు అవాస్తవాలుగా ప్రచారం జరుగుతున్నది. ప్రజల భౌతిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోంది. మెరుగైన బతుకు కోసం ప్రజలు అనివార్యంగా పోరాటాలు చేస్తున్నారు. ఉదాహరణకు రాజధాని నడిబొడ్డున రైతులు తమ పంటలకు మద్దతు ధర కోసం దాదాపు రెండేండ్లు పోరాటం చేసారు. వాళ్లను పోరాటానికి ప్రేరేపించిన పరిస్థితులు, వాళ్ళ పోరాటం ఎలా జరిగిందో సాహిత్యంలోకి రాలేదు. ఇదే కాదు ఇలాంటి అనేక విషయాలు ఉన్నాయి. అవన్నీ సాహిత్యంలోకి రావాల్సినవే. అయితే నేను ఇప్పుడు అవన్నీ రాయలేను. వయసు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యల వల్ల మునపటిలా ఎక్కువ సమయం సాహిత్యం రాయడానికి వెచ్చించలేకపోతున్నారు. అయినా ప్రజల గురించి రాయడం నాకు ఇష్టమైన వ్యాపకం. దాన్ని అలాగే కొనసాగిస్తాను. ఎందుకంటే ప్రజల అనుభవాలను ఏ మేరకు వీలైతే ఆమేరకు రికార్డ్ చేయాలన్నది నా లక్ష్యం.

**ఇంటర్వ్యూయర్:** పరిశోధక విద్యార్థి
ఉస్మానియా విశ్వవిద్యాలయం

<u>రచయితలకు సూచనలు:</u>

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**- సం.**

సాహిత్య పరిశోధన

# తెలుగు వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

డా. ఆర్.గోపాల్

హైదరాబాదు సంస్థానంలో మైనారిటీల పరిపాలనలో మెజారిటీవర్గ ప్రజల దుర్భర జీవితాలను మేలుకొల్పిన వారు, అలాగే తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేసినవారిలో ఆద్యుడు సురవరం ప్రతాపరెడ్డి. అందుకే ఈయనను తెలుగు వైతాళికుడుగా పేర్కొంటారు. ప్రతాపరెడ్డి పూర్వపు మహబూబ్ నగర్ జిల్లా, నేటి జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల సంస్థానానికి రాజధానిగా ఉండిన బోరవెల్లి గ్రామంలో 28 మే, 1896న రంగమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించారు. రచయితగా, పరిశోధకుడిగా, పత్రికా సంపాదకుడిగా, ఉద్యమ కారుడిగా, బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి కృషి ఎనలేనిది. అందుకే ప్రతాపరెడ్డిని 'విమర్శకులలో విమర్శకుడు. కవులలో కవి. పండితులలో పండితుడు. రాజకీయవేత్తలలో రాజకీయవేత్త. పత్రికారచయితలలో పత్రికారచయిత. నాటకకర్తలలో నాటకకర్త. వీటన్నింటినిమించి పరిశోధకులలో మహాపరిశోధకుడు. దేశాభిమానులలో దేశాభిమాని. సహృదయులలో సహృదయుడు అని సంబోధిస్తారు. అటువంటి మిత్రుని, విద్వద్వరుణ్ణి, రసజ్ఞున్ని అరుదుగా చుస్తాం. ఇంతటి ప్రజ్ఞాపాండిత్యములు కల సాహిత్యసేవా ధురంధరుడు' అని ప్రముఖ చారిత్రక పరిశోధకుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ రాసిన ఈ వాక్యాలు ప్రతాపరెడ్డిని సంపూర్ణంగా పరిచయం చేస్తున్నాయి. దాశరథి కృష్ణమాచార్యులు ప్రతాపరెడ్డిగారిని 'అతడు లేని తెలంగాణా అలంకరణ లేని జాణా' అని ఎంతో అందంగా అభివర్ణించాడు. అలాగే మరో సందర్భంలో 'మూగవడిన తెలంగాణా మూల్గిన తొలినాటి ధ్వని' గా దాశరథిగారిచే కీర్తింపబడ్డాడు.

**'రైతయి, రాజబంధువయి, రచ్చకుపెద్దయి, కావ్యవేద ని/ ష్ణాతుడునై స్వతంత్రుడయి, శాసనకర్తయి, శాస్త్రకర్తయై/తాతలనాటి సంస్కృతికి తావలమై, పురుషార్థ జీవియై/మా తెలంగాణా గౌరవము మల్చినవాడు ప్రతాపరెడ్డియే'** గంగాపురం హనుమచ్ఛర్మ (దుందుభి) **'అతడు నీహారాచలమంత ఎత్తువాడు/ ఈనాడీ బ్రంహ్మాండములోన కానరాడు'** (దాశరథి)(ఎస్వీ రామారావు. పాలమూరు ఆధునిక యుగ కవులు. పుట:01)

**సాహిత్యం**

సురవరం ప్రతాపరెడ్డి ప్రారంభంలో ఖండికలు, గీతమాలికలు మొదలైన చిన్నచిన్న పద్యఖండికలు రాశారు. ఆయన రాసిన 250 పద్యాలతో కూడిన కల్పిత కథాకావ్యం 'చంపకీభ్రమరవిషాదం', 100 పద్యాల హాస్య కథాకావ్యం 'హరిశర్మోపాఖ్యానం'. ఈ రెండు రచనలు అముద్రితాలు. జానపద కథను తీసుకొని సురవరం ఆరెవీరులు(1924) నవలను రాశారు. ఆయన మరో నవల శుద్ధాంత కాంత(1913). ఇది అముద్రితం.

సుజాత, గోల్కొండ, మీజాను, స్రవంతి మొదలయిన సాహితీ మాసపత్రికల్లో సుమారు 30 కథలు ప్రచురింపబడ్డాయి. ఈ కథలు కొన్ని రచయిత పేరు లేకుండా, కొన్ని చిత్రగుప్తుడు, భావకవి రామమూర్తి అనే కలం పేర్లతో ఉన్నాయి. సురవరం ప్రతాపరెడ్డి రాసిన 11 కథలను 'మొగలాయిల కథలు' అనే పేరుతో రెండు భాగాలుగా 1940లో అణాగ్రంథమాల ప్రచురించింది. తర్వాత 1987లో తొమ్మిది కథలను చేర్చి 'సురవరం ప్రతాపరెడ్డి కథలు'గా సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి వారు ప్రకటించారు. ఈ కథల ఆధారంగా ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులు, గ్రామీణ జీవన విధానాలు మనకు గోచరిస్తాయి. సురవరం కథల్లో తెలంగాణ యాస, జాతీయాలు, పలుకుబడులు కన్పిస్తాయి.

**నాటకాలు**

కల్హణుని రాజతరంగిణిలో కథ ఆధారంగా రచించిన ఉచ్ఛల విషాదం ఐదు అంకాల నాటకం. 1933లో ప్రచురించారు. ఇది విషాదాంత నాటకం. ఈ నాటకాన్ని కీ.శే. సురవరం రామకృష్ణారెడ్డికి అంకితం చేశారు. భారతీయ నాటక లక్షణాల్లో రంగస్థల ప్రదర్శనంలో అంగీకరించని నాయక మరణంతో ఈ నాటకం ముగుస్తుంది. ప్రతాపరెడ్డి భక్తతుకారాం నాటకమును తొలుత గ్రాంథికభాషలో రాసినప్పటికి 1945లో వ్యావహారిక భాషలోకి మార్చి 1952లో ప్రచురించారు. ఈ నాటకం మద్రాసు, గుంటూరు, బెజవాడ ప్రాంతాల్లో దాదావు 12సార్లు ప్రదర్శించబడిందని స్వయంగా ప్రతాపరెడ్డిగారే పేర్కొన్నారు. తుకారాం జీవితం (నటేశన్ కంపెనీ ఆంగ్ల గ్రంథం) భక్తవిజయం (వావిళ్ల ప్రచురణ) ఈ నాటకేతివృత్తానికి ఆధారమని రచయిత పేర్కొన్నాడు. 'పాండురంగభక్తుడు తుకారం జీవితాన్ని నాటకరూపంలో మలచిన తొలిరచయిత సురవరంవారే కావచ్చు'(ఎస్వీ రామారావు. పాలమూరు ఆధునిక యుగ కవులు. పుట:04) అని ఎస్వీ రామారావుగారి అభిప్రాయం. ఈ రెండు నాటకాలను 1987లో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతివారు 'సురవరం ప్రతాపరెడ్డి నాటకాలు' పేరుతో పునర్ముద్రించారు.

**ఆంధ్రుల సాంఘిక చరిత్ర**

ఆంధ్రుల సాంఘిక చరిత్ర అప్పటివరకు రాజవంశాలకే పరిమితమైన దేశచరిత్రను సామన్య ప్రజల జీవితాలవైపు మరల్చిన మొదటి గ్రంథంగా నిల్చింది. అందుకే ఈ గ్రంథం 1955లో తెలుగులో మొట్టమొదటి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. ఈ అవార్డు రెడ్డిగారు కీర్తిశేషులైన తరువాత ప్రకటించినందున వారి సతీమణి పద్మావతమ్మగారు అందుకున్నారు. ఇది 1949లో ఆంధ్రసారస్వత పరిషత్తు పక్షాన వెలువడింది. ఆంధ్రుల సాంఘిక చరిత్రలో తూర్పు చాళుక్యయుగం నుండి 1907 సంవత్సరం వరకుగల చరిత్ర ఉంది.

**హిందువుల పండుగలు**

ఒక దసరా పండుగ సందర్భంగా నిజాం రాజు అప్పటి కొత్వాల్ వెంకటరామారెడ్డిని ఆ పండుగ వెనక ఉన్న విశిష్టతను గురించి ప్రశ్నించాడు. సందిగ్దంలో పడిన వెంకటరామారెడ్డి

ఆజ్ఞమేరకు ఈ పుస్తకాన్ని ప్రతాపరెడ్డి రచించాడు. మనం ఈ పండుగలను ఎందుకు జరుపుకుంటున్నామో దాని వెనక ఉన్న ప్రయోజనాలను తెల్పుతూ 55 పండుగల, వ్రతాల, ఉత్సవాల ప్రాముఖ్యతను హేతుబద్ధంగా వివరించాడు. ఇది 1931లో ముద్రించబడింది. హిందువుల పండుగలు గ్రంథానికి విపులంగా పీఠిక రాయడానికి నాకు వ్యవధి చాలదు, శక్తియు చాలదని, నాటి భారత ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు అభిప్రాయపడటంలోనే ఈ గ్రంథం విశిష్టత అర్థమౌతుంది.

**రామాయణ విశేషములు**

ఈ గ్రంథం 1943లో పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి పీఠికతో మొదటిసారి ముద్రించారు. 1957లో ద్వితీయ ముద్రణకు అనుముల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి పీఠిక రాశారు. సురవరం రామాయణ కాలంనాటి సాంఘికాచారాలు, మతవ్యవస్థలు, నాటి సంఘంలో స్త్రీల స్థానం, ప్రజల జీవన విధానాలు కిష్కింద, లంకా ప్రాంతాలను వివరించారు. పంచవటి, భద్రాచలం ప్రాంతంలోనిదే అనే అంశాలును పేర్కొన్నాడు.

**సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు**

గోల్కొండ పత్రికలోనేకాక వివిధ సాహిత్య మాసపత్రికలలో (1922–53) మధ్యకాలంలో వైవిధ్యపూరితమైన పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. వీటిలో కొన్ని ఏరిన ముత్యాలను 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు' అనే పేరుతో 1988లో ఎస్వీ. రామారావు సంపాదకత్వంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతివారు ప్రచురించారు. ఇవి రెండు భాగాలుగా వెలువడ్డాయి. మొదటి భాగంలో నన్నెచోడుడు మొదలుకొని అనర్ఘరాఘవకర్త (బిజ్జుల తిమ్మభూపాలుడు) వరకు గల ప్రాచీనాంధ్రకవుల కావ్యాలపై చర్చలు, కర్తృత్వ వాదాలు, కవిత్వాంశాల గురించి రాశాడు. సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు రెండవ భాగంలో సాహిత్యేతర వ్యాసాలు, ఆయన ఆకాశవాణి (రేడియో) ప్రసంగాలు చేర్చబడ్డాయి. ఇందులో వర్ణవ్యవస్థ, హిందూసమాజంలో స్త్రీ స్థానం మొదలైన అంశాలున్నాయి.

**పత్రికా సంపాదకులుగాగోల్కొండ పత్రిక**

సురవరం ప్రతాపరెడ్డి చదువుకునే రోజుల్లో పత్రిక ఒకటి పెట్టాలనే అభిప్రాయంతో ఉండేవాడు. అంచేత జాతీయోద్యమం సందర్భంగా పత్రికను స్థాపించి 'దేశబంధు' అనే పేరు పెట్టుకోవాలని ఆయన అనుకున్నారు. కాని 'దేశబంధు' పేరుకు నిజాం రాజు అనుమతించే పరిస్థితులు లేవు. అందుకే 'గోల్కొండ' పత్రిక పేరు ఖరారు చేశారు. రాజా బహద్దురు వేంకట్రామారెడ్డి ఆశీస్సులతో1926, మే నెల 10వ తేదిన ప్రారంభమైన గోల్కొండ పత్రిక వారానికి రెండుసార్లు (సోమ, బుధవారాలు) వెలువడుతుండేది. ఈ పత్రికకు సురవరం 1947 (22 సంవత్సరాల) వరకు సంపాదకుడిగా ఉన్నాడు. ఈ పత్రిక ప్రధానంగా రెండు లక్ష్యాలతో నడిచింది. ఒకటి ఆంధ్రభాషాసేవ, రెండవది జాతి, మత, కులవివక్షతలేని ఆంధ్రులలో సర్వ శాఖలవారి సత్వరాభివృద్ధికి పాటువడడం. నిజాం దుష్కృత్యాలతోపాటు నాటి అనేక సామాజికాంశాలు తన సంపాదకీయాలలో ఉండేవి. ఈ పత్రిక తర్వాత సురవరం 'ప్రజావాణి' పత్రికను స్థాపించి కొంత కాలం నడిపారు.

**గోల్కొండ కవుల సంచిక**

గోల్కొండ పత్రిక తొమ్మిదవ సంవత్సరాది సంచికలో ముడుంబై వేంకటరాఘవాచార్యులు రాసిన వ్యాసంలో 'నిజాంరాష్ట్రంలో ఆంధ్రకవులు పూజ్యము' అన్న నిందావాక్యము గోల్కొండ కవుల సంచిక అవతరణకు ప్రేరకమైంది. ఈ అపవాదాన్ని ఖండించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణాలోని అన్ని జిల్లాలలోనుంచి తమ కవితలు పంపవలసిందిగా పత్రికాప్రకటన చేయగా కొంత మంది స్పందించి, సంస్కృతాంధ్ర భాషలలో కవితలు రాసి పంపించారు. ఈ సంచికలో 354 మంది (282 తెలుగు, 72 సంస్కృత)1418 పద్యాలను(118పద్యాలు, 237శ్లోకాలు) 11శీర్షికలలో సంగ్రహించి రాయల్ సైజులో 450 పుటల సంచికను 1934లో ప్రచురించారు.

**రాజా బహద్దూరు వేంకటరామారెడ్డి జీవిత చరిత్ర**

హైదరాబాదు నగరానికి కొత్వాలుగా మొదటి హిందువు అయిన వేంకటరామారెడ్డి నియమించబడి విశిష్ట సేవలనందించారు. వేంకటరామారెడ్డి, నిజాం నవాబు, ప్రజల ఆదరాభిమానాలు పొందిన అంశాలను గూర్చి ఈయన జీవితచరిత్రలో సురవరం వారు రచించారు.

ఆంధ్రమహాసభ 3-3-1930 నాడు మెదక్ జిల్లా జోగిపేటలో నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభ తొలిసమావేశం జరిగింది. దీనికి ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. సురవరంవారికి తెలుగు భాషపై ఉన్న అభిమానంతో 28 అక్షరాలతోనే వర్ణమాలను రూపొందించి, తమ పరిశోధనాపటిమను ప్రదర్శించారు. విజ్ఞానవర్ధిని పరిషత్తు 1941, ఆంధ్రసారస్వత పరిషత్తు 1943 వ్యవస్థాపక సభ్యుడిగా, అధ్యక్షుడిగా ఉన్నాడు.

**సురవరం ప్రతాపరెడ్డి మరికొన్ని రచనలు**

1) సంఘోద్ధరణము (1925), 2) మద్యపానము (1929), 3)గ్రామజనదర్పణము(1931), 4) హిందువుల పండుగలు (1931), 5) ఉచ్చల విషాదము(1933), 6) గోల్కొండ కవుల సంచిక (1934), 7) నిజాము రాష్ట్ర పరిపాలన (1936), 8)హైందవ ధర్మవీరులు (1937), 9) రాజ బహద్దర వేంకటరామిరెడ్డి (1939), 10) మొగలాయిల కథలు(1940), 11) రామాయణ విశేషములు (1943), 12) విభజన విజ్ఞానం (1947), 13) ఆంధ్రుల సాంఘిక చరిత్ర (1949), 14)భక్తతుకారాం (1952)

**ముగింపు:**

'భాషా సేవయే రాష్ట్రసేవ', 'భాషా విజృంభణమే ప్రజాభ్యుదయ హితవు', 'సారస్వతాభివృద్ధియే సంస్కృతి వ్యాప్తికి మూలం' అన్న ఆయన సూక్తులు జాతికి స్ఫూర్తి కావాలి. సురవరం ప్రతాపరెడ్డిగారు షష్టిపూర్తి జరుగకముందే 1953 ఆగస్టు 25న పరమపదించాడు. 60 సంవత్సరాల జీవిత కాలంలోనే ఇంత కీర్తి పొందారు. ఇంకొంతకాలం జీవిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించేవారు.

**ఆధారగ్రంథాలు**

1. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. సురవరం ప్రతాపరెడ్డి. తెలుగు అకాడమి, హైదరాబాదు: 2017

2. రామారావు, ఎస్వీ. పాలమూరు ఆధునిక యుగ కవులు : 2012.

3. రామిరెడ్డి, ముద్దసాని. సురవరం ప్రతాపరెడ్డి జీవితం–రచనలు. తెలంగాణ సాహిత్య అకాడమి: 2019.

4. లక్ష్మణ మూర్తి, ఎస్. సురవరం ప్రతాపరెడ్డి. సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ: 2000.

5. సుజాతారెడ్డి, ముదిగంటి. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాదు: 2015.

★ రచయిత: అతిథి అధ్యాపకులు, తెలుగుశాఖ, ఎం.వి.ఎస్. ఆర్ట్స్, సైన్స్ కళాశాల

సాహిత్య
పరిశోధన

# గంగాపురం చెన్నకేశవాలయం-చారిత్రక అంశాలు

పడకంటి మహేష్

## 1. పరిశోధన పత్ర - సంక్షిప్తి

ఈ పరిశోధన వ్యాసంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలానికి చెందిన గంగాపుర చెన్నకేశవాలయం, గ్రామ చరిత్ర, స్థల పురాణ విశేషాలను విపులంగా పరిశీలించాను. గంగాపురం పురాతన జాగీరు గ్రామంగా, బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ సంప్రదాయాల కేంద్రంగా ఎలా అభివృద్ధి చెందిందో చర్చించబడింది. చాళుక్యుల కాలానికి చెందిన కేశవాలయం, నంబులకుంట, గంగేశ్వర శివలింగం వంటి పురావస్తు ఆధారాలను విశ్లేషించడం జరిగింది. గ్రామం పూర్వపు నామం "మాయాపురి"గా ఉండిన అంశాన్ని, బౌద్ధ ప్రభావాన్ని, చరిత్రకారుల అభిప్రాయాల వివరణ. ప్రత్యేకంగా, గంగాపురం సమీపంలోని గొల్లత్త గుళ్ళు నిర్మాణ విశిష్టతను, జైన ధార్మిక కేంద్రంగా ఎలా వృద్ధి చెందిందో వివరించాను. 8వ శతాబ్దానికి చెందిన ఇటుకల ఆలయ నిర్మాణం విశిష్టత, త్రవ్వకాల వివరాలు, స్థానిక పురాణాల ఆధారంగా చారిత్రకాంశాలు పరిశీలించాను. ఈ వ్యాసం గంగాపురం చరిత్రలోని వైభవాన్ని, దాని ప్రాచీనతను, శిల్ప కళా సంపదను పునఃప్రతిపాదించే ప్రయత్నమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**సాంకేతిక పదాలు**

గంగాపుర చెన్నకేశవాలయం చరిత్ర, మాయాపురి, చాళుక్యులు, కేశవాలయం, నంబులకుంట, గంగేశ్వరుడు, జైన చైత్యాలయాలు, గొల్లత్త గుళ్ళు, పురావస్తు తవ్వకాలు, బౌద్ధ ప్రభావం, శైవ వైష్ణవ సంప్రదాయాలు, తెలంగాణ పురాతన ఆలయాలు, మట్టిఇటుక ఆలయ నిర్మాణం.

## 2. గంగాపురం చరిత్ర విశేషాలు - పరిచయం :

పూర్వం గంగాపురం పెద్ద జాగీరు గ్రామం. అక్కడ జనాభా దాదాపుగా వెయ్యికి పైనే ఉండేది. అప్పట్లో ఒక ముస్లిం జాగీర్దారు గంగాపురానికి అధికారిగా ఉండేవారు. ఈ గంగాపురం గ్రామం మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల మండల నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ గ్రామానికి దగ్గరలో చౌడేశ్వరి దేవాలయం తీరంలో ఒక పెద్ద చెరువు ఉండేది. ఆ చెరువుతో పాటు పది పన్నెండు కుంటలు ఉండేవి. ఆ కుంటలలో ఒక కుంట పేరు నంబులకుంట. ఈ నంబులకుంట నది ఒక వెయ్యి సంవత్సరాల నాటిది అని అక్కడ లభించిన చాళుక్య శాసనం వలన తెలుస్తుంది. గంగాపురం గ్రామంలో ఎక్కడ చూసిన శాసనాలు, శిధిల దేవాలయాలు, సుందర విగ్రహాలు, పతనమైన విగ్రహాలు కనిపించేవి. అవన్నీ గంగాపురం నేటి దుస్థితి, నాటి వైభవం తెలియజేస్తాయి. శిథిలమైన స్థితి నుండి పునరుద్ధరించబడి పూజా పునస్కారాలు అందుకుంటున్న ఆలయం గంగాపురంలో వెలసిన చెన్నకేశవాలయం. పూర్వ రచనల ద్వారా ఈ ఆలయాన్ని ఇంచుమించుగా క్రీ.శ 1000లో చాళుక్యులు నిర్మించారని తెలుస్తుంది. దేవాలయ గోడలపైన బయటి దిక్కున చాళుక్య శాసనాలు చెక్కినారు. ఈ దేవాలయం పేరున ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ సప్తమి నాటి నుండి ఐదు రోజుల పాటు పెద్ద జాతర జరుగుతుంది, అదే జాతర ఇప్పుడు తొమ్మిది రోజులు జరుగుతుంది. ఇక చరిత్ర లోతుల్లోకి వెళ్ళితే గంగాపుర చరిత్ర విశేషాలు తెలుసుకోవచ్చు.

నరపతి విజయము అనే పేరు గల రామరాజీయ కావ్యంలో వెంగయ్య కవి ఇలా చెప్పాడు.

**"గంగాపురం ప్రాచీన నామము మాయాపురి"**

పూర్వం బౌద్ధులు అధికంగా ప్రభావం కలిగి ఉన్న రోజులలో మాయాదేవి బుద్ధుని తల్లి కాబట్టి మాయాదేవి పేరు మీదుగా మాయాపురి అని నామ రూపాంతరం చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. దీనికి దురిత కోలాహలము అని మరొక పేరు ఉన్నది. కానీ, ఆ పదానికి అర్థం సరిగ్గా కుదరటంలేదు. పూర్వీకులు దురిత కోలాహలము అనగా పాపములు పోగొట్టునది అని అభిప్రాయపడ్డారు. గంగాపురం అని చాళుక్యుల కాలంలో పేరు వచ్చినట్లుగా ఉన్నది. గంగేశ్వరుడు అనే లింగం అక్కడ ప్రతిష్ఠించి ఉన్నదని గంగాపురంలోని ఒక శాసనం దీనికి సహాయపడుతున్నట్లు తెలుస్తుంది.

**"శ్రీ మత్త్రిభువనమల్ల దేవర విజయరాజ్య**
**భీమరసను గంగాదేవియుందూడిద**
**ప్రతిష్ట గందేశిరను దేనర ధర్మమాగి నహయసులు**
**దెంబదు కొట్టివాకెయ...."**

–(తెలంగాణా శాసనములు చాళుక్య శాసన భాగము నంబరు 72) ఈ శాసనం గంగాపురంలో కనిపించలేదు. ఇందులో "కొట్టివాక" అని ఉన్నది. కొలనువాకకు ప్రాచీన నామం కొట్టివాక.

ఈ గ్రామంలో జైన విగ్రహాల చిహ్నాలు ఉండటం వలన దీని పూర్వ నామము మాయాపురి అవ్వటం వలన ఈ గ్రామము కనిష్టము క్రీ.శ.1500 సంవత్సరం కాలం నాటిది అయ్యి ఉండవచ్చని చారిత్రకారులు అభిప్రాయపడ్డారు.

గంగాపురం పాలమూరు జిల్లాలో గల ప్రాచీననగరాలలో ఒకటి. రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, విజయ నగర చక్రవర్తులు, గోల్కొండ నవాబులు మున్నగు రాజవంశజులు పరిపాలించారు. ఇక్కడ శైవ వైష్ణవాది సంప్రదాయాలు, జైన ధర్మము బహుముఖంగా విస్తరించి ఉన్నారు.

## 3. గొల్లత్త గుళ్ళు:

గంగాపురం గ్రామానికి ఆగ్నేయంగా ఒక కిలోమీటరు దూరంలో అల్వాన్ పల్లి అనే గ్రామానికి దగ్గరలో గొల్లత్త గుళ్ళు అనే ఆలయ నిర్మాణాలు ఉన్నాయి. వీటినే 'జైన చైత్యాలయాలు' అని కూడా అంటారు. గొల్లత్త గుళ్ళలో ఒక్కగుడి మాత్రమే మిగిలింది. అది 40 అడుగుల ఎత్తు ఉన్నది. గోడలు నాలుగు అడుగుల మందం ఉండేవి. ఆ గుడి నిర్మాణం అంతా ఇటుకలతో కట్టబడింది. గ్రామస్తులు ఆ ఇటుకలను తమ అవసరాలకు వాడుకోవడం వలన ఇప్పుడు ఆ గుడి శిథిలమై పోయే దశలో ఉన్నది. కానీ, జనం మాత్రం గొల్లత్త గుళ్ళు అని బహువచనంతో అనడం వలన మనకు తెలుస్తున్నదేందంటే అక్కడ ఒక్క గుడి కాకుండా ఇంకొన్ని గుళ్ళు ఉండి ఉండవచ్చు. ఆ గుడి పక్కనే రెండు పెద్ద దిబ్బలు ఉన్నాయి. అవి శిథిలమైన గుళ్ళు అయ్యి ఉండాలి. అందువల్ల కొన్ని కనిష్టంగా మూడు గుళ్లైన ఉండాలి .

## 4. గొల్లత్త గుళ్ళు ప్రత్యేకత:

నలభై అడుగుల ఎత్తులో ఈ ఆలయం ఉంది. 8వ శతాబ్దంలో రాష్ట్ర కూటులు ఈ గుడిని నిర్మించినట్లు పురావస్తు శాస్త్రవేత్తలు చరిత్రకారులు చెబుతున్నారు. చాలా అరుదైన ఇటుకలతో జరిగిన నిర్మాణంగా కనిపిస్తుంది. సుమారుగా 7వ లేదా 8వ శతాబ్దంలో జరిగినట్లు చారిత్రకారులు భావిస్తున్నారు. గుడి నిర్మాణంలో 40 అడుగుల నిలువెత్తు గోపురం గొల్లత్త గుడికి ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఇటుకలతో నిర్మితమైన అత్యంత పురాతన ఆలయాలు దేశంలో రెండే రెండు ఉన్నాయని, వాటిలో ఈ గొల్లత్త గుడి ఒకటని పేర్కొంటున్నారు. మరొకటి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరులోని భీతర్‌గావ్ శివారులో ఉంది. ఈ గుడిని 1600 ఏళ్ల కింద 58 అడుగుల ఎత్తులో కుమారగుప్తుడి కాలంలో నిర్మితమైంది. ఆలయ నిర్మాణం 8 ఎకరాల్లో ఉండగా, పాదాల గుట్ట సుమారు రెండు ఎకరాల్లో ఉంది. జైనుల ధాన్య భాండాగారంగా పేరు గాంచిన గొల్లత్తగుడి ఆలయంలో ఒకప్పుడు బంగారు కుండలు ఉండేవని స్థానికులు చెబుతారు. గుడి వెనుక భాగంలో అప్పటి నగిషీల జాడలు ఇంకా స్పష్టంగా ఉండటం విశేషం.

జైనీయుల స్థిర నివాస కేంద్రంగా ఈ గుడికి గుర్తింపు ఉన్నది. అంతేకాకుండా జైనీయులకు ధాన్యాగారంగా వర్ధిల్లినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా జైనులకు రెండు ప్రధాన పట్టణాలు ఉండగా. అందులో గొల్లత్తగుడి ఒక్కటి. వందల సంవత్సరాల క్రింద ఇది జైన మతానికి ప్రధాన కేంద్రంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడ గతంలో అనేక పురావస్తు అన్వేషణలు, తవ్వకాలు జరిగాయి. పురాతన కాలం నాటి మట్టిపెంకులు, ఇటుకలతో పాటు నల్లరంగులో ఉన్న బూడిద తవ్వకాల్లో వెలుగు చూశాయి. ఈ ఇటుకలు 40X20X7 సెం.మీ పరిమాణం కలిగి ఉన్నాయి. ఇటుకలను పేర్చడానికి వాడిన మృత్తిక ఎంతో పద్దతిగా అనేక పదార్థాల మిశ్రమంతో తయారు చేయబడినది. గోడలు నునుపుగా ఉంచడానికి ఇటుకలపై మృదువైన సున్నపు లేపనం ఉన్నది కానీ ఇప్పుడు అది తొలగిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాలలోకెల్లా ఇటుకలతో నిర్మించబడి ఇప్పటికి ఉన్నటువంటి ఏకైక జైన ఆలయం ఇది ఒక్కటే అని చెప్పవచ్చు. ఆలయంలో నాలుగు అంతస్తులు ఉన్నాయి. దీని పైకప్పు కదలికాకరణ శైలిలో నిర్మించబడింది. అనగా విమానకుడ్యాలు ఉపరిభాగాన్ని కలపడం కోసం లోపలి మలచబడి ఉన్నాయి. ఇటుకలను ఆయా అవసరాలకు తగినట్లు అచ్చుపోసుకునట్లు కనిపిస్తునది. ఆలయం అడుగు భాగం మాత్రం ఇటుకలు పరిచి 'గచ్చు' చేయబడినది.

ఇక్కడ జరిపిన త్రవ్వకాలలో గొల్లత్త గుళ్ళతో పాటు మరో రెండు చైత్య ఆలయాలు బయట పడ్డాయి. ఇవి శిలా నిర్మాణాలు. జైన ఆలయాలు మొదట ఇటుకలతో నిర్మించినా, క్రమ క్రమంగా వీరు శిలా నిర్మాణం వైపు ఆసక్తి చూపినట్లు తెలుస్తుంది. ఈ నిర్మాణాలు కూలిపోయి, అక్కడ పునాదులు మాత్రమే మిగిలాయి. కాబట్టి వాటి నిర్మాణ స్వరూపాన్ని తెలుసుకోవడం కష్టమైనది, కానీ ఆలయ పునాదులను బట్టి మొదట ప్రవేశ మండపం, ఆపైన గర్భగృహం, మరొక రాతి మండపం, రాతిమెట్లు ఉన్నట్లు తెలుస్తుంది. ఇక్కడ లభించిన శిల్పాలను మహబూబ్ నగర్ లోని పిల్లలమర్రి పురావస్తుశాఖలో భద్రపరచబడినవి.

ఈ రెండు చైత్య ఆలయాలలో మొదటిది భులోకమల్ల సోమేశ్వరుని కాలంలో క్రీ.శ 1125 లో మణికిరబమ్మిసెట్టి నిర్మించారు. అందులో 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథున్ని ప్రతిష్టించినట్లు, అలాగే రెండవది తుంబుళకాళి సెట్టి నిర్మించి పార్శ్వనాథున్ని నిలిపినట్లు వారు వేయించిన శాసనాల వల్ల తెలుస్తుంది. ఈ చైత్య ఆలయాల సమీపంలో ఎత్తైన జైన పాదాలు ఉన్నాయి.

వాటిని పరిరక్షించేందుకు పురావస్తు ప్రదర్శనశాలకు తరలించారు. ఇక్కడ లభించిన ఐదు అడుగుల ఎత్తున్న జైన తీర్థంకరుల విగ్రహాల్లో ఒకదాన్ని హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు మ్యూజియంలో, మరొక దాన్ని పిల్లలమర్రి మ్యూజియంలో భద్రపరిచారు. ఇదే ప్రాంతంలో హిందూ దేవాలయం అవశేషాలు, మధ్యయుగ కాలం నాటి మహావీర, పార్శ్వనాథ శిల్పాలు బయటపడ్డాయి.

గొల్లత్తగుడి పురావస్తు శాఖ వారు 1958-59 లోనూ, 1970 నుండి 1975 వరకు రెండు విడతల త్రవ్వకాలు జరిపారు. చరిత్రకారుల ప్రకారం ఇక్కడ ఆసియాలోనే అతి పెద్దవైన మహిళ, పురుషుల సంఖ్య పాదాలున్నాయి. ఈ పాదాల పొడవు 6.4 మీ, వెడల్పు సుమారు 3 మీటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఆ గుళ్ళను గురించి అక్కడి స్థానికులు ఒక కథను చెప్పుకుంటారు.

పూర్వం గ్రామాలలో ప్రజలు ప్రతి గడప తిరిగి పాలు,పెరుగు అమ్మేవారు. ఎక్కువగా స్త్రీలు తిరిగి అమ్మేవారు. ఒక గొల్ల సామాజిక వర్గానికి చెందిన స్త్రీ పాలు, పెరుగు అమ్ముతూ ఉండేది. ఆమె భక్తి పారవశ్యంతో తన ఆస్తి అంతా ధారపోసి గుళ్ళను కట్టించింది. అందువల్ల ఆ గుళ్ళకు గొల్లత్త గుళ్ళు అనే పేరు వచ్చిందని చెప్పుకుంటారు. ఇంకా లోతుల్లోకి వెళ్ళితే శైవులలో పూర్వం 'గోళకి మఠాలు' అనేవి ఒక వెయ్యి సంవత్సరాల కింద భారతదేశ దక్షిణ భూభాగం అంత వ్యాపించి ఉండేది. గోళ్ళకి పదమే గ్రామ ప్రజల వాడుకలో 'గొల్లక్క' అయ్యి క్రమ క్రమంగా గొల్లత్తగా మారి ఉండవచ్చును. ఈ గోళ్ళకి మఠాల గురించి అమరావతీ స్తూపాలు అనే గ్రంథంలో సోమశేఖర శర్మగారు ప్రస్తావించారు. ఈ గోళకి మఠాలు ఎక్కువగా కన్నడ, తమిళ, తెలుగు రాష్ట్రాలలో మతసంస్థగా ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. రుద్రమదేవి (శాసనం 1183) ద్వారా విశ్వేశ్వర గోళకి అనే మఠాలను దానం చేసి అక్కడ ప్రజలకు అన్నదానము చేయుటకు నిర్ణయించినట్లుగా, విశ్వవిద్యాలయం, వైద్యాలయం, స్థాపించినట్లుగా ఈ శాసనం ద్వారా తెలుస్తున్నది.

కర్నూల్ జిల్లాలోని త్రిపురాంతకంలో ఒక గోళ్ళకి మఠం ఉన్నట్లుగా నాటి స్థానిక శాసనం1174 ద్వారా తెలుస్తున్నది .

గంగాపురంలో శైవాలయాలు విశేషాలు ఉన్నట్లుగా సహస్ర గణ శివభక్తులలో ముఖ్యమైన వారందరి గురించి క్రీ. శ 1300 కాలంలో నాటి పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో వర్ణించారు .

### 5. గంగాపురం ప్రాచీన చరిత్ర-నామ విశేషాలు:

పాల్కురికి సోమనాథుడు తన పడితారాధ్య చరిత్రలో త్రయోదశ గుణ సంకీర్తనంలో గణసహస్ర నామాలను కొన్నింటిలో ఇలా రాసారు.

"సంగయ్య, వనిపుర శంకరదేవ
**డింగుళివై జవ్వ, గంగాపురంబు**
**బసవయ్య, ఫణిహారి బసవయ్య"**
**"ఆదిగా గణ సహస్రనామములు**
**ఆదరణీయంబులై యొప్పునిట్టుల"**

ఇందులో పేర్కొన్న గంగాపురం ఈ గంగాపురమే అయ్యి ఉండవచ్చు. గంగాపురం గురించిన స్థల పురాణం కూడా ఉండి ఉండాలి. అందుకే మల్లారెడ్డిగారు అలాంటి స్థల పురాణాలు ఆధారంగా చేసుకుని గంగాపురం మహాత్మ్యం అనే గ్రంథాన్ని పద్యాత్మకంగా రచించారు అని తెలుసుకోవచ్చు.

**"మాయాపురి మత్స్యపురీ, దురితకోలాహలం కలియుగే గంగాపురీ''**అని నాలుగు యుగాలలో నాలుగు పేర్లు గంగాపురానికి ఉండేవి అని మల్లారెడ్డిగారి రచనల వలన తెలుస్తుంది. మీనంబరి నుండి మత్స్యపురి పేరు ఏర్పడింది. దురితకోలహలం అనేది స్థల మహాత్మ్యంకు ఇచ్చిన విశిష్టగుణం తెలియజేయడానికి వాడబడింది.

వెంకయ్య కవి తన నరపతి విజయంలో **"గంగాపురాఖ్యకు ప్రతినామంబుగల మాయాపురంబు"** అని వర్ణించడం వలన మాయాపురం అనేది గంగాపురానికి ప్రాచీననామం అని విశ్వసించవచ్చు.

అద్భుతమైన శిల్పకళతో ప్రముఖ కేశవ క్షేత్రముగా వెలుగొందుతూ క్రీ . శ . 11 వ శతాబ్ది నుంచి నేటి వరకు నిరాటకంగా నిత్య పూజలందుకొంటూ భక్తుల కోరికలు నెరవేరుస్తూ ఆర్త జన రక్షకునిగా వెలసినారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయమును క్రీ. శ. 1042-1052 మధ్య కాలములో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన త్రైలోక్య మల్లసోమేశ్వరుడు అనే చాళుక్య రాజు ఈ ఆలయాన్ని నిర్మించారు.

తెలంగాణ రాష్ట్రములోని ప్రముఖ పుణ్య క్షేత్రాలలో గంగాపురం ప్రధానమైనది. ఇక్కడి చెన్నకేశవస్వామి వెలసిన ఆలయం తెలంగాణ ప్రజలకే గాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రజల ఇష్ట దైవముగా అలరారుతూ భక్తజనకోటితో నిత్యపూజలు, కైంకర్యాలందుకొంటూ, ఆ భక్తుల కోరికలు నెరవేరుస్తున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఈ క్షేత్ర అధిష్టాన దైవం.

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ దర్శనీయ పుణ్య క్షేత్రాలలో ఒకటైన "గంగాపురం" జిల్లా కేంద్రమైన మహబూబ్ నగర్ కు 22 కి.మీ. దూరంలో, హైదరాబాదు, బెంగుళూరు జాతీయ రహదారిపై గల మండల కేంద్రమైన జడ్చర్ల కు 6 కి.మీ. దూరములో ఉంది.

ప్రధానంగా ఈ క్షేత్ర మహాత్మ్యమును స్కాంద పురాణములో పేర్కొనబడింది. గంగాపురానికి మత్స్యపురి, దురిత కోలాహలం, మాయాపురి, గంగాపురం అని నాలుగు యుగాలలో నాలుగు పేర్లుగా ఉన్నాయి.

పూర్వం ఈ ప్రాంతమును దేవసేనుడు అనే రాజు పరిపాలించాడు. అతని పరిపాలన కాలము నాటికి ఈ ప్రాంతములో ఎలాంటి నది లేదు. ఆ కారణముగా ఆ రాజు హిమాలయమునకు వెళ్లి గంగాదేవిని గురించి తపస్సు చేయగా గంగామాత ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకోమన్నది . దానికి ఆ రాజు, తల్లి ! నీవు భగీరథుని వెంట వెళ్లినట్లుగానే నా వెంట వచ్చి మా పట్టణమునందు నా పేరుతో ప్రవహించవలసిందిగా ప్రార్థించాడు. అందుకు గంగాదేవి అంగీకరించి అతనివెంట వచ్చి అక్కడ దేవసేనా నదిగా ప్రవహించింది. ఆ విధంగా ఆ రాజు పేరుతో దేవసేనా నదిగా ప్రఖ్యాతి గాంచింది. దాని తీరంలోని పట్టణమే గంగాపురముగా ప్రసిద్ధి చెందింది.

### 5.1. కృతయుగములో మత్స్యపురి:

కృతయుగమున దేవసేనుడు తన పట్టణానికి ఒక నదిని కొని రావటమే గాక అక్కడ వీర నారాయణ స్వామిని కూడా ప్రతిష్టించి ఆలయాన్ని నిర్మించాడు. అనంతరం కొంత కాలానికి నలచక్రవర్తి అరణ్య వాస కాలములో ఈ నదీ తీరానికి వచ్చి దేవసేనా నదిలో చేపలు పట్టి దమయంతికి వండమని ఇచ్చారు. ఆమె వాటిని వండి ఉడికిన చేపలను అక్కడే ఉన్న ఒక కట్టెపుల్లతో కలిపింది. దాంతో ఆ ఉడికిన చేపలన్నీ బ్రతికి ఆ పాత్ర నుంచి ఆకాశమంత ఎత్తు ఎగిరి ఆ నదిలో పడి కలిసిపోయాయి. ఈ అద్భుతానికి అక్కడున్న వారంతా ఆశ్చర్యపడి దేవసేనా నదీ తీరాన తాము విడిది చేసిన ప్రాంతానికి "మీనాంబరి" అనే నామకరణం చేశారు. ఈ ప్రాంతమంతా గంగాపుర అంతర్భాగము కావడం చేత ఈ పట్టణానికి "మత్స్యపురి" అనే పేరు ఏర్పడింది.

### 5.2. త్రేతాయుగములో దురితకోలాహలం:

పూర్వకాలమునందు పుండ్రపురమును చంద్రకేతుడు అనే రాజు పాలించాడు . అతనికి ఒకప్పుడు జ్ఞానకృతముగా బ్రహ్మ హత్యాపాతకము సంభవించింది . అతడు ఎన్ని పుణ్య నదులలో స్నానం చేసిన, ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి సేవించిన ఆ పాపము పోలేదు. అప్పుడు అతని చింతను చూచి ఆకాశవాణి "ఓ మహారాజా నీవు దేవసేనా నదికి వెళ్లి అక్కడ మీనాంబరి నదిలో స్నానం చేసి అక్కడ గల దుర్గను పూజించు నీ దురితము తొలగుతుందని" చెప్పింది. అది విని అతడు అక్కడికి వెళ్లి స్నానము చేసి దుర్గను పూజించి పాప విముక్తుడు అయినాడు. దానితో ఆ పట్టణమునకు దురిత కోలాహలం అనే మరో పేరు ఏర్పడినది.

### 5.3. ద్వాపర యుగములో మాయాపురం:

గడచిన ద్వాపర యుగాంతములో మయుని కుమారుడైన దుర్జయుడు గండకాద్రిని ముట్టడించి అక్కడి పట్టణాన్ని నాశనం చేయగా అక్కడి మునులు వచ్చి గంగంగాపురంలోని వీరనారాయణస్వామితో వారి కష్టములను మొరపెట్టున్నారు. అది విని స్వామీ వారిని కరుణించి గంగాపురం నుండి మాయమై గండకాద్రి చేరి దుర్జయుని వధించి అక్కడి పట్టణాన్ని పునరుద్ధరించిన పిమ్మట అక్కడే నిలిచి పోయినాడు. ఆ విధముగా ద్వాపర యుగాంతములో గంగాపురంలో వీరనారాయణుడు మాయము కావటం చేత దానికి మాయాపురం అని వ్యవహరించబడింది.

### 5.4. కలియుగములో గంగాపురం:

దేవసేనుడీ ప్రాంతానికి స్థానిక నాయకుడు గంగాదేవి గురించి తపస్సు చేసి, ఆ గంగా దేవిని రప్పించి, గంగాదేవి పేర గంగేశ్వర ప్రతిష్ట చేసి నేటి గంగాపురాన్ని పునాది వేసినాడు. కావున గంగాపురంగా ప్రసిద్ధి చెందింది.

## 6. గంగాపుర శాసనాలు :

పూర్వం దక్షిణ భారతంలో గంగాపురం ప్రసిద్ధమైన నగరాలలో ఒకటి. క్రీ.శ 6వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు అంటే బాదామి చాళుక్యుల పరిపాలన కాలం నుండి విజయనగర పరిపాలన వరకు ఈ నగరం ఎన్నో చారిత్రక సంఘటనలకు నిలయంగా ఉండేది.

ఇప్పుడు మండల కేంద్రంగా ఉన్న వంగూరు గతంలో మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో ఉండేది. జిల్లా విభజన జరిగిన తర్వాత వంగూరు మండలం నాగర్ కర్నూల్ జిల్లాలో భాగమైంది.

బాదామి చాళుక్యుల చక్రవర్తుల్లో ఒకరైన విక్రమాదిత్యుని క్రీ.శ 659 నాటి సంస్కృత తామ్ర శాసనంలో ఇలా రాయబడింది.

''ఆ రాజన్యుడు పానుగంటిలో, విడిసి, కృష్ణానదీతీరంలోని మఖ్తూరులో శివమండల దీక్షలో ఉండి, పాశుపతుడైన సుదర్శనాచార్యునికి గురుదక్షిణగా వంగూరు వాటి పరిపాలనలోని ఇపరుంకల్లు అనగా నేటి వీపెనగండ్ల గ్రామాన్ని ధారాదత్తం చేసినట్లు చెప్పబడింది".

ఈ తామ్ర శాసనంలో చెప్పినట్లుగా నేటి వంగూరు, ఇపరుంకల్లు (వీపెనగండ్ల), పానుగల్లు గ్రామాలు గంగాపురం ప్రాంతానికి చెందినవి. ఈ శాసనం ద్వార నేటి వంగూరు విశాల పట్టణంగా పరిపాలన విభాగంగా ఉండేది అని తెలుస్తుంది.

అప్పట్లో గంగాపురం పరిధిలో దుందుభీతీరంలో మీనాంబర క్షేత్రం ఉండేది. ఈ మీనాంబర క్షేత్రం పక్కన కురవగట్టు కలదు. అక్కడ అత్యంత ప్రాచీనమైన చౌడేశ్వరిదేవి గుడి ఉన్నది. ఆ గుడి ముందు క్రీ.శ 800 సంవత్సరాలనాటి రాష్ట్రకూట సార్వభౌముడైన ప్రభూతవర్షగోవింద వల్లభుని విజయాలను తెలిపే శాసనం ఉన్నది.

గంగాపురం గ్రామం దాని పరిసరప్రాంతాలలో మొత్తం 23 శాసనాలు లభించాయి. వారిలో 3 రాష్ట్రకూటుల కాలానికి చెందినవి. 19 శాసనాలు కళ్యాణి చాళుక్యుల కాలం నాటివి. ఒకటి రేచర్ల పద్మనాయకులది. రాష్ట్రకూటులనాటి కుర్వగట్టు శాసనం మాత్రం సంస్కృతం మరియు కన్నడ భాషల్లో ఉన్నది. పద్మనాయకుల శాసనం సంస్కృతంలో ఉన్నది. మిగిలిన శాసనాలు హళగన్నడ భాషలో ఉన్నాయి.

1. కురవగట్టు శాసనం (క్రీ.శ 780–800) బీర గృహుడు వేయించాడు. ఇది వారి యుద్ధ విజయాలను తెలుపుతుంది.

2. మీనాంబర శాసనం (క్రీ.శ 930–63) కాలాముఖాచార్యుడు, వీరవ్రతియైన అగస్త్య గురువరుని గురించి తెలుపుతుంది.

3. మీనాంబర దివ్య స్థానం శాసనంలో జైనముని జ్ఞానం పొందినట్లు తెలుపుతుంది.

4. త్రైలోక్యమల్లు సోమేశ్వరుని శాసనం (క్రీ.శ1046 –63) భీమేశ్వరుని ప్రతిష్టించిన విషయం తెలుపుతుంది.

5. త్రిభువనమల్లుని శాసనం (క్రీ.శ 1078 – 79) సెట్టి కుతలజులు కేశవదేవపురానికి కొన్ని సుంకాల నుంచి వచ్చే ఆదాయాన్ని సమర్పించాడని తెలుపుతుంది.

6. శాసనం (క్రీ.శ1091–92) త్రిభువనమల్లుని గురువు, తర్క శాస్త్ర కోవిదుడైన సకల ప్రవేశ భట్టారకుడు విట్టణభట్టును పరీక్షించి, వారికి జ్యోతిర్వ ఉత్పత్తి ఇచ్చినట్లు తెలుపుతుంది.

7. క్రీ.శ 1091–1092 నాటి శాసనం త్రిభువనమల్లుని గురువు, తర్కశాస్త్ర కోవిదుడైన సకల ప్రవేశభట్టారకుడు జ్యోతిశాస్త్ర విదులైన ఆదిత్య భట్టోపాధ్యాయుని, విట్టనభట్టును పరీక్షించి, వారికి జ్యోతిర్వృత్తిని ఇచ్చినట్లు తెలుపుతున్నది.

8. హోహోహోహోధర్మమహేశ్వర దండనాయకుడు (క్రీ.శ 1097) భీమేశ్వరునికి భూదానాన్ని ఇచ్చిన సందర్భంగా వేయించిన శాసనం మరొకటి.

9. హలేశ్వరదేవరకు పెట్టి కులజులు, సర్వసమయములవారు ధాన్యం క్రయవిక్రయాలు చేసినపుడు

కొంత ధాన్యాన్ని ఇచ్చినది తెలిపే శాసనం.

10. క్రీ.శ 1100–10 నాటి శాసనం కందూరునాడు రాజ ప్రతినిధియైన కుమారు తైలపుని అంతఃపురాధ్యక్షుడు మనెవెర్గడ ప్రజలకై కొన్ని మర్యాదలను ప్రకటించినట్టిది.

11. క్రీ.శ 1116–17 నాటి శాసనం భీమరసుగంగాదేవులు గంగేశ్వరుని ప్రతిష్ఠించినది.

12. క్రీ.శ 1121–22 నాటి శాసనం కుమారతైలపుడు నెక్కొండ రామేశ్వరదేవరకు బూదపురాన్ని దానంగా ఇచ్చినట్లు తెలుపుతుంది.

13. క్రీ.శ 1125 నాటి జెడచెర్ల శాసనం మణికెరబమ్మిశెట్టి గంగాపురంలో పార్శ్వనాథుణ్ణి ప్రతిష్ఠించిన విషయం తెలిపేది. ఇది భూలోకమల్ల సోమేశ్వరుని కాలం నాటిది.

14. క్రీ.శ 1133–34 నాటి శాసనం తైలపదేవుని దండ నాయకుడు జయానంద వజ్జగంగాపురపు పెద్దరావుల సుంకాన్ని మర్తవాది, సోమనాథదేవులకై దానం చేసినది తెలుపుతుంది.

15. క్రీ.శ 1141 నాటి శాసనం గంగాపురంలోని సాగరేశ్వర, కేశవదేవులకు అచటి ప్రజలు మొదలైనవారు చేసిన అనేకదానాలను తెలిపేది. ఇది రెండవ జగదేకమల్ల ప్రతాపచక్రవర్తి కాలానిది.

16. క్రీ.శ. 1143 నాటి శాసనం అనేక దేశాలకు చెందిన వ్యాపారులు వివిధ సుంకాల ఆదాయాన్ని పొజ్జేశ్వరదేవరకు సమర్పించింది.

17. క్రీ.శ 1145–46 నాటి శాసనం 36 మంది సెట్టి కులజులు, ప్రజలు సాగరేశ్వర, సోమేశ్వరులకు కొంత భూమిని, సుంకాలకు సమర్పించింది.

18. క్రీ.శ 1156 నాటి శాసనం గంగాపురంలోని సగరేశ్వరునికి స్థానాధిపతియైన శ్రీ గిరి పండితునికి ఇచ్చిన కొన్ని దానాలను తెలియజేస్తుంది.

19. క్రీ.శ 1156 నాటి శాసనం గంగాపురంలోని సాగరేశ్వరుని పవిత్రోత్సవానికి, రుద్రశక్తి పండితునికి కౌపీనానికి వర్తకులు ఒక్కొక్క హాగచొప్పున దానం చేసిన విషయం తెలుపుతుంది.

20. క్రీ.శ. 1164 నాటి శాసనం దాకసెట్టి మొదలైనవారు రాజపండితునికి ఒకవృత్తి, హాళేశ్వర దేవరకు అనేక దానాలు చేసింది తెలియజేస్తుంది.

21. క్రీ.శ 1162 నాటి శాసనం కోడూరు స్వయంభూనాథ దేవునికి గంగాపురం మాదిగ సుంకాన్ని కందూరు ఉదయన చోళుని సుంకాధికారులు దానం చేసిన విషయాన్ని తెలుపుతుంది.

22. తుంబోళకాళిసెట్టి గంగాపురంలో పార్శ్వనాథాలయంలో దేవుని ప్రతిష్ఠించింది తెలుపుతుంది.

23. రేచర్ల పద్మనాయకుల సంస్కృత (ఖండిత) శాసనం ఇది.

ఇవే కాకుండా పూర్వం గంగాపురానికి శాఖానగరాలుగా వున్న ఆవంచ, నసర్లవాద, పాపకల్లు గ్రామాల్లో కూడా శాసనాలు దొరుకుతున్నవి .

## 6.1. గంగాపురం గురించి తాటికొండ శాసనాల్లో ప్రస్తావన

పురావస్తు శాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి జరిపిన పరిశోధనలో ఇంకొన్ని ఆసక్తి కరమైన విషయాలు బయటపడ్డాయి.

భూత్పూర్ మండలం తాటికొండలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పురాతన కాలం నాటి శిల్పాలు బయటపడ్డాయి. అలాగే జడ్చర్ల సమీపంలోని గంగాపురం – నెక్కొండ దారిలో రాచమల్ల వారి దొడ్డి పక్కన పొలంలో ఉన్న క్రీ.శ. 1,141 నాటి కళ్యాణి చాళుక్య చక్రవర్తి రెండో జగదేక మల్లుని శాసనంలో పేర్కొన్న పాల్మురు అనేది పాలమూరేనని అని పేర్కొన్నారు. కీ.శ. 1128 నాటి కళ్యాణి చాళుక్య చక్రవర్తి భూలోక మల్ల మూడో సోమేశ్వరుని శాసనంలో పేర్కొన్న పిల్లలమర్రి, మహబూబ్‌నగర్ శివారులోని పిల్లలమర్రిగా గుర్తించారు. క్రీ.శ. 12వ శతాబ్దికే పాలమూరు పట్టణం, పక్కనే పిల్లలమర్రి ఉనికిలోనే ఉన్నది అని తెలుస్తుంది.

## 7. స్థల పురాణం

కృత యుగంలో ఒక భక్తుడు స్వామి కోసం తపస్సు చేయగా అయన తపస్సుకు మెచ్చి వైష్ణవుడు ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకో అంటాడు. అప్పుడు ఆ భక్తుడు నేను మీ ఆలయాన్ని నిర్మించాలని, అందులో మీరు చెన్నకేశవ స్వామిగా వెలసి, నన్ను అనుగ్రహించాలి అని విన్నవించుకుంటాడు. అందుకు విష్ణుమూర్తి అనుగ్రహిస్తాడు. అప్పుడు ఆ భక్తుడు ఆలయ నిర్మాణం కొన్ని రోజుల తర్వాత పూర్తి చేస్తాడు. స్వామి వారు అక్కడ వెలిసే రోజుకు ముందు రోజు ఆ భక్తుడు ఆలయ నిర్మాణ ఖర్చు లెక్కిస్తాడు. అందుకు స్వామి వారు ఆగ్రహించి, దేవశిల్పులును పిలిచి మరో ఆలయాన్ని కట్టమని ఆజ్ఞాపించాడు. అక్కడ స్వయంభువుగా వెలసి పూజలు అందుకుంటున్నాడు అనేది ఇక్కడి స్థల పురాణంగా అక్కడి ప్రజలు చెప్పుకుంటారు.

మరో స్థల పురాణం ప్రకారం చెన్నకేశవ స్వామి అనగా శ్రీకృష్ణుడు. చెన్న అనగా అందమైన అని అర్థం. అందువలన చెన్నకేశవుడు అనగా మేలైన కేశములు కలవాడు అని అర్థం. 'కేశులు' అనగా బ్రహ్మ, విష్ణు, రుద్రులు. వారిని తన వశమందుంచుకున్నవాడు కేశవుడు. కావున కేశవుడు అనగా త్రిమూర్తులు ఒకటైన ఆనందస్వరూపుడు అని చెప్పుకుంటారు.

"చెన్ను" శబ్దము నిఘంటువులలో అందము, కాంతి, విధము, సౌందర్యము అనే అర్థాలలో చెప్పబడింది. "చెన్నుడు అంటే అందగాడు" అని కూడ స్పష్టంగా "ఆంధ్రదీపిక" చెపుతోంది. ఒత్తైన, మెత్తని కేశములు కలవాడని (అందగాడని) ఒక అర్థం. క ం అ ం ఈశ = బ్రహ్మ, విష్ణు, శివ రూపాలు కలగలిపిన త్రిమూర్తి స్వరూపమైన పరమాత్ముడని లోతైన అర్థం కలదు.

గజేంద్రుని రక్షించే సమయంలో శంకు చక్రాలు తారుమారవుతాయి. కేసి అనే రాక్షసునితో పన్నెండు వేల సంవత్సరాలు యుద్ధం చేసి సంహరించిన తర్వాత శంకు చక్రాలు యధాస్థనానికి చేరుకున్నాయాని కేసి రాక్షసుణ్ణి సంహరించడం వల్ల కేశవస్వామి అని , లక్ష్మీ సమేతుడు కాబట్టి లక్ష్మీ చెన్నకేశవ స్వామి అని నామ స్మరణగా మారినట్లు అక్కడి ప్రజల నమ్మకం.

చెన్న కేశవాలయం – గంగాపురం పాలమూరు మండలంలో వర్ధమానపురం – గంగాపురం రెండూ పెద్ద చారిత్రక నగరాలు. వర్ధమాన పురానికి వడ్డవాని అని, గంగాపురానికి కేశవపురం, మాయాపురం అని మొదటి పేర్లు.

వర్ధమాన మహావీరుడు జినుడు కాబట్టి అది జైనమత కేంద్రమని, మాయాదేవి బుద్ధుని తల్లి కనుక గంగాపురం బౌద్ధమత కేంద్రంగా ఉండ వచ్చునని చారిత్రకారులు చెప్పినారు. కానీ గంగాపురం దగ్గర జరిగిన త్రవ్వకాలలో జైన ప్రతిమలు, వడ్డవాని ప్రక్కనగల ధర్మారంలో అవలోకితుని ప్రతిమలు బయటపడ్డాయి.

పౌరాణికంగా గంగాపుర ప్రశస్తి స్కాందపురాణంలోని తీర్థ ఖండంలో ఉందని గంగాపుర మాహాత్మ్యం అనే కావ్యం చెబుతుంది.

వీరహెూంబాళుడనే చాళుక్య ప్రభువు ఒకప్పుడు గండకాద్రికి వెళ్ళి అచటగల చెన్నకేశవ మూర్తినిచూసి దాన్ని తమ నగరానికి తేవటానికి ప్రయత్నించగా అక్కడి ప్రభువైన వీరసేనుడు అడ్డుపడినాడు. అపుడు హెూంబాళుడు సూర్యుని ఆరాధించి మెప్పించగా అదిచూసి వీరసేనుడు సంతోషించి

స్వామిని కొనుకుని వెళ్ళమని ఆజ్ఞాపించారు. అపుడు అతడు కేశవ స్వామిని తెచ్చి అక్కడ ప్రతిష్ఠించి అనంతరం వీర సేనుని కూతురు పద్మావతిని వివాహం చేసుకున్నాడు.

ఇక్కడి ఆలయాన్ని గురించి గంగాపుర మాహాత్మ్యంలో మల్లారెడ్డి చెప్పిన కథ ఈ విధంగా ఉంది.

పూర్వం ద్వాపరయుగాంతంలో మయుని కుమారుడైన దుర్జయుడు గండకాద్రిపై దండెత్తగా అక్కడి మునులు వచ్చి గంగాపురంలో ఉన్న వీరనారాయణస్వామికి మొర పెట్టుకున్నారు. అపుడు స్వామి అది విని ఇక్కడ అంతర్ధానమై గండకాద్రికిచేరి దుర్జయుని వధించి అనంతరం అక్కడనే నిలిచిపోయినాడు. స్వామి ఇక్కడ మాయమైపోయినాడు కాబట్టి ఆనాటినుండి గంగాపురానికి "మాయాపురం" అనే పేరు వచ్చింది.

కలియుగం వచ్చిన తర్వాత ఆ పట్టణాన్ని చంద్రవంశానికి చెందిన పుణ్యశీల మహారాజు పాలించినాడు. చారిత్రకులు అతనిని ఆహవమల్ల బిరుదాంకితుడైన మొదటి సోమేశ్వరుడని గుర్తించినారు. వీరి రాజధాని వైజయంతీపురం. తెలంగాణంలోని గంగాపురం రెండవ రాజధానిగా ఉన్నది. ఈ మహారాజు క్రీ.శ. 1043-68 మధ్య కాలంలో రాజ్య పాలన చేసినారు. ఒకరోజు అతని ఆస్థానానికి ఒక బ్రాహ్మణుడు వచ్చి, కుంతల దేశ రాకుమారి వీరవర్మ కూతురు సుప్రభ మిక్కిలి అందగత్తె అని చెప్పినాడు. సోమేశ్వరు అది విని ఆమె స్వయంవరానికి వెళ్ళి రాక్షస వివాహంలో తన శౌర్యాన్ని అంకువజేసి ఆమెను తీసుకొనివచ్చి వివాహం చేసుకున్నాడు.

వీరు వీరకంబాళుడు, భువనైకమల్లుడు, త్రిభువనమల్లుడు,చాణుక్యమల్లుడు అని నలుగురు కుమారులకు జన్మను ఇచ్చారు. చరిత్రలో మాత్రం భువనై కమల్ల-త్రిభువనమల్లులు ఇద్దరే ప్రసిద్ధులైనారు.

ఒకప్పుడు అతనికి జ్యోతిష్కులు, నీకు కలిగిన రెండవ కుమారుడు గొప్ప పరాక్రమశాలి, ప్రసిద్ధుడు అవుతాడు అని చెప్పినారు. అది విని ఆయన రెండవ కుమారుని కొరకు చాలా ఆతురతగా ఎదురు చూశారు. కానీ రాణిగారికి రెండవ సంతానం చాలా ఆలస్యంగా కలిగింది.

అనంతరం ఒకపుడు పుణ్యశీలుడు యాత్రలు చేస్తూ మీనాంబరం దగ్గరకు రాగా అక్కడ అతనికి మరో బ్రాహ్మణుడు తటస్థపడి, పూర్వం గంగాపురంలో వీరనారాయణస్వామి ఉండేవాడు కానీ, ఇపుడతడు అంతర్ధానమైనాడని చెప్పినాడు. అదివిని మహారాజు ఆ రాత్రి ఆ స్వామి ఎక్కడ ఉన్నా తెచ్చి ప్రతిష్ఠించవలెనని సంకల్పించి నిద్రించగా, అతడు స్వప్నంలో కనిపించి, నేను గండకాద్రిలో ఉన్నాను, కొనివచ్చి ప్రతిష్ఠించు అని చెప్పినాడు.

అంతలోనే మహారాజు ఆశ్చర్యపడి మేలుకొని ఆ ఉదయమే తన కుమారులను పిలుచుకొని స్వప్న విషయం చెప్పి వీరకంబాళుని వెళ్ళి స్వామివారిని వేంచేపు చేసికొని రమ్మని త్రిభువన మల్లునితో స్వామికి ఆలయమంటపాలు, చాణుక్య మల్లునితో ప్రాకార గోపురాలు కట్టించమని ఆజ్ఞాపించి భువనైక మల్లునితో ఈ ఏర్పాట్లన్నీ చూడమని చెప్పినాడు. ఆతరువాత ఆలయ నిర్మాణం స్వామివారి ప్రతిష్ఠ అతడనుకున్నట్లు జరిగినవి.

గంగాపురం - పాపగల్లు - ఆవంచ సమీప గ్రామాలు. ఆవంచ దుందుభీ తీర గ్రామం. అక్కడ పూర్వం నాలుగు పెద్ద పెద్ద రాజ ప్రాసాదాలున్నవి. ఈ మూడు గ్రామాలలోని ఆలయాల శిల్పం ఒకే తీరుగా ఉంది కాబట్టి అవి ఒకే కాలాలు, ఒకే తీరున లిఖించబడిన దస్తూరివి అనిపిస్తుంది. కానీ ఈ శిల్పులెవరో తెలిసిరాలేదు. వారు మాత్రం జక్కనాచార్యుని వంశీయులంటారు. వారి శాఖ ఒకటి ఇపుడు కల్వకుర్తి తాలూకాలోని బైరాపురంలో ఉంది.

మొట్ట మొదట ఇక్కడ స్మార్తులు(స్మార్తం లేదా స్మార్త సాంప్రదాయం హిందూమతం యొక్క ప్రధాన శాఖలలో ఒకటి. వేదాలను, శాస్త్రాలను అనుసరించే వారిని స్మార్తులు అంటారు. స్మార్తులు ప్రధానంగా ఆది శంకరాచార్యుడు ప్రవచించిన అద్వైత వేదాంత తత్వాన్ని అనుసరిస్తారు. అయితే వీరు ఇతర తత్వాలను ప్రవచించి, అనుసరించిన కొన్ని సందర్భాలు ఉన్నాయి). పూజారులుగా ఉన్నారు. తానీషా పై మొగలాయీల దండయాత్ర తర్వాత, అప్పటి తురుష్కులిక్కడి ఆలయాలపై పడ్డారు. అపుడు ఇక్కడి పూజారి కుటుంబం వెళ్ళిపోయింది. వారి వంశాలు తర్వాతా మేడిపూరు, గుండూరు, గోపాలపేటలలో ఉండేవారు. వారిని గంగాపురం వారనే పిలిచేవారు.

స్మార్తుల తర్వాత ఈ ఆలయాన్ని దేవరకొండ సీమలోని మరింగంటివారు వచ్చి, సంప్రోక్షణ చేసి పూజారులుగా నిలిచినారు. ఆ వంశానికి చెందిన మరింగంటి వెంకట రాఘవాచార్యులు ఇక్కడ ఆచార్యులుగా ఉండేవారు. ఆయన కేశవస్వామి శతకం ఇక్కడి చెన్న కేశవుని పైననే రచింపబడింది.

అతడే కాక ఈ స్వామిపై పెన్గలూరి వెంకటాద్రి మొదలైన మరి కొందరు కవులు గూడా శతకాలు, స్తుతులు రచించినారు .

పూర్వం ఈ ప్రాంతాన్ని పరిపాలించిన దేవసేనుడు అనే రాజు ఈ ప్రాంతంలో నీటి కొరత ఉండటం వలన హిమాలయాలకు వెళ్లి గంగమ్మ కోసం తపస్సు చేయగా ఆ తల్లి ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకో అని అడుగుతుంది, అప్పుడు దేవసేనుడు ఇలా అంటాడు, నా వెంట వచ్చి మా పట్టణములో ప్రవహించాలి అని కోరుకుంటాడు. అమ్మ వారు

అందుకు అంగీకరించి తన వెంట వచ్చిఈ ప్రాంతంలో ప్రవహించినది. అప్పటి నుండి ఈ నదికి దేవసేన నది అని పేరు వచ్చినది అని స్థల పురాణం. ఆ తల్లి పేరిటనే ఈ ప్రాంతానికి గంగాపురం అనే పేరు వచ్చింది అని చెబుతారు.

**8. మౌఖిక కథనం:**

స్వామివారికి ప్రతి సంవత్సరం అక్కడి భక్తులు పాదరక్షలు చేసి సమర్పిస్తారు. వాటిని ధరించి స్వామి వారు, తన భక్తులను రక్షించడానికి తిరుగుతారు అని, భక్తులు భావిస్తారు. వాటికి రుజువుగా ఆ పాదరక్షలకు కాష , ఏడెముళ్ళు, ఎర్రమట్టి దర్శనం ఇస్తాయి. భక్తుల రక్షణార్థమే స్వామి వారు భక్తుల పరిసర ప్రాంతాలలో పర్యటించి , భక్తులను కాపాడతారు అని భక్తుల విశ్వాసం.

**9. ఆలయ నిర్మాణం – శిల్పకళా విశేషాలు:**

శతాబ్దాలు మారినా చెక్కు చెదరని అపురూప శిల్పకళా సన్నిధి అక్కడ కనిపిస్తుంది. మహోన్నత శిల్ప కళా వైభవం కలదు. ఆలయ ప్రాంగణంలో రెండు ప్రాకారాలతో ఎత్తైన అధిష్టానం పైన తూర్పు ముఖంగా ఏక కూటాలయ వాస్తు రీతిలో నిర్మించబడినది. ప్రాకార కుడ్యాలపై బంధ శిల్పకళ కనపడుతుంది. బారులు తీరిన ఏనుగుల ఆకృతులు ఇతల విలక్షణ నగిషీలు ఆకట్టు కుంటాయి. ప్రథమ ప్రాకార కుడ్యాల పైన ఉన్న పలు నగిషీలు కళా నైపుణ్యం చేస్తే ఎంతో ప్రాచీనమైనదని తెలుస్తుంది. ఇంకా విష్ణు స్వరూపాలతో పాటు బ్రాహ్మి, మహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి,చాముండి విగ్రహాలు గోచరమౌతాయి.

గర్భాలయంలో చెన్నకేశవ స్వామి స్థానక భంగిమలో ఎంతో ఆకర్శణీయంగా శంకు చక్రాలు, గద కమలాలను ధరించి సాక్షాత్కరిస్తాడు. విగ్రహం పక్కనే సుదర్శన చక్రతల్వార్ మరియు కేశవునికి వామ భాగాన పద్మాసీనురాలై లక్ష్మి దేవి అభయ వరద ముద్రలతో ఉంటుంది. కొంత దూరంలో చతుర్భుజ గణపతి విగ్రహం కలదు. పశ్చిమ చాళుక్యులు ఘనపతిని విశేషంగా ఆరాదించే వారు. అందుకే చాళుక్యులు నిర్మించిన ఏ ఆలయంలోనైన గణపతిని ప్రతిష్టించి ఉంటారు అని తెలుస్తుంది. ఆలయ ప్రథమ ప్రాకార అంతర్భాగంలో ఈశాన్య దిశలు రాతి మెట్లతో సోపాన ఆకృతిలో రాతితో నిర్మించిన లోతైన పుష్కరిణి ఉన్నది. నేటికి అక్కడి పుష్కరిణి నుతనంగానే కనిపిస్తుంది. ఆలయం చుట్టూ మట్టితో ఒక కోట నిర్మించి ఉంది. అక్కడ ఆలయ ద్వారా పాలకుడు నివాసం ఉన్నట్లు, అతని పేరు భైరవుడుగా తెలుస్తుంది. అక్కడ భైరవుని విగ్రహం కలదు. ఆ విగ్రహన్ని యుద్ధ సమయంలో ప్రత్యర్థులు అడ్డంగా కత్తితో నరికినట్లు అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి ఎదురుగా అతి పెద్ద ధ్వజ స్థంభం కలదు.

ఆలయం చుట్టూ రాతి మట్టితో కూడిన ప్రాకారాలు ఉంటాయి. ముందు రాతితో నిర్మించిన ప్రాకారం దాని పైన మట్టితో నిర్మించిన ప్రాకారం ఉండటం ఇక్కడి ఆలయ నిర్మాణ ప్రత్యేకతగా కనిపిస్తుంది. ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. ఈ ఆలయం ప్రాకారంతో పాటుగా ఎత్తైన వేదికపై కట్టబడింది. దక్షిణ దేశంలోని బేలూరు సోమనాథ పురాలలోని చెన్న కేశవాలయాలు గూడ ఇలాగే కట్టబడినవి. ఇది చతురస్రంగా ఉండి, విమానం సోపాన పద్ధతిలో ఉంది. ఇక శిల్ప నైపుణ్యానికి దీనికిదే సాటి. శిల్పులు ద్వార బంధాలపై, స్తంభాలపై చూపిన కళా వైభవం అద్భుతంగా కనిపిస్తుంది.

**ముగింపు**

"గంగాపురం చెన్నకేశవాలయం – చారిత్రక అంశాలు" పరిశోధన పత్ర అంశంగా తీసుకున్నాను. ఇందులో గంగాపురం చెన్నకేశవస్వామి చరిత్ర విశేషాలు, ఆ చరిత్ర శోధనలో దొరికిన ఎన్నో ఆసక్తికర అంశాలు చర్చించడం జరిగింది. అందులో ముఖ్యమైనది గొల్లత్త గుళ్ళు, వాటి ప్రత్యేకత, అక్కడ బయట పడిన జైన, బౌద్ధమత ప్రతిమల ఆనవాళ్ళు, వారి పరిపాలన, చారిత్రక నిర్మాణ కట్టడాల గురించి వివరించడం జరిగింది.

అలాగే గంగాపురం ప్రాచీన చరిత్ర నామ విశేషాలు, గంగాపురం పేరు ఎలా వచ్చింది. ఏయే యుగంలో ఎలాంటి పేర్లతో పిలిచేవారు ఎవరి పరిపాలన మూలంగా ఈ పేరు వచ్చింది అనే విషయాలు చర్చించడం జరిగింది. గంగాపురం శాసనాలు, తాటికొండ శాసనాలలో వాటి ప్రస్తావన, స్థల పురాణం, మౌఖిక కథనాలు ఆలయ నిర్మాణం శిల్పకళా విశేషాలు మొదలైన అంశాల గురించి విరరించడం జరిగింది.

**పాదసూచికలు**


1. గంగాపురం చరిత్ర పీఠిక, సురవరం ప్రతాప రెడ్డి, పుట: 15.

2. గంగాపురం చరిత్ర పీఠిక, సురవరం ప్రతాప రెడ్డి, పుట: 151.

3. ఎఫికల్ గ్రాఫికల్ రిపోర్ట్ 1.

4. గంగాపురం చరిత్ర పీఠిక, సురవరం ప్రతాప రెడ్డి, పుట 152, సాక్షి దినపత్రిక, తెలంగాణా ఎడిషన్, మార్చ్05, 2019.

5. గంగాపురం మాహాత్మ్యం, శ్రీ రెడ్డెడ్డి మల్లారెడ్డి దేశాయి, పుట:44, 45.

6. సాక్షి దిన పత్రిక, తెలంగాణా ఎడిషన్, జులై 18, 2021.

7. పాలమూరు దేవాలయాలు, కపిలవాయి లింగమూర్తి పుట 148.



**రచయిత:** పరిశోధక విద్యార్థి,
పాలమూరు విశ్వవిద్యాలయం

# తెలుగు నవలా సాహిత్యంలో 'ప్రపంచీకరణ'

● భైరపోగు శివకుమార్

**వ్యాస సంగ్రహం**

ఆధునిక తెలుగు సాహిత్యంలో.. మానవ సమాజ గమనంలోని సూక్ష్మస్థాయి లోతులను బహుముఖీన పార్శ్వాలలో విశాలమైన పరిధిలో చిత్రిక పట్టిన సాహిత్య ప్రక్రియ ఏదైనా ఉన్నదంటే అది నవలా సాహిత్యమే. ప్రభావపరంగా చూసినప్పుడు కవిత్వం అత్యంత శక్తివంతమైనదేగాని దాని పరిధి వలన జీవితంలోతులన్నింటినీ అది తడమలేదు. అట్లే కథ కూడా ఒక సంఘటననో, సన్నివేశాన్నో కళాత్మకంగా వ్యక్తం చేయగలుగుతుంది. నాటకం కథకంటే కొంత విస్తృతమైనదే అయినా దానికీ విశాలమైన పరిధి లేదు. ఇట్లా నవలేతర ఇతర ఆధునిక సాహిత్య ప్రక్రియలకన్నింటికీ పరిమితులు ఉన్నాయి. కానీ నవలా ప్రక్రియ కాన్వాస్ చాలా విశాలమైనదీ, విస్తృతమైనదీ. 1990ల తర్వాత మొదలైన ప్రపంచీకరణ గురించీ, దాని పర్యవసానాల గురించీ రాశి, వాసి కోణంలో చూసినప్పుడు కవిత్వం ఎక్కువగా, కథ, నాటకం కొద్దిమేరకు స్పృశించాయి. కానీ నవలా సాహిత్యం ప్రపంచీకరణ మానవ జీవితంలో తీసుకువచ్చిన ప్రతి మార్పునూ, సూక్ష్మస్థాయిలో వివరించగలిగింది. ఆధునిక మానవ జీవిత ప్రస్థానంలో చోటుచేసుకున్న, చేసుకుంటున్న విషయాలతోపాటు, భవిష్యత్తులో ఏర్పడగలిగే అవకాశం ఉన్న పరిస్థితులను కూడా దర్శింపజేసింది. నిర్దిష్టంగా ప్రపంచీకరణ మొదలైన తర్వాత వెలువడిన నవలా సాహిత్యంలో దాని ప్రభావాలు ఏ విధంగా వ్యక్తమయ్యాయో విశ్లేషించడమే ఈ వ్యాస లక్ష్యం.

**సాంకేతిక పదాలు (Key Words)**

*ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, నవల, వస్తు వినిమయ సంస్కృతి/వ్యాపార సంస్కృతి, పెట్టుబడిదారీ దేశాలు, మూడవ ప్రపంచదేశాలు/అభివృద్ధి చెందుతున్న దేశాలు, డాలర్ వ్యామోహం.*

**0. ఉపోద్ఘాతం**

'హితేన సాహితం సాహిత్యం' అనేది లాక్షణికుల అభిప్రాయం. అంటే సమాజ శ్రేయస్సును ఆకాంక్షించేదే సాహిత్యం. ఆ ఆకాంక్షలో ఏ విషయానికి సంబంధించి అయినా లోతైన పరిశీలన, అవగాహన, విశ్లేషణ, పరిష్కారం అనే అంశాలు ఉంటాయి. లాక్షణికుల అభిప్రాయానికి సమర్థవంతమైన, సహేతుకమైన ఉదాహరణగా నిలిచేది నవలా సాహిత్యం. ఆ కోణంలో చూసినప్పుడు ప్రపంచీకరణ ఎట్లా మానవ సమాజంలోకి ప్రవేశించింది, దాని ద్వారా లబ్ధిపొందేది ఎవరు, నష్టపోయేది ఎవరు అనే విషయాలతోపాటు ప్రపంచీకరణ మౌలికాంశాలను తెలుగు నవలా సాహిత్యం చాలా లోతుగా వివరించింది. ఈ పరిశోధనా వ్యాసంలో ఆయా విషయాలను విశ్లేషించడం జరుగుతుంది.

**1. ప్రపంచీకరణ పరిచయం**

ప్రపంచీకరణ అనే మాటకు భారతదేశ పాలకవర్గాలు ఇచ్చిన నిర్వచనానికి భిన్నమైన అర్థం సామాజిక వాస్తవికతలో కనిపిస్తుంది. ప్రపంచీకరణ అనే మాటలో రూపపరమైన భావం వసుధైక కుటుంబమని కనిపిస్తుంది. కానీ దాని సారాన్ని అర్థం చేసుకున్నప్పుడు, ప్రపంచీకరణ అనేది కొన్ని పెట్టుబడిదారీ దేశాలు, ఎదిగే క్రమంలో ఉన్న మూడవ ప్రపంచదేశాల్లోని అన్ని రంగాలను విధ్వంసం చేసి, స్వేచ్ఛావాణిజ్యం చేసుకోవడం కోసం ఎన్నుకున్న ఒకానొక వ్యాపార ఎత్తుగడ. ప్రపంచీకరణకు మేధావులు ఇచ్చిన కొన్ని నిర్వచనాలను గమనిస్తే దాని రూపసారాలు సులభంగా అర్థమవుతాయి. 1. "ప్రపంచాన్నంతా ఒకే సంతలాగా మార్చి వస్తువులు, మేధస్సు, సంస్కృతిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం ప్రపంచీకరణ అని చెప్పవచ్చు" (కాశీం, చింతకింది, ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం సిద్ధాంత గ్రంథం, పుట. 6). 2. "ఒక కేంద్రమంటూ లేకుండా నిర్ణీతమైన అధికార వ్యవస్థ అనేది లేకుండా సర్వే సర్వత్రా ఆవిష్కరింప బడుతున్న అనివార్య క్రమమే ప్రపంచీకరణ" (మురళి, అట్లూరి(సంపా), ప్రపంచీకరణ పదేళ్ల అనుభవాలు, పుట. 3). 3. "దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం, పెట్టుబడి, సేవలు ఎటువంటి ఆంక్షలు ఆటంకాలు లేకుండా దేశ సరిహద్దులు దాటి స్వేచ్ఛగా నిర్నిబంధనలతో ప్రవహించే వెసులుబాటు" (అదే, పుట: 261). 4. "అభివృద్ధి చెందిన దేశాలు డబ్బు బలంతో ఈ సంతపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వాళ్లు చెప్పిందే వేదం. అందరూ దానినే ఆచరించాలి. సమాజాలకు ఉండే స్వతంత్ర జీవనాన్ని కూడా కోల్పోవాలి. ఇదంతా ప్రపంచీకరణ భావ జాలమే. అందుకే ప్రపంచీకరణ అంటే మార్కెట్ ఆర్థిక వ్యవస్థే" (అదే, పుట: 289). 5. "తమలో విభేదాలు పరిష్కరించు కోవడానికి ఉత్తమమైన, తేలికైన మార్గం దోపిడీ సొత్తును పంచుకోవడమే. ఆ విధంగా ప్రస్తుతం పెట్టుబడిదారీ వర్గం అనుసరించే ప్రపంచ వ్యూహం ప్రపంచీకరణ" (ఫణిక్కర్, కె.ఎన్, సాంస్కృతిక కాలుష్యం, పుట: 24). 6. "ప్రపంచీకరణ అంటే ప్రపంచవ్యాపితంగా, ముఖ్యంగా బీద దేశాల్లోకి ద్రవ్య పెట్టుబడులను గుప్పించడమే" (చౌదరి, కె.ఆర్. ప్రపంచీకరణ ఎవర్ని ఉద్ధరించడానికి, పుట: 2)

ఈ నిర్వచనాలన్నింటినీ లోతుగా అర్థం చేసుకున్నప్పుడు, ప్రపంచీకరణ అనేది కేవలం పెట్టుబడిదారీ దేశాలు తమ స్వార్థం కోసం రూపొందించుకున్న ఒకానొక ఆర్థిక విధానమనీ,

దానివలన సాధారణ ప్రజానీకానికి ఎటువంటి లాభం లేకపోగా, వారి జీవన రంగాలన్నింటినీ అది కూకటివేళ్ల స్థాయిలో విధ్వంసం చేస్తుందని తెలుస్తుంది. పెట్టుబడిదారీ దేశాలకు సంబంధించిన గుత్తపెట్టుబడి సంస్థలు తాము చేసిన వస్తువులను అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విస్తృతంగా అమ్ముకోవడం కోసం ఒక మార్కెట్ భావజాలాన్ని సృష్టించాయి. దాంతో సమాజంలో వస్తువినిమయ సంస్కృతి వ్యాపించి కౌటుంబిక సంబంధాల్లో అనేక కృత్రిమత్వం ప్రవేశించింది. మనుషుల మధ్య ఎడం పెరిగింది. అదేవిధంగా విద్య, ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల మీద కూడా ప్రపంచీకరణ తీవ్రమైన ప్రభావం వేసింది. కనుక మొత్తం సామాజిక జీవనంలోనే పెను మార్పులు సంభవించాయి. అవి దృశ్యాదృశ్యంగా ఉన్నాయి. నవల మానవ జీవితాన్ని లోతుగా విశ్లేషిస్తుంది కనుక తెలుగు నవల ఏమేరకు ప్రపంచీకరణను వ్యక్తం చేసిందో పరిశీలించడం అవసరం.

**2. తెలుగులో ప్రపంచీకరణను చిత్రించిన నవలలు**

కాలువ మల్లయ్య 'బతుకు పుస్తకం' అనే నవల రాశారు. ఇందులో తెలుగు నేలమీది వ్యవసాయరంగంపై ప్రపంచీకరణ ప్రభావాలను, పర్యవసానాలను చిత్రించారు. ఈ రచయితే రాసిన మరొక నవల 'మాట్లాడే బొమ్మలు'. ఇందులో ఇరవయ్యవ శతాబ్ది ఎనిమిదవ దశకం నుండి చివరి దశకం దాకా తెలంగాణ సమాజంలో ప్రపంచీకరణ ఫలితంగా చోటుచేసుకున్న పరిణామాలన్నీ దర్శనమిస్తాయి. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన నవల 'దాడి'. ఇందులో తెలంగాణ గ్రామీణ జీవితంలో నూతనంగా చోటుచేసుకుంటున్న పరిస్థితులను ప్రధానంగా వర్ణించడంతోపాటు, వ్యవసాయరంగ సంక్షోభం గురించి ప్రధానంగా వివరించారు. ప్రపంచీకరణ ఫలితాలను చిత్రిస్తూ చంద్రలత రాసిన నవల 'రేగడి విత్తులు'. అనివార్యంగా ముందుకు వస్తున్న పరిస్థితులను అవగతం చేసుకుంటూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేపట్టవల్సిన అగత్యాన్ని తెలియజేయడం ఈ నవలలో కనిపిస్తుంది. భార్గవిరావు రాసిన నవల 'తూర్పుగాలి'. ప్రపంచీకరణ పర్యవసానాలు మొదలైన తర్వాత యువతరం విదేశాలకు వెళ్లడం కోసం ఆలోచించడం, అక్కడికి వెళ్లిన తర్వాత ఏర్పడే పరిస్థితుల గురించి ఈ నవలలో చిత్రీకరించారు. సుధామూర్తి రాసిన నవల 'డాలర్ కోడలు'. ఇందులో మానవ సంబంధాలను ప్రపంచీకరణ ఎట్లా విధ్వంసం చేసిందో చిత్రించడం కనిపిస్తుంది. విప్లవోద్యమ నేపథ్యంలో ప్రపంచీకరణను వ్యాఖ్యానించిన నవల 'అన్నలు'. దీన్ని పులుగు శ్రీనివాస్ రాశారు. ఇందులో ప్రపంచీకరణ వల్ల చేతివృత్తులు, కులవృత్తులు ఎలా విధ్వంసానికి గురయ్యాయో వివరించడం కనిపిస్తుంది. విస్తృతమైన తెలుగు నవలా సాహిత్యంలో ప్రపంచీకరణ గురించి ప్రధానంగా కాకపోయినప్పటికీ రేఖా మాత్రంగా వివరించిన నవలలు చాలానే ఉన్నాయి. కానీ ప్రపంచీకరణనే ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించినవి ఈ ఏడు నవలలే.

**3. కౌటుంబిక సంబంధాలు - ప్రపంచీకరణ నవల**

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను ప్రభావితం చేసింది. దానికి మనుషులంటే బుద్ధిజీవులుగా కాకుండా సరుకులుగా మాత్రమే కనిపిస్తారు. అందుకే అది మానవ సంబంధాల మధ్యన వస్తువినిమయ సంస్కృతిని ప్రబలింపజేసింది. 20 శతాబ్దం చివరి దశాబ్దం తరువాత తెలుగు నేలమీది కుటుంబాల్లో అందుకే వినూత్నమైన ఆలోచనా విధానం పరివ్యాప్తం కావడం కనిపిస్తుంది.

సుధామూర్తి రాసిన 'డాలర్ కోడలు' అనే నవలలో, ప్రపంచీకరణ అనేది కుటుంబ వ్యవస్థలో తెచ్చిన మార్పులను సూక్ష్మస్థాయిలో ఎండగట్టింది. ప్రపంచీకరణ ప్రభావాలను తెలియజేస్తూ భార్గవీరావు గారు ప్రకటించిన 'తూర్పుగాలి' నవల కూడా చాలా విశిష్టమైనది. బాగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో కేవలం ఐదు సంవత్సరాల్లోనే తిరిగి భారతదేశానికి వద్దామని అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోయిన ఒక భార్యాభర్తల జంట(సుధాకర్, పద్మిని)ను తీసుకుని మనుషుల్లో ప్రబలిన డాలర్ వ్యామోహాన్ని తెలియజేసిన నవల ఇది.

**4. విద్యారంగం - ప్రపంచీకరణ**

ఆధునిక మానవుడి నిర్మాణమే విద్య పునాదిగా జరిగింది. విద్య లేకుండా మనిషి జీవితంలో ఇవాళ కనిపిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, పురోగమనం సాధ్యమయ్యేవే కావు. మనిషి జీవితంలో పాఠశాల నుండి కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుకునే చదువు వరకు పొందే జ్ఞానమే వారి భవిష్యత్తును నిర్మాణం చేస్తుంది. విద్యార్జన సమయంలో తాము పొందిన తెలివిడే వారిని నవీన మానవులుగా రూపొందిస్తుంది. అటువంటి కీలకమైన విద్యారంగం కూడా ప్రపంచీకరణ ప్రభావానికి లోనైంది. భారతదేశంలోని విద్యావిధానం ప్రారంభంలో వ్యక్తి చైతన్యానికీ, పురోగమనానికీ ప్రధాన ఆకరంగా ఉన్నప్పటికీ తర్వాతి కాలంలో పాలకుల కారణంగా తీవ్రమైన మార్పులకు లోనైంది. ఆంగ్లేయ పాలకులు భారతీయ విద్యను తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకున్నారు. చవకైన మానవ వనరులను తయారు చేయడానికి విద్యారంగాన్ని ఒక సాధనంగా వాడుకున్నారు. దాంతో భారతీయ విద్యారంగంలో నాణ్యత తగ్గిపోయింది. మానవాభివృద్ధికి ఉపయోగపడవల్సిన విద్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చే క్రమంలోకి దిగజారిపోయింది. భారతీయ పాలకులు చేపట్టిన విద్యావిధానాలు సామ్రాజ్యవాద దేశాలకు ఊడిగం చేసే మనుషులను తయారు చేసేందుకు దోహదపడ్డాయి. ఈ అవాంఛనీయ ధోరణి గురించి ప్రపంచీకరణను వస్తువుగా స్వీకరించిన నవలలను నిరసించాయి.

ఇంతకుముందే ప్రస్తావించిన సుధామూర్తి గారి డాలర్ కోడలు నవలలో విద్యారంగ విధ్వంసం గురించీ, మనుషుల్లో అది తీసుకువచ్చిన మార్పుల కూడా గురించీ విపులంగా చర్చించడం జరిగింది. ఈ నవలలో డాలర్ కోడలుగా మారిన ఒక ఇల్లాలి గురించే ప్రధానంగా చర్చించినప్పటికీ ఆమె అత్తగారైన గౌరమ్మలో కూడా అనేక అవాంఛనీయ ధోరణులు తలెత్తిన విషయాన్ని కూడా అంతే ప్రధానంగా కనిపిస్తుంది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన గౌరమ్మ, తమ

కష్టాలన్నింటికీ పరిష్కారం తమ పిల్లలు బాగా చదివి అమెరికా వెళ్లి, లెక్కకు మిక్కిలి డబ్బులు సంపాదించడమే అని భావిస్తుంది. కనుక తమ పిల్లలను ఆమె ఆ కోణంలోనే ఆలోచించేట్లు పెంచుతుంది. అందుకే గౌరమ్మ పిల్లల చదువుల అంతిమ లక్ష్యం అమెరికా, సంపాదనే అయ్యాయి. తల్లిదండ్రుల ఆలోచనా విధానం ప్రభావం తప్పకుండా వారి పిల్లలమీద ఉంటుంది. కనుక సహజంగానే గౌరమ్మ కొడుకు శేఖర్‌లో డబ్బుపట్ల పేరాశ నిండిపోయి అమెరికా వెళ్లి అక్కడే డాలర్ల వేటలో నిమగ్నమైపోతాడు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఎరగా వేసిన డాలర్ వ్యామోహం భారతీయ యువతలోని దేశభక్తిని పూర్తిగా హరించివేసింది. అట్లా ఆయన ఆలోచనలు రూపుదిద్దుకోవడానికి అతని తల్లి మాత్రమే కారణం కాదు. ఆయన చదువుకున్న చదువుల్లో సామ్రాజ్యవాద ప్రాయోజిత లక్ష్యాలే ప్రధానంగా ఉన్నాయి.

నవలలో ప్రధానంగా 'చదువు' అనే విషయానే చర్చించినప్పటికీ ఆ 'చదువు'ను ప్రేరేపించగల, నడిపించగల, నిర్దేశించగల సామాజిక పరిస్థితులను గూర్చి వివిధ కోణాల్లో విశ్లేషించడం కనిపిస్తుంది. ఈ నవలలో చర్చించిన మరొక ముఖ్యమైన విషయం విద్యాసంస్థల్లో ఎన్నికలు ఉండాలన్నది. ప్రపంచీకరణ రూపుదిద్దుకోకంటే ముందు కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఎన్నికలు ఉండేవి. తద్వారా విద్యార్థులు రాజకీయంగా చైతన్యం పొందేవారు. అట్లా వారికి కుటుంబం, సమాజం, సామాజిక బాధ్యత వంటి విషయాలు అవగాహనలోకి వచ్చేవి. కానీ ప్రపంచీరణ విద్యార్థులకు రాజకీయాలు వద్దని, ఎన్నికల చట్రాన్ని రద్దు చేసిందనీ, దాని మూలంగానే విద్యార్థులు ఏ సామాజిక అవగాహన లేకుండా తయారయ్యారనీ ఈ నవల నొక్కిచెప్పింది.

**5. ఉపాధి రంగం – ప్రపంచీకరణ**

ఏ దేశంలోనైనా విద్య నేర్చుకున్న యువతరం, తాము పొందిన జ్ఞానంతో, స్వదేశంలోనే ఉద్యోగాలు సంపాదించి, తమ కుటుంబాన్ని తాము నడిపించుకుంటూనే దేశానికి సేవ చేసే సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాలి. కానీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తయారు చేసిన విద్యావిధానం భారతదేశ యువతరాన్ని ఈ పద్ధతికే దూరం చేసింది. ఆ విధంగా స్వదేశంలోని విద్యాసంస్థల్లోనే చదువుకుని తాము పొందిన జ్ఞానాన్ని విదేశాలకు ఊడిగం చేయడం కోసమే వినియోగించి, డబ్బుల వెనుక పరుగులు పెట్టిన యువతరం గురించి తూర్పుగాలి, డాలర్ కోడలు ఎట్లా చిత్రికపట్టాయో ఇదివరకే చర్చించడం జరిగింది. అయితే, తాము చదువుకున్న చదువులకు స్వదేశంలో సరైన ఉద్యోగాలు అందించలేని పరిస్థితిలో దేశం ఉన్నదనే విషయం కూడా దీనిద్వారా అర్థం చేసుకోవచ్చు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో ఇది ఒక కోణం. ఇంకొక విషయం కూడా గమనించదగినది. మానవ శ్రమ స్థానంలో యంత్రాలను ప్రవేశపెట్టి, అసంఘటిత కార్మిక రంగంలో, పారిశ్రామిక రంగంలో, ఉపాధి అవకాశాలను దెబ్బకొట్టడం సామ్రాజ్యవాదానికి ఉన్న మరో కోణం. ఊరిలో ఉండే వ్యవసాయదారులందరికీ తోలు ఉత్పత్తులు అందించేవారు మాదిగలు. రబ్బరు ఉత్పత్తులు రావడంతో వారికి బతుకుదెరువు పోయింది. బట్టలు కుట్టడం ద్వారా జీవనం సాగించేవారు మేరోళ్లు. రెడీమేడ్ దుస్తులు రావడంతో వారికి జీవనోపాధి అవకాశాలు మృగ్యమైపోయాయి. ఈ పరిస్థితుల గురించి కూడా తెలుగు నవల చిత్రీకరించింది.

ఇంతకుముందు ప్రస్తావించిన నవలాకారులు కాలువ మల్లయ్య గారు రాసిన 'బతుకు పుస్తకం' అనే నవలలో ప్రపంచీకరణ పర్యవసానాలను సామాజిక వాస్తవం ప్రతిబింబించేట్లు వర్ణించారు. మానవ శ్రమ స్థానంలో యంత్రాలు ప్రవేశించడం, కులవృత్తులు, చేతివృత్తులు ధ్వంసం కావడం మొదలైన పరిణామాలన్నీ ఈ నవలలో చిత్రించడం జరిగింది. వాస్తవానికి 1990 దశకం తర్వాత వివిధ సామాజిక రంగాల్లో పనిచేస్తున్న వారు ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారంటే, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సామ్రాజ్యవాద ప్రపంచీకరణనే కారణం అని చెప్పడంలో అతిశయోక్తి ఉండదు.

**6. వ్యవసాయ రంగం – ప్రపంచీకరణ**

భారతీయ మానవ జీవితంలో అత్యంత మౌలికమైనది వ్యావసాయిక రంగం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మూలంగా భారతదేశంలో, నిర్దిష్టంగా ఆంధ్రప్రదేశ్‌లో, మరీ ముఖ్యంగా తెలంగాణలో దెబ్బతిన్న రంగాల్లో వ్యవసాయం అతి ముఖ్యమైనది. నూతన ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయరంగంలో చోటుచేసుకున్న కొత్త వాణిజ్య పంటల సాగు పెరుగుదల, దానికి అవసరమైన అవగాహనాలేవి, నవీన పంటల సాగుకోసం అవసరమైన ప్రభుత్వ రాయితీల కొరత, ఉత్పత్తుల కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం మొదలైన అంశాలన్నీ వ్యవసాయదారులను సంక్షోభంలో పడేశాయి. ప్రపంచీకరణ ఫలితంగా వ్యవసాయరంగంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల గురించి కె.ఆర్.చౌదరిగారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతో కీలకమైనవిగా గుర్తించాలి. మొత్తం వ్యవసాయరంగ సంక్షోభం గురించి ఆ అభిప్రాయాలు వివరిస్తున్నాయి. "సాంప్రదాయిక వ్యవసాయంలో అంటే కేవలం జీవనం చేయడానికే కొనసాగించే వ్యవసాయంలో ధరల ప్రాముఖ్యత అంతగా లేకపోవచ్చు. ఎందుకంటే ఈ వ్యవసాయంలో రైతు తన గృహ అవసరాలు ముఖ్యంగా తిండిగింజలు తీర్చుకోవడానికే ఎక్కువ ప్రాముఖ్యతయిచ్చేవాడు. అంటే గతంలో రైతులు ఎక్కువగా ఆహార ధాన్యాలనే పండిచ్చేవారు. అమ్ముకోవడానికి మిగుళ్లుగానీ, వాణిజ్య పంటలు గానీ ఉండేవి కావు. కానీ, ఈనాడు వ్యవసాయం వ్యాపారంగా మారిపోతూ ఉన్నది. వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా రైతులు పొందుతున్నారు. వాణిజ్య పంటలు పండిస్తున్నారు. వ్యవసాయోత్పత్తుల మిగుళ్ళు కూడా ఎక్కువగానే ఉన్నవి. అందువల్ల రైతులకు గిట్టుబాటు ధరలు అవసరం. అంతేకాక, ఈనాటి వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయకూలీ, రోడ్లు, కరెంటు ఛార్జీలు, నీటితీరువా,

మొదలైన వాటిపైన ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఈ ఖర్చులు తీరాలంటే, పెట్టుబడులు పెట్టాల్సిందే. పెట్టుబడులు పెట్టాలంటే రైతాంగానికి ఆదాయాలు అవసరం. ఆ ఆదాయాలు ధరల నుండే వచ్చే విషయం మనందరికి తెలుసు. ధరలు పడిపోతే రైతు పెట్టుబడి పెట్టలేడు. ఉత్పత్తులు పెంచలేడు. అందువల్ల దీర్ఘకాలిక సరఫరా దెబ్బతింటుంది. పైగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటపడలేక కొట్టుమిట్టాడుతారు''(చౌదరి, కె.ఆర్, వ్యవసాయం – ప్రపంచీకరణ. పుట. 37, 38). ఈ విధంగా వ్యవసాయరంగంలో చోటుచేసుకున్న మార్పులు మొత్తం భారతీయ సమాజాన్ని, మరీముఖ్యంగా రైతాంగాన్ని అతలాకుతలం చేశాయి.

ఈ విషయాలను తెలుగు నవల సమర్థవంతంగా చిత్రించింది. కాలువ మల్లయ్య రాసిన 'బతుకు పుస్తకం' నవలలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యవసాయరంగం మీద వేసిన విషప్రభావాలను చిత్రీకరించింది. వ్యవసాయ రంగంలో ప్రపంచీకరణ తీసుకొచ్చిన మార్పులవల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు అనే విషయాన్ని ఈ నవల చిత్రించింది.

ప్రపంచీకరణ వ్యవసాయ రంగం మీద వేసిన ప్రభావాన్ని చిత్రిస్తూ చంద్రలత రాసిన 'రేగడి విత్తులు' అనే నవల రాశారు. నవలారంభంలో రచయిత్రే స్వయంగా ఈ నవలా నేపథ్యాన్ని, సారాంశాన్ని, ఉద్దేశ్యాన్ని వివరించారు. ప్రపంచీకరణ పర్యవసానాలు ఆరంభమయ్యాక, కల్తీ ఎరువులు, విత్తనాలు, పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో ధర పడిపోవడం, దళారీల పాత్ర మొదలైన రైతుజీవితంలోని విషయాన్నీ నవలలో చోటుచేసుకున్నాయి. కానీ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, వ్యవసాయరంగం మీద వేసిన ప్రభావం ఎటువంటి దీర్ఘకాలిక నష్టాలను మిగులుస్తుందోననే వాస్తవిక, చారిత్రక అవగాహన రచయిత్రికి లేకపోవడం మూలంగా ఈ నవల ప్రపంచీకరణకు సమర్థనగానే రాశారని చెప్పవచ్చు.

ప్రముఖ తెలుగు కాల్పనిక సాహిత్య రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'దాడి' నవల ప్రపంచీకరణ పర్యవసానాలను అద్భుతంగా చిత్రికపట్టింది. వలసలన్నవి ప్రపంచవ్యాప్తంగా ఉన్నవేగాని వాటి స్వభావమేమిటన్నదే కీలకమైనది. తెలంగాణలో ప్రజలు వలస వెళ్లేది బతుకుదెరువు కోసం మాత్రమే. కన్న ఊర్లో బతికే అవకాశాలు కరువై, ఉన్న పొలాన్ని సాగు చేసుకునే అవకాశాలు ఆవిరై, చేసేదేమీలేక జీవిక కోసం పట్టణాలకు బాటపడతారు. స్థానిక వ్యవసాయంలో సాంప్రదాయికంగా అవసరం కోసం పంటలు పండించే స్థానంలో వ్యాపారపంటలు ప్రవేశించడం, సంకర విత్తనాలు, కృత్రిమ ఎరువుల, పురుగుల మందుల వినియోగం వంటివి చోటుచేసుకుని రైతాంగం చితికిపోయింది. అలవాటు లేని పంటల సాగు, కొత్త వ్యవసాయ పద్ధతుల కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

### 7. పారిశ్రామిక రంగం – ప్రపంచీకరణ

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని తీసుకున్నది. అది దాని వ్యాపార లక్ష్యం. "సంకుచితమైన అర్థంలో చూసినప్పుడు ప్రైవేటీకరణ అంటే పబ్లిక్ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులపరం చేయడం. కానీ ఈ వివరణ ప్రైవేటీకరణ స్వభావాన్ని పూర్తిగా వివరించదు. ఎందుకంటే ప్రైవేటీకరణ కార్యక్రమానికి ఆస్తుల అమ్మకానికన్నా విస్తృతమైన లక్ష్యమున్నది. ప్రభుత్వం తాను నిర్వహిస్తున్న కార్యక్రమాల నుండి వైదొలగి వాటిని ప్రైవేటురంగానికి వదిలివేసి అలా ప్రైవేటీకరించగా మిగిలిన సేవా, ఉత్పాదక రంగాలను మార్కెట్ సూత్రాల ప్రకారం నిర్వహించడాన్ని ప్రైవేటీకరణ అంటారు" (మురళి, అట్లూరి (సంపా), ప్రపంచీకరణ – పదేళ్ల అనుభవాలు, పుట. 61). ఈ సమస్యలన్నీ కార్మికవర్గం చవిచూసింది. ఈ క్రమాన్ని తెలుగు నవల విశ్లేషించింది.

వులుగు శ్రీనివాస్ 'అన్నలు' నవల రాశారు. ప్రపంచీకరణ ఆరంభమైన తొలినాళ్లలో(1996) ఈ నవల వెలువడింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తీసుకువచ్చిన నూతన విధానాల వలన పారిశ్రామిక రంగంలో చోటుచేసుకున్న విధ్వంసకర పరిణామాలను ఈ నవల చిత్రికపట్టింది. ఎల్‌పీజీ సృష్టించిన అనేక సమస్యల్ని ఈ నవలలో చిత్రించినా ప్రధానంగా ప్రైవేటీకరణ గురించి మాత్రం సూటిగా చర్చించడం జరిగింది. ఈ నవలలో ప్రైవేటీకరణ జరిగే విధానాన్ని వివరించి ఊరుకోలేదు రచయిత. ఈ నవలలోని ఒక పాత్ర అయిన కుమార స్వామి ఉద్యోగం కోల్పోయిన తర్వాత హక్కులకోసం పోరాడే క్రమంలో కార్మిక నాయకుడవుతాడు. కంపెనీ యజమానుల దుర్మార్గాలను బయటపెట్టే పని చేపడతాడు. దాని పర్యావసానంగా కంపెనీ యజమానుల ప్రైవేటు రౌడీల చేత హత్యగావించబడతాడు. ఆ తర్వాతా కూడా కుమార స్వామి సహచరి రాధమ్మ ఆ ఉద్యమాన్ని కొనసాగిస్తుంది. వందలాది మంది కార్మిక కుటుంబాలను కూడగట్టి పోరాటం చేపడుతుంది. అంటే మొత్తంగా ఈ నవల ప్రైవేటీకరణ క్రమాన్ని ప్రభావవంతంగానే వివరించే ప్రయత్నం చేసింది.

### 8. వాణిజ్య రంగం – ప్రపంచీకరణ

పెట్టుబడిదారీ దేశాలు రూపొందించి అమలు చేసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అంతిమ లక్ష్యం ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛావాణిజ్యం చేసుకోవడమే. తాము ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రపంచంలోని అన్ని దేశాల్లో నిరాటంకంగా అమ్ముకోవడమే. అందుకోసం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తమ మార్కెట్‌ను ప్రవేశపెట్టి, దానికి అనుగుణ్యమైన సంస్కృతిని రూపొందించి, వ్యాపింపజేసి మనుషులను మానసికంగా ఆధీనం చేసుకోవడమే. దీని పర్యవసానంగా సామాజిక సంబంధాల్లో మానవీయత అడుగంటి వస్తువినిమయ సంస్కృతి ప్రబలింది. "ప్రపంచీకరణ సైద్ధాంతిక దాడి సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలపై తన ముద్రవేసి కొత్త సరుకులకు సాంస్కృతిక ఆమోదాన్ని సాధించాలని చూస్తుంది. ఇప్పుడు ఇదే ఆర్థిక వ్యవస్థ ప్రధాన వ్యాపకం అవుతోంది" (మురళి, అట్లూరి, ప్రపంచీకరణ – పదేళ్ల అనుభవాలు, పుట. 58).

ప్రపంచీకరణ పర్యవసానాలను చిత్రికపట్టిన కవిత్వంలో పసిపిల్లలకు పాలలో కలిపి ఇచ్చే బూస్ట్, హార్లిక్స్, కాంప్లాన్,

బోర్న్‌విటాలాంటి ఉత్పత్తులు, వ్రాంగ్లర్, పెపీజీన్స్, యూఎస్‌పోలో, లివీస్ వంటి వేసుకునే దుస్తులు, రీబాక్, నైక్, పూమా లాంటి పాదరక్షలు, నివియా, ఫెయిర్ అండ్ లవ్లీ, పాండ్స్ లాంటి కాస్మొటిక్స్ మొదలైన పెట్టుబడిదారీ ఉత్పత్తుల గురించి సున్నితమైన, లోతైన వ్యక్తీకరణ కనిపిస్తుంది. కానీ నవలా సాహిత్యం పరిధి దృష్ట్యా చాలా విశాలమైన కాన్వాస్ కలిగినదే అయినా అంత లోతైన, సునిశితమైన పరిశీలనా దృష్టికోణం కనిపించదు. కానీ నవలా వస్తువును వ్యక్తం చేసే క్రమంలో, ప్రస్తవనావశాత్తుగానైనా చర్చించడం మాత్రం కనిపిస్తుంది.

సుధామూర్తి రాసిన 'డాలర్ కోడలు' నవలలో 'స్వేచ్ఛా వాణిజ్యా'నికి సంబంధించిన విషయాలను చర్చించడం స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశంలోని మార్కెట్లో అందుబాటులో ఉన్న వస్తువులకంటే చాలా చవకగా, విరివిగా అమెరికాలో లభ్యమవుతున్నాయి అనే భావన కలిగి ఉన్న పాత్రల చిత్రీకరణ ఈ నవలలో కనిపిస్తుంది. అదే విధంగా భారతీయ సమాజంలో పెరిగిపోయిన వస్తువ్యామోహ విలువల సంస్కృతి గురించి కూడా పలు సందర్భాల్లో వర్ణించారు.

భార్గవీరావు 2005లో రాసిన 'తూర్పుగాలి' నవలలో కూడా స్వేచ్ఛావాణిజ్యానికి సంబంధించిన విషయాల గురించి చిత్రించారు. తెలుగులోని విభిన్నమైన సాహిత్య ప్రక్రియల్నింటిలో సృజన చేసి కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్న రచయిత్రి భార్గవీరావు. ఆమె తన పిల్లలను, బంధుమిత్రులను చూడడానికి లోగడ పదిహేను సంవత్సరాలలో పదిసార్లు అమెరికా వెళ్లిన సందర్భాలలో అక్కడ స్థిరపడిన, స్థిరపడాలనుకుంటున్న, కొన్ని రోజులు ఉండి మళ్లీ తిరిగి వద్దామనుకుంటున్న, రాలేకపోతున్న వాళ్ల జీవితాలను, కుటుంబాలను గమనించి ఈ నవల రాశారు. ప్రపంచీకరణ భూతంలా ప్రపంచాన్ని కుదిపేయడం అంటే, దేశీయ మార్కెట్లను ఆక్రమించుకున్న సామ్రాజ్యవాద దేశాలు ఉత్పత్తి చేసిన వస్తువుల వినియోగం, వాటి వినియోగాన్ని పెంచే వ్యాపార సంస్కృతి, విలువల భావజాల వ్యాప్తి మొదలైనవన్నీ అని అర్థం చేసుకోవాలి.

కాలువ మల్లయ్య రాసిన 'బతుకు పుస్తకం' నవలలో కూడా 'స్వేచ్ఛావాణిజ్య' పర్యవసానాల చిత్రణ కనబడుతుంది. "నూతన మార్పుల్లో భాగంగా ఊర్లో ప్లాస్టిక్, రెడీమేడ్ దుస్తుల వాడకం మొదలవుతుంది. కులవృత్తులు విచ్ఛిన్నం కావడం మొదలవుతుంది" (మల్లయ్య, కాలువ మల్లయ్య, బతుకు పుస్తకం, పుట. 46). ఇంట్లో వాడుకునే ఉప్పు, కారం, పసుపు, పప్పుదినుసులు, వంట నూనెలు, వంట పాత్రలు, వాటిని శుభ్రం చేసే సబ్బులు మొదలు ఆఖరికి కూరగాయలు కోసే కత్తుల నుండి, వేడిపాత్రలను పట్టుకోవడానికి ఉపయోగించే మసిగుడ్డల దాకా, కాళ్లకు వేసుకునే చెప్పులు మొదలు, దాహం తీర్చే నీళ్లదాకా అన్నింటినీ బడా పెట్టుబడిదారుల కంపెనీ వస్తువులే దురాక్రమించాయి. ఈరోజు భారతీయ సమాజంలోని పూరిగుడిసె దగ్గరి నుండి సంపన్నవంతుల విల్లాలదాకా పరిశీలిస్తే, కనీసం కొన్ని వస్తువుల నుండి దాదాపు అన్ని వస్తువులదాకా బహుళజాతి కంపెనీల వస్తువులే కనిపిస్తాయి. ఇంకాస్త లోతుకు వెళితే తల్లిపాలకంటే కూడా బహుళజాతి కంపెనీలు ప్యాకెట్లలో అందించే పాలే శ్రేష్ఠమైనవి అనేదాకా సామ్రాజ్యవాద విషసంస్కృతి వ్యాపించింది.

## 9. ముగింపు

స్థూలంగా చూసినప్పుడు, ప్రపంచీకరణను చిత్రిక పట్టిన ఏడు తెలుగు నవలల్లో కొన్ని కౌటుంబిక సంబంధాల్లో వచ్చిన మార్పు, వస్తు వినిమయ సంస్కృతులను చిత్రిక పడితే, మరికొన్ని విద్యా, ఉపాధి రంగాల్లో వచ్చిన మార్పులను చిత్రించాయి. మరికొన్ని నవలలు పైన పేర్కొన విషయాలతోపాటు వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో చోటుచేసుకున్న పర్యవసానాలను వ్యక్తం చేశాయి. డాలర్ కోడలు, తూర్పుగాలి వంటి నవలల్లో కేవలం కౌటుంబిక సంబాధాల మీదనే దృష్టి కేంద్రీకరించాయి. కానీ మిగతా నవలలు వీటితోపాటు మిగతా రంగాలను కూడా తన పరిధిలోకి తీసుకున్నాయి. ఒక్క వాణిజ్య రంగంలో వచ్చిన మార్పులను మాత్రమే తెలుగు నవల సంపూర్ణంగా చిత్రించలేకపోయిందని చెప్పాలి.

ప్రపంచీకరణ వచ్చి రెండు దశాబ్దాలు దాటింది. దాని పర్యవసానాలు భారతీయ గ్రామాన్ని కుదేలుచేసుకుంటూనే వెళుతోంది. ప్రపంచీకరణ ప్రారంభమైన రోజుల్లో వచ్చినంత దాని వ్యతిరేక సాహిత్యం ఇటీవలి కాలంలో సన్నగిల్లింది. దీనికి కారణం ఆ తరువాత ఏర్పడిన సామాజిక సన్నివేశాలు, వైరుధ్యాలు కావొచ్చు. కానీ వర్తమాన కాలంలో కనిపిస్తున్న అనేక ప్రజాభివృద్ధి వ్యతిరేక కార్యకలాపాల వెనుక నిస్సందేహంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణే ఉన్నది. వర్తమాన సామాజిక సమస్యలతోపాటు, దాని వెనుక ఉన్న సామ్రాజ్యవాద దేశాల కుటిల పన్నాగాలను సాహితీవేత్తలు అర్థం చేసుకున్నప్పుడే, సామాజిక సాహిత్య లక్ష్యం నెరవేరి, ప్రజాచైతన్యం కోసమే సాహిత్యం పనిచేస్తుందన్న ఆధునిక భావన సంపూర్ణం కాగలదు.

## 10. ఉపయుక్త గ్రంథసూచి

1. కాశీం, చింతకింది. ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదుకు సమర్పించిన పీహెచ్.డీ. సిద్ధాంత గ్రంథం. డిసెంబర్ 2008. హైదరాబాదు.
2. చౌదరి,కె.ఆర్. వ్యవసాయం – ప్రపంచీకరణ. ప్రథమ ముద్రణ. వీక్షణం పబ్లికేషన్స్. నవంబర్ 2011. హైదరాబాద్.
3. ఫణిక్కర్, కె.ఎన్. సాంస్కృతిక కాలుష్యం. ప్రథమ ముద్రణ. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణలు. 2004. హైదరాబాద్.
4. మురళి, అట్లూరి(సంపా). ప్రపంచీకరణ పదేళ్ళ అనుభవాలు. ప్రథమ ముద్రణ. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురణ. జనవరి 2003. హైదరాబాద్.
5. వెంకట్రామయ్య, వేములపల్లి. ప్రపంచబ్యాంకు విషవలయంలో ఆంధ్రప్రదేశ్. ప్రథమ ముద్రణ. సి.పి.ఐ(ఎం.ఎల్) – న్యూ డెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ ప్రచురణ. ఫిబ్రవరి 2003. హైదరాబాద్.
6. వేణుగోపాల్, ఎన్. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్. ద్వితీయ ముద్రణ. విశ్లేషణ ప్రచురణలు. డిసెంబర్ 1999. హైదరాబాద్.

T

# తెలంగాణ ధూంధాంలో కవులు, గాయకుల పాత్ర

డా. సుజాత ఆజ్మీరా

**పరిచయం:**

తెలంగాణ ధూం ధాం తొలి ప్రదర్శన 2002 సెప్టెంబర్ 30న, కామారెడ్డిలో జరిగింది. ఈ సభకు సుమారు 50వేల మంది హాజరయ్యారు. ఆ తర్వాత ధూం ధాంను హైదరాబాద్లోని 'తెలుగు లలిత కళాతోరణం' ఓపెనెయిర్ ఆడిటోరియం (పబ్లిక్ గార్డెన్)లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో గద్దర్ సహా తెలంగాణ కళాకారులు, గాయకులంతా పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులంతా వేదిక పైన కాకుండా సభలో కూర్చోవడం విశేషం. ప్రారంభంలో రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజులు, కేసీఆర్ మార్గదర్శకత్వంలో 'తెలంగాణ ధూం ధాం' ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో ఇదొక కళాకారుల, ఉద్యమకారుల సమిష్టి కృషిగా కొనసాగింది. ప్రఖ్యాత తెలంగాణ కవి గూడ అంజయ్య ధూం ధాం గురించి ఇలా వ్యాఖ్యానించారు. ''తెలంగాణ ధూం ధాం' రూపకల్పనతోపాటు సభా నిర్వహణను భుజాలపై వేసుకున్న రసమయి బాలకిషన్ ఒక కొత్త కెరటం. ఒక కొత్త నాయకత్వం. తెలంగాణ కళాకారులందరిని ఒకే వేదికమీదికి తెచ్చిన రసమయి బాలకిషన్ కృషి చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 'తెలంగాణ ధూం ధాం' అనేది ఒక సమిష్టి కృషి. ప్రజా యుద్ధనౌక, వాగ్గేయకారుడు గద్దర్ మొదలుకొని ఎందరో కళాకారుల చెమటచుక్కల, ఆలోచనల ఫలితమిది. 'ఊరు మనదిరా గూడ' అంజన్న, 'పల్లె కన్నీరు' గోరటి వెంకన్న, 'చూడచక్కని తల్లి' అందెశ్రీ, 'వందనాలమ్మ' జయరాజు, 'నీ ఆరు గుర్రాలు'– వరంగల్ శంకరన్న, 'తయందత్కె' – వరంగల్ శ్రీను, 'నేలమ్మ' – రచ్చభారతి, 'ఏవీ మన పల్లెల్లోన' – రసమయి బాలకిషన్, 'శాంతికవిత' – నేర్నాల కిషోర్, రమాదేవి, చీకోటి కృష్ణ, ఎ.నాగరాజు బృందం, ఆకునూరి దేవన్న, గర్జన, దయా నర్సింగ్, బిక్షపతి, అశ్విని, అంతడుపులు జంగిరెడ్డి, స్వర్ణరెడ్డి, ఆడదాం డప్పుల దరువెయ్యిరా అన్న ఉద్యమాల గాయని – విమలక్క, సంతోష్ ఇలా ఒక్కరేమిటి ఎందరో కళాకారులతో తెలంగాణ ధూంధాం సంపూర్ణతను సాధించింది. అరుణోదయ, ప్రజా కళామండలి, గుస్సాడి, గోండు నృత్యాలు, లంబాడి ఆట పాటలు, పీర్లపండుగ, దూల ఆటలు, కోలాటాలు ఒకటేమిటి ఎన్నో కళారూపాలతో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం నిరంతరం తెలంగాణ ప్రజలను చైతన్యం పరుస్తున్నారు".

తెలంగాణ ప్రాంతంలో ఉప్పొంగిన సృజన మరెక్కడా కనపించదు. సృజనాత్మక విషయంలో తెలుగు సాహిత్యంలో నూతన ప్రక్రియల ఆవిష్కరణలో తెలంగాణదే ప్రథమ స్థానం. తెలుగు గడ్డపై తొలిసారి అక్షరాలను కూర్చిన గుణాఢ్యుడు తన 'బృహత్కథ' గొప్ప గ్రంథం. బసవపురాణం, రంగనాథ రామాయణం, మార్కండేయ పురాణం మొదల్కైన ప్రక్రియలకు పుట్టినిల్లు తెలంగాణాయే. అప్పటి నుండి ఇక్కడ అజరామరమైన సాహిత్య సంపద ఉద్భవిస్తూనే ఉంది.

తెలంగాణలో విస్తృతమైన సాహిత్యం వెలువడి ఎంతో మంది కవులు వెలుగు లోనికి వచ్చారు. తెలంగాణ ఘనమైన ప్రాచీన వారసత్వ సంపదను కలిగి వుంది. తెలంగాణ వైభవానికి ఆ వారసత్వ చరిత్రను చాటిచెప్పే నిదర్శనాలెన్నో ఇక్కడ కనిపిస్తున్నాయి. శాతవాహనులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, కుతుబ్షాహీలు మొదలగు అనేక రాజవంశాలవారు పరిపాలించారు.

భారతదేశానికి వన్నె తెచ్చిన పుణ్యభూమి తెలంగాణ రాష్ట్రం. ఈ ప్రాంతం భౌగోళికంగా సుసంపన్నమైన ప్రాంతం. సహజ సంపద, వనరులు ఉన్న ప్రదేశం కావటంవల్ల స్థానికంగా ఎంతో గొప్ప చరిత్ర నాగరికత, సంస్కృతి వికసించాయి. తెలంగాణ 'పలుకు తేనె చినుకులా ఉంటుంది. పదము పదములో ఒక అందం, మాట మాటల చిక్కని బంధం అడుగడుగునా కనిపిస్తాయి. పాల్కురికి సోమనాథుని నుండి ప్రారంభమైన సాహితీ స్రవంతి తరువాతకాలంలో 'ద్విపద, పురాణ వ్మాయం, శతకం, పదకవిత్వం, యక్షగానం' వంటి ప్రక్రియలను తెలుగు సాహిత్యానికి అందించారు. తెలంగాణ నేలలో సిరులు పండించారు. తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంతంలోని కళాకారులు, కవులు, గాయకులు, రచయితలు, మేధావులు, తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ ధూం ధాం నిర్వాహకులు, ప్రజాగాయకులు గద్దర్, విమలక్క, గోరటి వెంకన్న, అందెశ్రీ, రసమయి బాలకిషన్, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, వరంగల్ శ్రీనివాస్, అంతడుపుల నాగరాజు

మొదలైనవారంతా తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమాన్ని నడిపించారు. వందల యేళ్ళ నుండి ఈ ప్రాంతంలోని అణగారిన కులాలలోని అనేక ఉప కులాలకు (ఉదా: బాలసంతోళ్ళు, బుడిగజంగాలు మందహెచ్చులోళ్ళు, ఒగ్గువారు) చెందిన జానపద కళారూపాలు ఇప్పటిదాకా తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ అవసరాలకు తగినట్లుగా మలచుకొని ప్రజల వద్దకు ఆట-పాట ద్వారా తీసికెళ్ళారు. ఈ కళాకారుల ధూం ధాం వంటి ప్రదర్శనలు, పాటలు ఈ తరం తెలంగాణ యువకులకు, విద్యార్థులకు వెనుకటి తెలంగాణ పల్లెలు, జనజీవనం, కట్టుబాట్లు, సాంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు ఏ విధంగా ఉండేవో తెలిపాయి.

### తెలంగాణ ధూం ధాం నేపథ్యం:

తెలంగాణ రాష్ట్ర సమితి సాంస్కృతిక విభాగం బాధ్యతలను పర్యవేక్షించిన జానపద గాయకుడు, ప్రజాకళాకారుడు రసమయి బాలకిషన్ 2001లో ఒకరోజు అంతడుపుల నాగరాజు ఆహ్వానంపై శ్రీరాంపూర్లో ఆయన నిర్వహిస్తున్న 'జానపద జాతర' సాంస్కృతిక ప్రదర్శనను చూసారు. బొడ్రాయి, బతుకమ్మ, పేరీలు, హరిదాసులు, పాములోళ్ళు మొదలైన తెలంగాణ కళారూపాలన్నీ ఒకటెనుక ఒకటి వేదిక మీదికి వచ్చి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయి. పల్లెకు దూరమైన పట్టణ జనానికి, పల్లె జీవితాన్ని కళ్ళెదుట నిలిపి, ఈ ప్రాంత సంస్కృతిపై ఒక అవగాహనను కల్పించే విధంగా ఈ కళారూపాలను అంతడుపుల నాగరాజు రూపొందించాడు. ఇతర కళాకారులతో కలిసి స్వయంగా అనేక ప్రదర్శనలిచ్చారు. మందమర్రి (ఆదిలాబాద్)లో మొదలై తెలంగాణవ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చారు ఈ కళాకారులు.

రసమయి బాలకిషన్ దృష్టిని 'జానపద జాతర' ఆకర్షించడంతో తన "నేలమ్మ" పాటల క్యాసెట్ ఆవిష్కరణ సభ (రవీంద్రభారతిలో జరిగింది)కు అంతడుపుల నాగరాజు బృందాన్ని ఆహ్వానించి 'జానపద జాతర' ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను ఆహ్వానించడంతో 'జానపద జాతర' కేసీఆర్ దృష్టిలోనూ పడింది. ఆ తర్వాత ఒకరోజు కేసీఆర్ రసమయిని, నాగరాజును పిలిచి తెలంగాణ భావజాల వ్యాప్తికోసం ఉపయోగపడగల కళారూపాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ ముగ్గురి ఆలోచనల పర్యవసానంగా 'తెలంగాణ ధూం ధాం' రూపుదిద్దుకున్నది. అంతడుపుల నాగరాజు రూపొందించిన 'జానపద జాతర'లో అంతా సహజమైన జానపదమే ఉండేది. అయితే రసమయి బాలకిషన్ దాన్ని వివిధ ఉద్యమ పాటలతో, పాటగాళ్ళతో, కవులతో మిళితంచేసి జానపద జాతరను ఉద్యమ అవసరాలకు తగినట్లు అద్భుతమైన కార్యక్రమంగా రూపొందించాడు. తెలంగాణవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు నిర్వహించారు. రసమయి బాలకిషన్ వ్యాఖ్యానం, పాటలతో నాగరాజు బృందం, ఇతర కళాకారుల ఆటలతో తెలంగాణలో లక్షలాది ప్రజలను 'ధూం ధాం' ఎంతో ఉత్తేజితులను చేసింది.

బి.ఎస్.రాములు రాసిన "తెలంగాణ రాష్ట్రం-నడుస్తున్న చరిత్ర" పుస్తకంలో "తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో తెలంగాణ ధూం... ధాం.. పాత్ర" అని గూడ అంజయ్య రాసిన వ్యాసం విలువైనది. కరీంనగర్ ఉప ఎన్నిక సందర్భంగా కరీంనగర్ 'ధూం ధాం'లో గద్దర్ ఆటా-పాటా జరిగింది. 2006 అక్టోబర్ 14న, సాయంత్రం కరీంనగర్ పట్టణంలో తెలంగాణ 'ధూం ధాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఎం.పిగా పోటీచేస్తున్న సందర్భంగా ఈ ధూం ధాం కార్యక్రమం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణను సాధించుకోవడానికి పోరాడాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్రజాగాయకుడు గద్దర్, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, జయరాజ్, బి.ఎస్. రాములు, అందెశ్రీ, ఒగ్గుకథ కళాకారుడు మిద్దె రాములు, తెలంగాణ మార్గదర్శి ప్రొ.జయశంకర్, హరీష్ రావు, ఈటెల రాజేందర్‌తో సహ పలువురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ సభలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమం సందర్భంలో ఇలాంటి తెలంగాణ 'ధూం ధాం' ప్రదర్శనలు, తెలంగాణ కళాకారులు, కవులు, గాయకులు, రచయితలు నిర్వహించిన పాత్ర చరిత్రలో ఎప్పటికీ నిలిచివుంటుంది.

పట్టణం నుండి అమాంతం కళ్ళకు గంతలు కట్టి తీసుకెళ్ళిన పచ్చని పంటపొలాలలో అలలారే పల్లెటూరిలో వదిలేసి కళ్లకు గంతలు విప్పితే ఎలాంటి ఆహ్లాదకరమైన అనుభూతికి కలుగుతుందో అచ్చం అలాగే ధూంధాం వేదికను చూస్తే కళ్ళు చెమ్మగిల్లుతాయి. స్వతహాగా ఆర్టిస్ట్ అయిన చింతస్వామి వేదికపై చక్కని లైటింగ్స్‌తో పాటు ఆర్ట్‌వర్క్‌చేసి ఒక గుడిసెను, నులక మంచం, బొడ్డురాయి, మంచెన ఇసురేతు, రోలు, రోకలి, నాగలి, ఎడ్లబండి చక్రం, ఇలా పల్లె జీవితం ఉట్టిపడేలా వేదికను అలంకరించేవారు. తొలుత కార్యక్రమ నిర్వహణకు సహకరించిన వ్యక్తిని లేదా విశిష్టమైన వ్యక్తిచే బొడ్డురాయికి కొబ్బరికాయ కొట్టి, భోనం వెలిగించి, కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

ధూంధాం జరిగే విధానం ఒక నిర్మాణాత్మకంగా ఉండేది. మొదటగా అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను, అలాగే గద్దర్ రచించిన 'అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా' అనే గీతాల్ని ప్రారంభ గీతాలుగా ఆలపిస్తారు. సమన్వయకర్త అయిన రసమయి బాలకిషన్, నృత్య దర్శకులు అంతడుపుల నాగరాజు బృందం, వచ్చిన కవిగాయకులు అందరూ సమూహ గీతంగా పాడుతారు. అనంతరం స్థానికంగా ఉన్న కళాకారులచే (ఏ జిల్లా అయితే అ జిల్లా) ప్రదర్శన ఉంటుంది. అనంతరం మిద్దెరాములు గారిచ్చె బోనం ప్రదర్శన ఉంటుంది. తర్వాత ఒగ్గుకథ ప్రదర్శన ఉంటుంది. అనంతరం శారియిపేటకు చెందిన ఐలయ్య బృందం 20మందితో డప్పు విన్యాసం ప్రదర్శన ఉంటుంది. అలాగే భువనగిరికి చెందిన రమేష్ బృందంచే ఒగ్గుడీలు(20 మంది) విన్యాసాలు ఉంటాయి. అలాగే సిద్ధిపేటకు చెందిన చిరంజీవి బృందం 10మందిచే సిందు యక్షగానం ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శన మధ్యమధ్యలో స్థానిక గాయకులు, పాటల ప్రదర్శనతో ధూంధాం వేదికకు నిండుదనం వచ్చేది. అప్పుడు నందిని సిధారెడ్డి రచించిన 'నాగేటి సాలల్ల నా తెలంగాణ నా తెలంగాణ' అనే పాటను దేశపతి శ్రీనివాస్ పాడేవాడు. ఈ పాటతో మొదలు అనేక పాటలను వాటి యొక్క అర్థాన్ని చెబుతూ మాటలను జోడిస్తూ తెలంగాణ పరిస్థితిని వివరించేవారు.

అదే క్రమంలో అందెశ్రీ రాసిన, రమణ అలపించిన ఆర్.నారాయణమూర్తి దర్శకత్వంలో రూపొందిన ఊరు మనదిరా ! చిత్రంలోని "సుడసక్కనితల్లి సుక్కల్లో జాబిల్లి" అనే పాటను అంతడుపుల నాగరాజు బృందం సుమారు 40మంది కళాకారులతో ప్రదర్శించేది. సబ్బండ వర్గాలను వారి కులవృత్తులను తెలియజేస్తూ, తెలంగాణ పల్లె జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ప్రదర్శించే నృత్యంతో ఒక్కసారిగా వేదిక ప్రాంగణమంతా నిశ్శబ్దం అలుముకుని ఆలోచనలోకి తీసుకెళ్ళింది. ఐదునిముషాల వ్యవధి కలిగిన ఆ నృత్య ప్రదర్శన ముగింపుగా అందరూ కులవృత్తుల వేషధారణ కలిగినవారందరూ శిల్పంలా వేదికపై నిలిచేవారు. ఇలా వారి కులవృత్తుల జీవన విధానాన్ని చాటిచెప్పటం అప్పటి పరిస్థితి. సమైఖ్య రాష్ట్రంలోని ఇప్పటి పరిస్థితిని వివరిస్తూ, వక్తలు ఉపన్యసించేవారు. కొనసాగింపుగా ఆయా కులవృత్తులు పరిస్థితిని చెబుతూ గోరెటి వెంకటన్న రాసిన "పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' అనే పాటతో ధూంధాం మరింత పదునెక్కేది. ఆయా కులవృత్తులు ప్రస్తుత జీవన పరిస్థితి, జరుగుతున్న విధ్వంసాన్ని కళ్ళకు కట్టినట్టు వివరిస్తూ, తెలంగాణ ఆకాంక్షను చాటి చెప్పేది ధూంధాం వేదిక. అనంతరం గూడ అంజయ్య రాసిన అనేక పాటలను ఆయనచే పాడించేవారు. కరీంనగర్ తేలు విజయచే చివరగా "అయ్యోనివా నువు అవ్వోనివా, తెలంగాణనికే తోటి పాలోనివా? అనే పాటతో స్వరాష్ట్ర ఆవశ్యకతను వివరించే వేదిక ధూంధాం. అమర్ (మిత్ర) రాసిన పాటల్ని అరుణోదయ విమలక్క పాడేవి. నిర్మల బృందం 'అడుదాం-దప్పుళ్ల దరువేయరా-పల్లె తెలంగాణ పాటపాడరా ! అనే నృత్యంతో తెలంగాణ కాంక్షను, వెలుగెత్తారు. అనంతరం కొత్తగూడెంకు చెందిన ప్రజాకవి జయరాజ్ వానలు లేక, నీరులేక వలస బతుకులు తీరుపై రాసిన 'వానమ్మ వానమ్మా, పాట మరో మైలురాయి. 'సేతాన మేదుందిరా తెలంగాణ సేలన్నీ బీళ్లాయెరా', "తలాపున పారుతుంది గోదారి మన సేను మన సెలుక ఎడారి", 'పల్లె పల్లెన పల్లేరు మొలిసే తెలంగాణలోనా' అనే పాట, తదితర పాటల్ని పాలమూరు జంగారెడ్డి తదితరులు ఆలపించగా, తెలంగాణ విధ్వంసం కళ్ళకు కట్టినట్లు స్పష్టమయేది.

అనంతరం ఈ విధ్వంసం వలన ఉన్న ఊరిని కన్నవారిని వదిలి, బొంబాయి, భీవండీ ప్రాంతాలకు వలస వెళ్ళిన బతుకులను కళ్ళకు కట్టినట్లు పయిలం సంతోష్, పుష్ప, స్నేహలు అభినయిస్తూ కోదాడ శ్రీను రచించిన "ఉండు పయిలంగుండు అమ్మా మాయమ్మ" అనే పాటతో కన్నీళ్ళు పెట్టించేవారు. వరంగల్ శ్రీనివాస్ రాసిన, కులవృత్తుల పాట రసమయి బాలకిషన్ వాక్కులతో మళ్ళీ పల్లెను యాదిచేసేది. అలాంటి పల్లెల్లో పండుగలు, పబ్బాలు తెలంగాణ ప్రాంతం, ఆంధ్రలో విలీనం కాకముందు ఎలా ఉండేదో "తానడిలా తల్లడిల్లే ఏలో మన పల్లెలోన' అంటూ 30నిముషాల నృత్య రూపకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారేవారు. 60మంది కళాకారులు.

నాంచర్ల గోపి, గోరేటివెంకన్న, నిస్సార్, సుద్దాల అశోక్‌తేజల రచనలతో అనేక సేకరణ పాల్లెపాటలతో రూపొందించిన ఈ పాటను రసమయి బాలకిషన్ పాడుతూ నర్తిస్తూ వివరించేవాడు. 60 మంది కళాకారులతో కూడిన అంతడుపుల నాగరాజు బృందం కళ్ళమందు, నిద్రలేచిన పల్లెలో బాలసంతులను, కోడికూతలను, అలుకు పూతలను, బోనాల పండుగ, శివసత్తులు, కోలాటం ఆటలు, బొంగరాలాట, గోలిలాట, సిగ్రగోనే, ఫకిరుసాబు, తుపాకీ రాముడు%-% గంగిరెద్దులు, సిందుబాగోతాలు, ఒగ్గుకథ, బతుకమ్మ పండుగ, సంక్రాంతి పండుగ, పీరిల పండుగ, హొూళి పండుగ గంగిరెద్దులాట ఇలా ఒక్కటేమిటి దాదాపు తెలంగాణలో అన్ని పండుగ పబ్బాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, చిన్ననాటి ఆటలు పాటలు ఇలా ఏదీ మిస్సవ్వకుండా కళ్ళముందు కలర్‌ఫుల్‌గా ఆవిష్కరించబడేవి. ఆలాంటి నిండ్కైన పల్లె మళ్ళీ పూవై నవ్వాలంటే మనరాష్ట్రం మనకు కావాలి అంటూ సందేశాన్ని ఇచ్చే పాటతో చ్కెతన్యం రగిలించినారు. 60 ఏండ్ల

ఆకాంక్షను, తెలియజెబుతూ ప్రజాకళా మండలి కోఠి బృందం, నందిని సిధారెడ్డి రాసిన "జోహార్లు జోహార్లు అనేపాటతో దరువు ఎల్లన్న రాసిన 'వీరులార వందనం' అనే పాటతో అమరుల త్యాగాన్ని అభివర్ణిస్తూ పలువురు కళాకారులు, ధూంధాం వేదికపై గొంతెత్తేవారు.

అలాగే మిత్ర రాసిన "ఛలో ధూంధాం", 'అసైదులా హారతి కాళ్ళ గజ్జెల గమ్మతి' అనే పాటలతో సభ మార్మోగేది. కోదారి శ్రీను రచించిన పాటను, సుధ రాసిన 'జంగన సైరాన్ ఊరుదే' అనే పాటలో ప్రజల్లో నూతన ఉత్తేజం కలిగేది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావాలంటే చిన్నాచితకా అందరూ ఉద్యమానికి అండగా ఉండాలంటూ నేర్నాల కిషోర్, రచన గానంతో 'పొడిసేటి పొద్దేలే ఏలామందా" అంటూ చిన్న పిల్లగాళ్లను కూడా ఉద్యమానికి ఎలా ఊతమివ్వాలో పాటలో ప్రేరేపించారు. "నావ సాగుతుంది కొడుకా " తాను రచించిన గీతాన్ని ఏవూరి సోమన్న ఆలపించారు. మలి దశ ఉద్యమంలో చనిపోయిన విద్యార్థులను స్మరిస్తూ మిట్టపల్లి సురేందర్ రాసిన, "రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా రక్తబంధం విలువ నీకు తెలియదురా" అనే పాటతో సాయిచందు, కొమ్మామీద కోయిలమ్మ పాటపాడుతున్నది అంటూ తన రచన గానంతో గిద్దెరాం నర్సయ్య ధూంధాం వేదికపై గొంతెత్తి పాడేవారు.

తెలంగాణ కవి గాయకుల ప్రశస్తిని గుర్తుచేస్తూ, 'పాటమ్మా నీకు ప్రాణమైతు' అంటూ బిక్షపతి, గిరిజనులను కదిలిరావాలనీ లంబాడీ బాషలో భిక్షునాయక్ ఇలా అనేక ఉత్తేజమైన గీతాలతో జంగ్ ప్రహ్లాద్, గర్జన, స్వర్ణ, దయానర్సింగ్, కొప్పుల రాజనర్సు, బాబ్జీ, వోల్గల వాణి, స్నేహ, దరువు అంజన్న, తీన్మార్ రవి రేలారే గంగా, మారంపల్లి రవీందర్ తదితరులు గళమెత్తి గర్జించేవారు. వీరి పాటలకు మాట కలుపుతూ తెలంగాణ కాంక్షను జర్నలిస్ట్ నాయకులు, మేధావులు, ప్రొ.జయశంకర్, ప్రొ.కోదండరామ్, అల్లం నారాయణ, జూలూరి గౌరిశంకర్, పాశం యాదగిరి, ఘంటా చక్రపాని, పల్లె రవికుమార్, ప్రొ.కాశీం తదితరులు తెలంగాణ వాదాన్ని నరనరాన ధూంధాం వేదికపైనుంచి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు.

హైదరాబాద్ ధూంధాం వేదికపైనుంచి "నేను జిల్లాలోకి ప్రజల్లోకి రాజకీయాలకు అతీతంగా వస్తాను, ధూంధాం చేస్తాను" అని గద్దర్ ప్రకటించాడు. గడ్డం అరవింద్‌రెడ్డి అనే టీఆర్ఎస్ నాయకుడు తమ సింగరేణి ప్రాంతంలో ధూంధాం చేయమని కోరగా, అందుకు ధూంధాం టీం అంగీకరించింది. కారణం ధూంధాంలో నృత్యరీతులు ప్రదర్శించే వారందరూ సింగరేణి బిడ్డలే కావడం కూడా కారణం. అప్పుడు శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియంలో ధూంధాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గద్దర్, వంగపండు ప్రసాద్, జయరాజ్, శ్రీనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పోలీస్ డేగ కళ్ళమధ్య బహిర్గతపరచలేని నిర్బంధం మధ్య సింగరేణి గని కార్మికుల్లో తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని రగల్చింది. తెలంగాణ ధూంధాం.

క్రమక్రమంగా తెలంగాణ ఉద్యమ అకాంక్ష ప్రజల్లో పెరుగింది. అన్ని పార్టీలు మెల్లమెల్లగా తెలంగాణ నినాదాన్ని అనుసరిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యమని ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు పదువులను అలంకరించి ప్రజాపోరును తగ్గించారనే భావన ప్రజల్లో బలపడసాగింది. టీఆర్ఎస్‌పై విశ్వాసం సన్నగిల్లుతుందనే విమర్శను తిప్పికొట్టి బలమైన తెలంగాణ నినాదాన్ని మరింత పెంపోందించే దిశగా ఎన్నికల్లో తెలంగాణ అకాంక్ష యొక్క బలం అమాంతంగా ఆవిష్కృతమైంది. ముఖ్యవిషయం ఏమిటంటే, రాష్ట్ర ఇంటలిజెన్స్ ఇచ్చిన నివేదిక యొక్క ముఖ్య సమాచారం, ధూంధాం వల్లే భారీ మెజారీటీతో టీఆర్ఎస్ ఘన విజం సాధించింది అనేది గొప్ప విషయం. ఈ విషయాన్ని ఈనాడు దినపత్రిలో ధూంధాం జరిగిన మండలాల వారీగా వచ్చిన ఓట్లను, జరగని చోట వచ్చిన ఓట్లను విడివిడిగా ప్రచురించి ఆటాపాటనూ అభినందిస్తూ, ఆర్టికల్ అచ్చువేయడం అభినందనీయం. ఇలా ధూంధాం... ఇటు రాజకీయంగా ప్రజా ఉద్యమంగా ఏవరైనా, ఏ పార్టీ అయినా, ఎవరి సిద్ధాంతం వారికున్నా తెలంగాణ ఆకాంక్షను తెలియజేసేది. కళాకారులు మారినా, కళారూపం మాత్రం అదే, సాహిత్యం అదే ఇలా ధూంధాం ప్రస్థానం కొనసాగింది. ధూంధాం అనే కళారూపాల ద్వారా అనేక అంశాలు ఈ పరిశోధన ద్వారా వెలుగులోనికి వచ్చాయి. తెలంగాణలో ధూంధాం ప్రదర్శనలు ప్రజలను చైతన్యవంతం చేశాయి. తెలంగాణ ఉద్యమ పోరాటానికి ఒక ఒరవడిని ఏర్పరచినాయని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

ఆధార గ్రంథాలు:


1. ఎల్లన్న, దరువు. వీరులారా... వందనం, తెలంగాణ ఉద్యమగీతాలు. దరువు ప్రచురణలు, 2009, హైదరాబాద్

2. ప్రజా కళా మండలి పాటలు 2014, ప్రజా కళామండలి ప్రచురణ, గుంటూరు

3. ప్రజా యుద్ధ పాటకు చావులేదు-కూర్పు-సత్యం గద్దర్‌పై దాడిని ఖండిస్తూ వచ్చిన స్పందన-ప్రతి స్పందనలు, జనం పాట ప్రచురణలు 1999, సికింద్రబాద్

4. శబ్ధం ప్రజా సాంస్కృతికోద్యమ ప్రతిధ్వని త్రైమాసిక పత్రిక, ఏప్రిల్, జూన్ 2015, ప్రజా కళామండలి ప్రచురణ.



**రచయిత:** అసిస్టెంట్ ప్రొఫెసర్

గవర్నమెంట్ సిటీకాలేజ్ (A), హైదరాబాద్

విమర్శ

# ప్రజల మనిషి నవల-ప్రాసంగికత

డా.ఇమ్మిడి మహేందర్

ఒక కాలం నాటి సామాజిక అవసరాల్లోంచి పుట్టిన రచన నేటికి ప్రాసంగికంగా ఉన్నదంటే సమాజంలో అభివృద్ధి, మార్పు ఆశించినంత ప్రగతిశీలంగా లేదనేది స్పష్టం. ఈ కోణం నుంచి చూసినప్పుడు 'ప్రజల మనిషి' నవల ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. 'ప్రజల మనిషి' నవలా రచయిత వట్టికోట ఆళ్వారు స్వామి. ఈయన తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వికాసాల్లో ప్రముఖ పాత్ర పోషించిన ఉద్యమకారుడు. తన సమకాలీనులెవ్వరూ ప్రవేశించడానికి కూడా సాహసించని రంగాలను ఎంచుకొని, తనకంటూ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్న తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి. రాశిలో తక్కువైనా వాసిలో మెండుగా రచనలు చేసాడు. ఈయన రచనలు తెలంగాణ ప్రజల జీవితాలకు అద్దంలో చూపెట్టాయి. సాధారణంగా రచయితలు తమ కళ్లెదుట జరిగిన దాన్ని చూడటం, లేదా ఇతరులు చెప్పడం ద్వారా జీవితాలను చిత్రించే ప్రయత్నం చేస్తారు. కానీ, వట్టికోట ఆళ్వారు స్వామి స్వానుభవంతో రచనలు చేసారు. తెలంగాణను నిండుగా ఆవాహన చేసుకొని, తెలంగాణ సమాజమే మాట్లాడినట్లుగా, బాధలను వ్యక్తం చేసినట్లుగా సాహిత్యాన్ని వెలువరించడం వట్టికోట ఆళ్వారు స్వామి సాధించిన విజయం.

ఆంధ్ర మహాసభ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంగా 1930ల నుంచి 1950 వరకు తెలంగాణ జీవితాన్ని మూడు నవలల్లో చిత్రించాలని ఆళ్వారుస్వామి ప్రణాళిక వేసుకున్నాడు. ఆ ప్రణాళికలో భాగంగా 1938 పూర్వపు భాగానికి సంబంధించి రాసిన తొలి నవల 'ప్రజలమనిషి'. ఈ విధంగా ప్రజల మనిషి నవలలోని వస్తువు 1930ల కాలం నాటిది. ఈ నవలను 1950లో రాయడం మొదలు పెట్టి 1955లో పూర్తి చేశాడు. ఇందులో వట్టికోట ఆళ్వారు స్వామి జీవితం, ఆనాటి ఉద్యమ పరిస్థితులు కన్పిస్తాయి. ఏ రచన కూడా శూన్యంలోంచి ఉదయించదు అనేది ఒక అవగాహన. దీనికి సామాజికార్థిక, రాజకీయ పరిణామాలు ఆలంబనగా నిలుస్తాయి. ఈ పరిణామాల్లోంచే రచయిత రూపొందుతాడు. ప్రతీ రచయితపై స్థల, కాల ప్రభావాలు ఉంటాయి. సామాజిక అవసరాల్లోంచే రచయితలు రూపొందుతారు. మరో మాటలో చెప్పాలంటే కాలం కడుపుతో ఉండి తన వ్యాఖ్యాతలను తయారు చేసుకుంటుంది. రచయితలు చేసే గొప్ప పని ఏమంటే వ్యక్తిగత జ్ఞానాన్ని సామూహిక జ్ఞానం వైపు మళ్లించి, కల్లోల కాలానికి ప్రతినిధులుగా నిలవడం. ఈ దృష్టి నుంచి ప్రజల మనిషి నవలను అధ్యయనం చేయవచ్చు.

వట్టికోట ఆళ్వారు స్వామిని తెలంగాణ వైతాళికుడిగా అందరూ గుర్తిస్తారు. "వర్తమాన తరాన్ని ప్రభావితం చేయడంతో పాటు, భవిష్యత్తు తరాన్ని కూడా ప్రభావితం చేసే వ్యక్తిని వైతాళికుడు'' అని అంటారు. ఆనాడు వర్తమానంగా ఉన్నటువంటి అనేక మంది రచయితలకు వట్టికోట ఒక ప్రేరణగా నిలవడంతో పాటు, తర్వాతి తరాలకు కూడా ఆదర్శంగా నిలిచాడు. ఈయన నవలా రచయితగానే కాకుండా, కథా రచయితగా, ఉద్యమకారుడిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా భిన్నమైన పాత్రలను పోషించాడు. నిబద్ధుడిగా ఉంటూ ప్రజల పక్షాన నిలిచిన రచయిత. ఈ నవలలోని అంశాలను వర్తమాన ప్రాసంగికత కోణం నుంచి అధ్యయనం చేయాలంటే ఇందులోని విషయాన్ని క్రోనాలజికల్ ఆర్డర్‌గా అధ్యయనం చేస్తే ఈ భావనకు సరైన న్యాయం చేసిన వాళ్ళం అవుతాము.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, గ్రంథాలయోద్యమం, ఆ తర్వాత వచ్చినటువంటి అనేక సామాజిక, రాజకీయ ఉద్యమాలన్నింటికి నల్లగొండ జిల్లా భూమికగా పనిచేసింది. ఉద్యమ చైతన్యానికి నెలవు అయిన నల్లగొండ జిల్లా, చెరువు మాదారంలో వట్టికోట ఆళ్వారు స్వామి 1915 నవంబర్ 1వ తేదీన పుట్టారు. వీరి తల్లిదండ్రులు సింహాద్రమ్మ, రామాచంద్రాచార్యులు. వీరిది పేద వైష్ణవ బ్రాహ్మణ కుటుంబం. చిన్ననాటి నుండే అనేక కష్ట నష్టాలకు ఓర్చుకొని, పేదరికాన్ని అనుభవిస్తూ చదువును కొనసాగించాడు. వట్టికోట గురువు సీతారామారావు గారు. ఈయన దగ్గర శిష్యరికం చేస్తూ, వండి పెడుతూ, విద్యాభ్యాసం చేసాడు. ఈ క్రమంలోనే సీతారామారావుకు సూర్యాపేట పాఠశాలకు బదిలీ కావడంతో, ఆయన వెంట వెళ్లి అక్కడ గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. అక్కడ కొంతమంది పెద్దవాళ్లతో పరిచయం ఏర్పడుతుంది. ఈ విధంగా ఒక కార్యకర్తగా నిరంతర కృషి చేస్తూ, నిరంతర జ్ఞాన పిపాసిగా తిరుగుతూ, కోదాటి నారాయణరావుతో సావాసం చేసి 1933లో గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్గా చేరాడు. అప్పటికి తెలుగు సమాజంలో ప్రముఖంగా ఉన్నవారితోను, గ్రంథాలయోద్యమంలోను, సంఘ సంస్కరణోద్యమంలోను కార్యకర్తలందరితో కలిసి పనిచేసాడు. నిజానికి ఈ కాలానికి ఒక ప్రత్యేకత ఉంది. 1930, 1940లలో ప్రారంభమైన వారు మొదటగా చైతన్యవంతులు అయ్యారు. వీళ్ళందరూ సాహితీకారులుగా ఉండటంతో పాటు, అదే సమయంలో రాజకీయ కార్యకర్తలుగా కూడా పనిచేయాల్సి వచ్చింది. ఇది ఆనాటి ప్రత్యేక స్థితి.

కోదాటి నారాయణరావు గారితో పరిచయం వల్ల గోల్కొండ పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి పరిచయం ఏర్పడింది. వీరితో పని చేయడం తన ఆలోచనల్లో మార్పును తీసుకువచ్చింది. సమాజాన్ని విస్తృతంగా అధ్యయనం చేసే అవకాశం కలిగింది. ఆయనకు ఒక సంఘర్షణాత్మకమైన జీవితం ఉన్నది. చదవడాన్ని ఇష్టపడ్డవాడు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాడు. ప్రజా ఉద్యమాలలో ఉన్నాడు. గ్రంథాలయ ఉద్యమంలో కాలుకు బలపం కట్టుకొని పనిచేసాడు. ఆంధ్రోద్యమం నాయకులతో పనిచేసాడు. తర్వాత 'దేశోద్ధారక గ్రంథమాల' అనే పేరుతో దాదాపు 35 నుండి 40 పుస్తకాల వరకు రాయించి, ప్రచురణ చేయించారు. పౌరహక్కుల కార్యకర్తగా ఉన్నాడు. ఆనాడు దొడ్డి కొమురయ్యను చంపేస్తే అక్కడి నిజనిర్ధారణ కమిటీలో పాల్గొన్నాడు.

వట్టికోట 1940 తర్వాత రచయితగా ప్రారంభమయ్యాడు. గోల్కొండ, మీజాన్, ఆంధ్రకేసరి, గుమాస్తా, కేసరి వంటి పత్రికల్లో విస్తృతంగా వ్యాసాలు, కథలు, విశ్లేషణలు రాసారు. అలాగే రాజకీయ ఉద్యమాలలో పాల్గొంటూనే, పౌరహక్కుల కోసం, రిక్షా కార్మికుల కోసం అనేక ఉద్యమాలు చేసారు. గుమాస్తాల కోసం ప్రత్యేకంగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, కార్మికులలో చైతన్యాన్ని నింపాడు. వారి కోసం 'గుమాస్తా' అనే పత్రికను ఏర్పాటు చేసాడు. తన జీవితమే ఒక పోరాటంగా మలుచుకున్నాడు. లోతుగా ఆలోచిస్తే ప్రజల మనిషి నవల ఒక్కటే కాదు, ప్రజల మనిషిగా రూపాంతరం చెందిన వట్టికోట ఆళ్వారు స్వామే ఇప్పుడు అత్యంత ప్రాసంగికత కలిగి ఉన్నాడు. ఆయన ఆచరణ, రచన రెండు ఇప్పుడు ప్రాసంగికమే.

రచయిత తన భావాలను వివిధ పాత్రల ద్వారా వ్యక్తం చేస్తాడు. అలా ప్రజల మనిషి నవలలో వ్యక్తం చేసిన భావాలు నేటికి ప్రాసంగికత్వం కలిగి ఉన్నాయి. ప్రజ్ఞావంతుడైన రచయిత ఆ రచన తత్వాన్ని కేవలం ఒక్కమాటలో చెప్పేస్తాడు. సరిగ్గా ఈ నవల కూడా అటువంటి వాక్యంతో ప్రారంభమవుతుంది. ఎద్దుకు సంబంధించిన ఒక సంఘటన చెబుతూ "అందరికీ సంబంధించినదిగా తలచబడే వస్తువును ఇతరులు హరించబోతుంటే అడ్డుపడి రక్షించుకునే ఆలోచన తన ఎద్దుకు కలిగినందుకు, మానవుని ప్రవృత్తి తన ఎద్దుకు అలవడినందుకు ఆనందిస్తూ కోటయ్య కొట్టంలోకి వెళ్తాడు" ఈ వాక్యంతో ప్రజల మనిషి నవల ప్రారంభమవుతుంది. సామూహిక జ్ఞానాన్ని, సామూహిక చైతన్యాన్ని కూడా అణచివేస్తున్న క్రమంలో అందరిదిగా భావించే సంపద అంతా కూడా మాది అని రక్షించుకునే ప్రయత్నాన్ని మానవ సమాజం అలవరచుకోవాలనే సూచన ఇందులో కనబడుతుంది. ఎక్కడ అన్యాయం ఉంటుందో, అక్కడ అప్రయత్నంగానే ప్రతిఘటన ఉంటుంది. ఆ ప్రతిఘటనను అణువణువున ఈ నవల చిత్రించింది. ఈ ప్రతిఘటన చైతన్యాన్ని మనం క్రమ పద్ధతిలో తెలుసుకుంటాం.

ప్రజల మనిషి నవలలో మొదట వెట్టిచాకిరి గురించిన ప్రస్తావన వస్తుంది. 1930ల నాటి తెలంగాణ సమాజం ఏ విధంగా రాచరిక పాలనలో అవస్థ పడ్డది, ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నది, రాజకీయ వ్యవస్థ ఎలా ఉన్నది? పాలన వ్యవస్థ ఎలా ఉన్నది, గ్రామాలలో ఉండే దేశ్‌ముఖులు, దొరలు, పోలీస్ పటేళ్ల పీడన ఎలా ఉండేది?, వారు ప్రజలను ఎట్లా పీడించేవారు? వాళ్ళ భూములను దుర్మార్గంగా లాగేసుకునే భూమి సమస్య, మతాంతరీకరణ సమస్య, గస్తీ నిషాని లాంటి చట్టాలు ఈ నవలలో ఉన్నాయి. ఈ అంశాలను ప్రస్తుతం 2000 తర్వాత పరిస్థితులతో పోల్చి చూసినప్పుడు వెట్టి చాకిరి పోయింది. కానీ, అది రూపం మార్చుకున్నది. భూమి సమస్య అలాగే ఉంది.

ప్రజల మనిషి నవల నిజామాబాద్ జిల్లా, దిమ్మగూడెం అనే గ్రామంలో ప్రారంభమై, హైదరాబాదులో సత్యాగ్రహం చేసేంతవరకు విస్తరిస్తుంది. ఈ గ్రామంలో ఇద్దరు స్నేహితులు ఉంటారు. వాళ్ళే కొమురయ్య, కంఠీరవం. వీరు ప్రధాన పాత్రలు. ఆ ఊరి దొర రాంభూపాలరావు. ఆ దొర బిడ్డ పెళ్లి సమయంలో కొమురయ్య కుటుంబం ఒక ఆవుని ఇవ్వాల్సి వస్తుంది. కంఠీరవం వాళ్ళు విస్తరాకులు కుట్టి ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుంది. ఇద్దరి పసి మనసుల్లో ఒక ప్రశ్న మొదలవుతుంది. దొర ఇంట్లో పెళ్లి అయితే మనం ఆవుని ఇవ్వడమేంటి? విస్తరాకులు కుట్టివ్వడం ఏమిటి? అనే ప్రశ్నలతో ఈ నవల ప్రారంభమవుతుంది. కంఠీరవం చిన్నతనంలోనే తండ్రి రఘునాథాచార్యులు మరణిస్తాడు. కొంతకాలానికి సోదరుడు వేంకటాచార్యునికి పనిచేయడం చేతగాక, సరైన ఆలోచన విధానం లేక, దొర పంచలో చేరి నిత్యం తన తల్లిని, తమ్ముడ్ని తిడుతూ, ఇంట్లో ఆధిపత్యం చెలాయిస్తుంటాడు. వీటికి తట్టుకోలేక కంఠీరవం బయటికి వెళ్లిపోతాడు.

గ్రామంలో కొమురయ్య సాగు చేస్తున్న పొలాన్ని తన తండ్రి కోటయ్యకు, ఆ గ్రామం నుండి వలస వెళ్లిన ఒక బ్రాహ్మణ కుటుంబం దున్నుకునేందుకు కౌలుకి ఇస్తారు. మంచిగా వ్యవసాయం చేసుకుంటున్న కొమురయ్య పొలం మీద దొర కన్ను పడుతుంది. కంఠీరవం అన్న అయిన వేంకటాచార్యునితో దొర కుమ్మక్కై, గతంలో అప్పు కింద జప్తు చేసుకున్న మీ పొలాన్ని తిరిగి నీకు ఇచ్చేస్తాను, కానీ, కొమురయ్య పొలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేయించాలని, హైదరాబాద్ కి తీసుకెళ్తాడు. అక్కడ దొంగ సంతకాలు, పంచులు పెట్టి కొమురయ్య భూమిని గుంజేసుకుంటాడు. ఈ నవలలో చైతన్యం భూమి చుట్టూ ముడిపడి ఉంటుంది. వేంకటాచార్యులు తండ్రి రఘునాథాచార్యుల భూమిని అన్యాయంగా దొర గుంజుకుంటున్నప్పుడు పొలం ఇచ్చింది మీరే, తీసుకుంటుంది మీరే అని వదిలేసాడు. కూటికి లేక, పోరాటం చేయలేక కుమిలిపోయి, చనిపోతాడు. అక్కడ ఎటువంటి ప్రతిఘటన చేయలేదు. కానీ, కాలక్రమంగా చైతన్యం పెరిగింది. కొమురయ్య భూమి దగ్గర సమస్య చైతన్య రూపం తీసుకుంటుంది. కొమురయ్య తల్లి అన్నమ్మ దొర నాగలికి అడ్డం పడుతుంది. నా ప్రాణం పోయినా పర్వాలేదు. కానీ, ఈ భూమిని మాత్రం నేను వదిలిపెట్టనని ఆమె పోరాటం చేస్తుంది. అప్పటికి

నాగళ్ళు ఆగిపోతాయి. కానీ, సమస్య అక్కడితో ఆగిపోదు. కొమురయ్య తన భూమి విషయం మాట్లాడాలని దొర రాంభూపాలరావు దగ్గరికి పోయినప్పుడు నా పొలంలో, నా నాగళ్ళను ఆపి, నాతో మాట్లాడటానికి వచ్చినవా అని కొమురయ్యను విపరీతంగా కొడతాడు. దొరకు వ్యతిరేకంగా పోరాడలేని పరిస్థితిలో భూమిని వదిలిపెట్టాల్సి వస్తుంది. మొదటి దశ భూ సమస్యకు, రెండవ దశ భూ సమస్యకు మౌలిక మార్పు వచ్చింది. అది ప్రతిఘటన. కానీ, విజయం సాధించలేక పోయారు.

ఇక కంఠీరవం ఊరిని విడిచిపెట్టి వెళ్లిపోయి నిజామాబాద్ జిల్లాలో గ్రంథాలయోద్యమంలో చురుకైన పాత్రను పోషించాడు. దిమ్మగూడెం ఊరిలో చంద్రయ్య కొమురయ్యలు స్థానిక సమస్యల నుంచి వర్గ చైతన్యాన్ని పొందుతున్నారు. ఇటువంటి సందర్భంలోనే జాతీయోద్యమంతో చైతన్యవంతమైన కంఠీరవం గ్రామానికి వస్తాడు. గ్రామంలోని వర్గ చైతన్యం, బయట ఉన్నటువంటి జాతీయోద్యమ చైతన్యంతో కలిసి అక్కడ ప్రజా పోరు నడుస్తుంది. పాలకులు ఎవరైనా ప్రజలకు అనుకూలంగా పనిచేయాలనే ఒక వాతావరణం ఏర్పడుతుంది. గ్రంథాలయోద్యమం విస్తరిస్తుంది. పత్రికలు వస్తాయి. వీధి బడులు, రాత్రి బడుల్లో చదువు ప్రారంభం అవుతుంది. ఆర్య సమాజం కార్యక్రమాలు విస్తృతమవుతాయి.

నవలలో కొమురయ్య భూమి సమస్య ఉన్నట్లుగానే. నేటి సమాజంలో కూడా భూమి సమస్య అత్యంత తీవ్ర స్థాయిలో ఉంది. పేదలు, దళితులు, వెనుకబడిన జాతులకు ఉండే ఎకరం, రెండెకరాల భూములను కూడా ప్రాజెక్టుల పేరుతో గుంజుకునే ప్రయత్నం చేస్తారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూమిని తక్కువ రేటుకు కొనాలని ప్రయత్నిస్తున్నారు. అమ్మడానికి సిద్ధపడని కుటుంబాలపై భౌతిక దాడులు చేస్తున్నారు. వారికి వచ్చే మార్కెట్ అవకాశాలను తగ్గిస్తూ ఆధునిక భూమి సమస్యలను సృష్టిస్తున్నారు. ఇటువంటి భూమి సమస్యలు ప్రస్తుతం ప్రజలను కదిలిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం తెలంగాణలో ఫార్మాసిటీ భూముల కోసం పొలాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తుంది. కందుకూరు మండలానికి చెందిన ఒక మహిళా రైతు తన భూమిని ఇవ్వను అని, నవలలో కొమురయ్య తల్లి అన్నమ్మ పాత్రలాగా ఎలాగైతే పోరాటం చేసిందో, ఇక్కడ చంద్రమ్మ అనే స్త్రీ కూడా పోరాటం చేసింది. ఈ పోరాటం ప్రధాన శీర్షికగా పత్రికల్లో వచ్చింది. ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. ఆనాడు అన్నమ్మ చేసిన పోరాటం ఇప్పటికీ ప్రాసంగికతను కలిగి ఉంది. ఆనాడు నేరుగా దొరలు దౌర్జన్యం చేస్తే, నాటి ఆ దొరలే నేడు ప్రభుత్వంలో చేరి భూములను గుంజుకుంటున్నారు. దోపిడి అలాగే ఉంది. దోచుకునే పద్ధతి మారింది. విధానం మారింది. ఆనాడు అన్నమ్మ పాత్ర, నేడు చంద్రమ్మ. రెండు సందర్భాలలో స్త్రీలై చైతన్యానికి ప్రతీకలుగా నిలిచారు. భూ పోరాటంలో ముందున్నారు.

ఆనాడు మతాంతరీకరణ అనేది ముఖ్యమైన సమస్య. నైజాం రాజ్యంలోని హరిజనులని ముస్లింలుగా మార్చాలనే ప్రయత్నం జరిగింది. దిమ్మగూడెంలోని ప్రజలను ముస్లి మతంలోకి మార్చడానికి హైదరాలి, తన మేనల్లుడిని తీసుకొని వస్తాడు. ఈ మతాధికారి గ్రామానికి వచ్చి దళితులను ముస్లిం మతంలోకి మారుస్తుంటాడు. వాళ్ల పేర్లను మార్చేసి, కొత్త పేర్లు పెట్టి, వాళ్ల మొలతాళ్లను, హిందూ సంప్రదాయాలు లేదా అప్పటికి ఉన్నటువంటి ప్రధాన స్రవంతి సంప్రదాయాలను తీసేస్తారు. భయానికో, భక్తికో మతం మారినవారు ప్రధాన గ్రామ స్రవంతిలో కలవలేక ఇబ్బంది పడతారు. దొరలు మతం మారిన వారికి పనులకు పిలువరు. కూటికి, మాటకు నష్టపోతారు.

మతాంతరీకరణ జరిగినప్పుడు పేదలు తమకు భూములు ఇస్తారని ఆశపడతారు. భూమి గురించి అడిగినప్పుడు హైదరాలి పేరు చెప్పి వెళ్లిపోతాడు. ఇలా మోసం ప్రజలను మోసం చేస్తున్న హైదరాలి, ఆ ఊరి దొర రాంభూపాలరావుని ప్రజలందరిలో కంఠీరవం నిలదీస్తాడు. మతం మారితే భూములు ఇస్తారా, మాకు తిండి దొరుకుతుందా అనే ప్రశ్నలను లేవనెత్తుతారు. దోపిడికి హిందూ, ముస్లిం అనే మతం ఉండదని ప్రజలను చైతన్యవంతం చేస్తాడు. ఇక్కడ రాంభూపాలరావు, హైదరాలి ఇద్దరు కంఠీరవాన్ని రాజద్రోహం కింద అరెస్టు చేయిస్తారు. ఆయనను బంధిస్తారు. రాజ్య ద్రోహం కేసు పెడతారు. అప్పుడు ఆయన అన్నమాట ఇప్పటికీ ప్రాసంగికత కలిగి ఉంది. ప్రజలను చైతన్యం చేయాలని ప్రయత్నించిన ప్రతి సందర్భంలోను, మేధావుల మీద, ప్రజా సంఘాల కార్యకర్తల మీద, లాయర్ల మీద, విద్యార్థుల మీద కేసులు పెట్టి వాళ్ళందరినీ కూడా జైలు పాలు చేస్తున్నారు.

1950లో రాయబడిన ప్రజల మనిషి నవలలో సరిగ్గా ఇట్లాంటి చైతన్యమే కంఠీరవం పాత్ర ద్వారా పలికిస్తాడు. ***"నేను రాజ ద్రోహం చేశానని నాపై నేరము. కాని దేశద్రోహులు, ప్రజా ద్రోహులు మాత్రమే నన్ను రాజ ద్రోహులంటున్నారు. మీరు ఏర్పరచుకున్న న్యాయస్థానాలు, న్యాయ శాస్త్రాలు రాజనీతి కేవలం మీరనుకున్నట్లు పరిపాలన సాగటానికేనని ఈ అభియోగ విచారణ సందర్భంలో మా వైఖరి తేల్చి వేసింది"*** అనే ఈ కంఠీరవం మాటలు నేటికి ప్రాసంగికతను కలిగి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో హక్కుల కార్యకర్తల మీద, చైతన్యవంతుల మీద, విద్యార్థుల మీద, ప్రజా నాయకుల మీద, ప్రజా సంఘాల కార్యకర్తల మీద, రచయితల మీద ఇలా అందరి మీద కేసులు పెడుతున్నారు. ఎవరైతే ప్రభుత్వాలకి వ్యతిరేకంగా మాట్లాడుతారో, ప్రజా సమస్యల మీద తమ గొంతుకని వినిపిస్తారో వారిని ఇబ్బందులకు గురిచేయడం ఆనాటి నుండి నేటి వరకు కొనసాగుతుంది. జర్నలిస్టుల మీద, ప్రొఫెసర్ల మీద దేశవ్యాప్తంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు. జేఎన్‌యూ మొదలు ఢిల్లీ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం దాకా కూడా విద్యార్థులు అణచివేతకు గురవుతున్నారు. ఈ సందర్భంగా 1955లో రాసినటువంటి ఆ మాట ఈనాటికి కూడా ప్రాసంగికత కలిగి ఉందన్న విషయం అర్థమవుతుంది. ఈ విధంగా 1930ల కాలం నాటి సామాజికార్థిక, రాజకీయ పరిస్థితులు 21 శతాబ్దంలో కూడా అత్యంత ప్రాసంగికతను కలిగి ఉన్నాయి.

★ **రచయిత: అధ్యాపకులు, తెలుగుశాఖ, ఓయూ**

## విమర్శ

# తెలంగాణ సాహిత్య వికాసం-కథా ప్రక్రియ ప్రస్థానం

డా. లావుడ్య శ్రీదేవి

ఆధునికయుగంలో ఆంధ్ర, తెలంగాణ సాహితీ వారసత్వం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ ఉన్నది. 20శతాబ్ది ఆదిలో ఆవిర్భవించిన నవ్యకవితా ధోరణులు మొదలుకొని నేటి కవిత్వోద్యమాలన్నింటిలోనూ తెలుగు కవులు ముఖ్య పాత్ర వహించి ముందంజ వేశారు. రాయప్రోలు, కృష్ణశాస్త్రిలతో ప్రారంభమైన భావకవిత్వం దశదిశలు వ్యాపించింది. తెలంగాణ ప్రాంతంలో కూడా ఈ ఉద్యమ ప్రభావం కనిపిస్తుంది. అనేక భావకవితా రచనలు వెలువరించారు. పల్లా దుర్గయ్య, 'గంగిరెద్దు, పాలవెల్లి' సంపుటులు గ్రామీణ ప్రకృతి శోభను, పల్లీయ జీవితాన్ని అతిసుందరంగా వర్ణించాయి. గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ' కర్షక కవిత్వశాఖలో కలికితురాయిగా ఎన్నదగినవి. అదేవిధంగా అభ్యుదయ కవిత్వ భాగమైన తెలంగాణా విముక్తి పోరాట కవిత్వం సాహిత్య చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా గుర్తింపు పొందింది. ఈ మార్గంలో దాశరథి, 'రుద్రవీణ, అగ్నిధార', కావ్యాలు నిజాంరాజు నిరంకుశ పాలనను ఎదిరించి స్వాతంత్ర్య సమరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కవి దాశరధి. ఈయన "తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అడాడమీ బహుమతి పొందింది. ఇది అభ్యుదయ కవులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. యాదగిరి, తిరునగరి, రామాంజనేయులు, సుద్దాల హనుమంతు పాటల ద్వారా విముక్తి పోరాటానికి అండగా నిలిచారు. కాళోజీ ప్రజల బాధని తన గొడవగా చేసికొని ప్రజా పోరాటానికి ప్రతినిధిగా నిలిచాడు.

సమకాలీన ఉద్యమాల చైతన్యాన్ని జీర్ణించుకొని మానవతావాద మంత్రాన్ని వినిపించిన కవి సి.నారాయణరెడ్డి. ఆయన నిరంతర కవితా ప్రస్థానంలో 'నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు' మైలురాళ్ళలా గోచరిస్తాయి. నవ్య సంప్రదాయ మార్గంలో వెలువడిన కావ్యాలు వానమామలై వరదాచార్యులు 'పోతన చరిత్రము', జగన్నాధాచార్యుల 'రైతు రామాయణం' ఇంకా ఈ మార్గంలో ఉత్పల సత్యనారాయణచార్య, వేముగంటి నరసింహచార్యులు పద్యకావ్యాలు వెలువరించారు. సంపత్కుమార, పేర్వారం, వేనరెడ్డి, సుప్రసన్న మొదలైన కవులు అనుభూతి పరమైన కవితా సంపుటులు ప్రచురించారు. "దిగంబర కవుల్లో చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి) జ్వాలాముఖి (ఏవీ రాఘవాచార్యులు), నిఖిలేశ్వర్(యాదవరెడ్డి) అనేక రచనలు చేశారు. ఈ చైతన్యంతో 1970లో విప్లవ రచయిత సంఘం ఆవిర్భవించింది.

బండారు అచ్చమాంబ, సురవరం, వట్టికోట, భాస్కరభట్ల, నెల్లూరి కేశవస్వామి, బూర్గుల రంగనాథరావు, నందగిరి ఇందిరాదేవి, పి.యశోదారెడ్డి, ఇల్లిందల సరస్వతి, సురమౌళి, గూడూరి సీతారాం ఎందరో కథానిక రచనలో విశిష్టతను గడించారు. తెలంగాణలో ఆధునిక కథ ఎప్పుడు మొదలయిందన్న విషయాన్ని పరిశీలిస్తే, తెలుగులో మొదటి కథ తెలంగాణలోనే ప్రారంభమైందన్న విషయం అర్థమవుతుంది. ఆంగ్లభాషా సాహిత్యాల పరిచయంతో తెలుగులోకి ఆధునిక కథ ప్రవేశించినా, అది ఆ భాషా సాహిత్యాలతో తెలంగాణ నుంచి రావడం విశేషం. అంతేకాకుండా తెలుగులో కథ వస్తున్న చారిత్రకకాలంలో తెలంగాణలో తెలుగు చదువుకునే అవకాశాలు కూడా చాలా తక్కువే. పోతే, కథానిక మధ్యతరగతి చదువరులకోసం, మధ్యతరగతి ఎక్కువగా ఉన్న ప్రాంతంనుంచి వచ్చే అవకాశముందని విమర్శకుల అభిప్రాయం. ఈ అభిప్రాయం ప్రకారం తెలుగు కథ మధ్యతరగతి ఆవిర్భవించిన కోస్తాప్రాంతం నుంచి, ఆంగ్లేయ విద్యాప్రభావం ఎక్కువగానున్న కోస్తా ప్రాంతం నుంచి రావల్సింది. కాని అలా జరుగలేదు. మొదటి తెలుగు కథ ఆంగ్లేయ విద్య, పాలన ప్రభావం అంతగాలేని, మధ్యతరగతి అసలే లేని సమయంలో తెలంగాణనుంచి రావడం విశేషం. తెలంగాణలోనూ, తెలుగు సాహిత్యంలోనూ మొదటి కథ 1901–1902 ప్రాంతంలో బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీవిద్య'. బండారు అచ్చమాంబ తెలంగాణ వైతాళికుల్లో ఒకరయిన కొమర్రాజు లక్ష్మణరావు చెల్లెలు. ఆమె పుట్టింది నల్లగొండ జిల్లాలో, పెరిగింది, కథలు రాసింది, జీవితం కొనసాగించింది తెలంగాణలోనే. ఈమె సంఘసంస్కర్త వీరేశలింగం పంతులుగారికి సమవయస్కురాలు. వీరేశలింగం సంఘ సంస్కరణ ఉద్యమంతో ప్రభావితురాలైన ఈమె సంస్కరణ నేపథ్యంతోనే కథలు రాసింది. ఆ కాలంలో తెలంగాణలో ముఖ్యంగా, కోస్తా ప్రాంతంలోనైనా స్త్రీకి విద్య నేర్పడం సాహసంతో కూడుకున్న పని. ఎంత సంపన్నులయినా స్త్రీని ఇంటికే పరిమితం చేసేవారు కాని బడికి తోలేవారు కాదు.

స్త్రీవిద్య ఆవశ్యకతను తెలుపుతూ రాయబడిన ఈ కథ, తెలుగు కథల్లో మొట్టమొదటి కథ అనడంలో సందేహం లేదు. ఆధునిక కథకుండాల్సిన లక్షణాలన్నీ సంతరించుకున్న ఈ కథను మొదటి కథగా అంగీకరించడానికి ఏ అభ్యంతరాలూ ఉండాల్సిన పనిలేదు. ఎప్పుడో ఎవరో నిర్ణయించిన కథానిక లక్షణాలను నూటికి నూరుపాళ్ళు అనుసరించిన కథకులెవరూ లేరు. విషయ సేకరణలోనూ, కథ చెప్పడంలోనూ ఆధునికతను సంతరించుకొని, సరళమైన భాషలో రాయబడిన ఈ కథ కచ్చితంగా మొదటి కథే. సమకాలీన సామాజిక ప్రయోజనమున్న వస్తువును తీసుకొని స్త్రీ విద్య ఆవశ్యకతను నొక్కిచెబుతూ రాయబడిన ఈ కథే మొదటి కథ. ఆ కాలంలో కలం పట్టిన రచయితలు, కవులపై తెలుగు సమాజంలో జరుగుతున్న సంస్కరణ ఉద్యమాల ప్రభావమున్నట్టే బండారు అచ్చమాంబపై కూడా సంస్కరణోద్యమాల ప్రభావముంది. స్త్రీ విద్యతోపాటు మరో 12 కథలు రాసింది అచ్చమాంబ. దంపతుల ప్రథమ కలహం, సత్పాత్రుదానం లాంటి నీతి బోధక కథలను రాసిందీరచయిత్రి. ఈమె రాసిన ప్రసిద్ధ కథ 'ధనత్రయోదశి'. ఇందులో బొంబాయికి వలస వెళ్లినవారి విషయం, మానసిక సంఘర్షణ, ధనం కంటె గుణం మిన్న అన్న సందేశం ఉంది. ఆ కాలంలోనే బొంబాయి వలసల

గురించి ప్రస్తావించిన అచ్చమాంబ అసలుసిసలైన తెలంగాణ బిడ్డ. నీతి, నిజాయితీ, నైతికత ఎప్పటికైనా మేలు చేస్తాయన్న సందేశాన్ని ఈ కథ ద్వారా ఇచ్చిన అచ్చమాంబ సంఘ సంస్కరణకు, సాంస్కృతిక పునర్వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహిళామణి. ఇలా తెలంగాణ నుంచే కాకుండా, తెలుగు నుంచే మొట్టమొదటి కథనందించిన ఘనత ఓ మహిళా మణికి, తెలంగాణ నేలకు దక్కుతుంది. 1901-1902 ప్రాంతంలోనే తెలంగాణలో కథ ప్రారంభమైనా 1912లో మాడపాటి హనుమంతరావు కథలు రాసేంతవరకు తెలంగాణ నుంచి ఆధునిక కథ రాకపోవడం గమనించదగిన విషయం.

ఇలా సంస్కరణ నేపథ్యంతో స్త్రీవిద్య ఆవశ్యకతను నొక్కి చెబుతూ ప్రారంభమైన తెలంగాణ తెలుగుకథ జ్వాజ్వల్యమానంగా వెలుగుతుంది. ఆశు సాంప్రదాయంనుండి ఆశు సాంప్రదాయ లిఖిత కథకు అనేక పోకడలు పోతుంది. అయితే బండారు అచ్చమాంబ తర్వాత కొంత ఖాళీ ఏర్పడినా, మాడపాటి తర్వాత కథలు ఎక్కువగా రాకున్నా, అన్ని కాలాల్లోనూ తెలంగాణతనాన్ని ప్రతిబింబించే గొప్ప కథాసాహిత్యం వచ్చింది. నేల విడిచి సాము చేయని కథాసాహిత్యం వచ్చింది. డిటెక్టివ్ సాహిత్యం, ఆరడుగుల ఎత్తున్న కథానాయకుల ప్రేమ సాహిత్యం, భూతప్రేత నవలా సాహిత్యం, సినీ నవలా సాహిత్యం వస్తున్న సమయంలోనూ తెలంగాణ నుంచి జనజీవన సంఘర్షణ సాహిత్యమే వచ్చింది. తెలుగు సాహిత్యాన్ని, కథా సాహిత్యాన్ని వ్యాపారమయమైపోకుండా తెలంగాణ కథ కాపాడింది. అన్ని ఉద్యమాలను, మార్పులను, రాజకీయాలను తనలో సంలీనం చేసుకొని తెలంగాణ రచయితలు అద్భుతమైన కథా సృజనం చేసారు. అస్తిత్వవాద, దళితవాద, దండోరా, బహుజనవాద, మైనారిటీ, ప్రాంతీయ, విప్లవవాద ఉద్యమాలను వేటినీ వదిలిపెట్టకుండా తెలంగాణ కథ సమకాలీన ఉద్యమాలకు భాష్యాలను పలికింది. ప్రపంచాన్ని కుదిపివేసిన, కుదిపివేస్తున్న పారిశ్రామిక విప్లవ, మార్క్సిస్టు విప్లవ, ప్రపంచీకరణ పరిణామాలకు అద్దంపడుతూ, విశ్లేషిస్తూ, పరిష్కారాలను చూపుతూ తెలంగాణ కథకులు కథలు రాసారు. రాస్తున్నారు.

చారిత్రకదృష్టితో విభజన చేసినపుడు తెలంగాణ కథాకాలాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. తెలంగాణలో కథ ప్రారంభమైన 1902 నుంచి హైదరాబాద్ దక్కన్ ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన 1956 వరకు ప్రారంభ కాలంగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను మొదటితరం రచయితలుగా పేర్కొనవచ్చు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 1956 నుంచి తెలంగాణలో విప్లవోద్యమాలు వేళ్ళూనుకొని 'నీ బాంచెన్ కాల్మొక్తా' అన్న వాళ్ళే తిరుగుబాటు చేసే దశకు చేరుకున్న దశ 1975 వరకున్న కాలాన్ని తెలంగాణ కథావికాస దశగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను రెండవతరం రచయితలుగా పేర్కొనవచ్చు. 1975 నుండి 1995, వరకు తెలంగాణ కథకు ఉజ్వల దశగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను మూడవతరం రచయితలుగా చెప్పవచ్చు. 1995 తర్వాత కలంపట్టి రాసిన రచయితలను ఈ తరం కథా రచయితలుగా, ఈ కాలంలో వచ్చిన కథలను ప్రపంచీకరణ యుగకథలుగా పేర్కొనవచ్చు. అంటే ఆయాకాలాల్లో కలంపట్టిన ప్రసిద్ధులైన రచయితలు ఆ కాలానికే పరిమితమైంద్రని కాదు. కొందరు అక్కడికే ఆగిపోతే మరికొందరు కాలంతో నడిచి ఆ తర్వాతి కాలాల్లోనూ తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విభజననుసరించి తెలంగాణ కథాసాహిత్యంలో వచ్చిన వివిధ పరిణామాలను, తెలంగాణ కథా దీపధారులను, సమాజంపై ప్రభావం చూపిన ప్రసిద్ధ కథలను పరిశీలిద్దాం. ఈ నాలుగు కాలాల మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఆ తేడాలను గమనించి రచయితలు సమకాలీన, రాజకీయార్థిక, సామాజిక విషయాలను తమ కథల్లో నిక్షిప్తం చేసారు. తొలితరంలో కలంపట్టిన రచయితలు హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నవారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడకముందే కలం పట్టినవారు. నైజాం పాలనను చవి చూసినవారు. మలితరంలో కలం పట్టినవారు ఆంధ్రప్రదేశ్ అవతరణను చూసినవారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పరిస్థితిని చూసినవారు. మూడవతరంలో కలం పట్టినవారు స్వాతంత్ర్యానంతరం పుట్టినవారు. ఉమ్మడి రాష్ట్రంలో పెరిగినవారు. 1968-69 తెలంగాణ పోరాటం, 1970ల విప్లవ పోరాటాలు చూసినవారు. పోరాటాల్లో, పోరాట ప్రాంతంలో జీవిస్తున్నవాళ్ళు. నాలుగవతరంలో కలం పట్టినవాళ్ళు ప్రపంచీకరణ ప్రభావంతో పెరిగి పెద్దయినవారు. ఈ అన్ని తేడాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కథకులు ఓ చారిత్రక దృష్టితో కథలు రాసారు. స్థలకాలాల చైతన్యంతో కథలు రాసారు. అన్ని సామాజిక, సాంఘిక, భాష, రాజకీయ, ఆర్థిక పరిణామాలకు స్పందించి కథలు రాసారు.

సమకాలీన సమాజాన్ని ఆవిష్కరిస్తూ, సమస్యలకు మూలాల్ని అన్వేషిస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పడుతూ పరిష్కారాల్ని సూచిస్తూ సాగింది తెలంగాణ కథాప్రస్థానం. స్థిరీకృత, ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నించడంతో కథా రచయితలు తెలంగాణలో ఒకడుగు ముందు వేసినారు.తెలంగాణ ప్రాంతం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంక్షోభానికి గురవడం ఈ ప్రాంత కథా రచయితలకు బలమైన వాహికగా, కథావస్తువుగా నిలచింది. ప్రధానంగా పరాయీకరణ, వలసలు, గ్రామాలు విధ్వంసమవడం, మనిషి వ్యాపార వస్తువుగా మారడం, సంస్కృతి విచ్ఛిన్నతకు పరాయివారి భాషాసంస్కృతుల ఆధిపత్య ధోరణులు, జీవనవిధానంలోని అంతరాలు, సామాన్యునికి చేరని స్వాతంత్ర్య ఫలాలు కథా రచయితల్ని తీవ్రంగా ఆలోచింపజేశాయి.

ఏ ప్రాంత సాహిత్యానికైనా, ఆ ప్రాంత సమకాలీన సమాజమే వస్తువును సృష్టిస్తుంది. అలాగే తెలంగాణ కథా సాహిత్యానికి ఇక్కడి వివిధ కాలాల్లో, వివిధ రకాలుగా ఏర్పడ్డ అనేక సమస్యలు, సంఘర్షణలు, అసమానతలు, ఆధిపత్యాలు, వివక్షలు కథా వస్తువులైనాయి. ప్రధానంగా ఇక్కడి కథావస్తువులన్నీ ఆయా రచయితల అనుభవాల్లోంచి వచ్చిన సజీవ దర్పణాలు. తెలంగాణ అనేక ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరు పొందింది. తెలంగాణ సాయుధ పోరాటం. కార్మికోద్యమాలు, గిరిజన పోరాటాలు, భూమికోసం జరిగిన తిరుగుబాట్లు, దొరల దౌర్జన్యాలకు గురైన పేదప్రజల నిస్సహాయతలు ఇక్కడి కథలకు ప్రధానవస్తువులైనాయి. తెలంగాణ కథా సాహిత్యాన్ని అధ్యయనం చేసినట్లైతే, అందులో గ్రామీణ జీవితం, సామాజిక పరిస్థితులు, గృహజీవనం, వ్యవసాయం, కూలీ నాలీ బ్రతుకులు, విద్యావిషయాలు, వివిధ వృత్తులు, ఆలయాలు, ఉత్సవాలు, జాతరలు, అప్పుసప్పులు, వెట్టిచాకిరీ ఇలా ఎన్నో అంశాలు కనిపిస్తాయి.

వీటికితోడు కులాలు, వర్ణాలు, వర్గాలు దర్శనమిస్తాయి. ఆయా కుల, వర్ణ, వర్గాల్లో ఉన్నవాళ్ళూ, లేనివాళ్ళూ మనకు కనిపిస్తారు. అలాగే పంటలూ, భూముల క్రయవిక్రయాలు, సర్కారు పన్ను, నీటిపన్ను ఇవి ప్రాధాన్యం వహిస్తాయి. వీటన్నింటికీ తోడు ప్రభుత్వం, రెవెన్యూ పోలీసు వ్యవస్థ, గ్రామాధికారుల వ్యవస్థ అడుగడుగునా తొంగిచూస్తాయి. ఇంక ఇవి కాకుండా వంటలు, అభిరుచులు, మనస్తత్వాలు, ఆచారాలు, ఆటపాటలు, పెళ్లీపేరంటాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు ఇలా ఒకటా రెండా తెలంగాణ కథా సాహితీ విశ్లేషణ ద్వారా తెలంగాణ సర్వస్వాన్ని నిర్మాణం చేయవచ్చు.

1956కి పూర్వం తెలంగాణాలో ఇరవై మందికి పైగా మహిళా కథకులు తమ కథా రచనలు వెలువరించారన్న విషయం తెలుస్తుంది. అందులో కోరాడ భూషణమ్మ, భారతమ్మ, శిరుగూరి రత్నమ్మ, పి.సరళాదేవి, ఎ.పి.సీతాదేవి, భారతీ రత్నకాంబ, విజయలక్ష్మి తదితరులు ముఖ్యులు, శిరుగూరిరత్నమ్మ "వినాశకాలే విపరీతబుద్ధి" వంటి కథల్ని రచించారు. పి.సరళాదేవి, విజయనగరం ప్రాంతానికి చెందినవారు కాని, ఒక దశాబ్ద కాలంపాటు తెలంగాణాలో ఉండి 'ఎదురు చూస్తున్న ముహూర్తం, కుంకుమ రేఖలు' వంటి కథా సంపుటాలను వెలువరించారు. భారతీ రత్నకాంబ ఆంధ్రమహిళా సభలకు అధ్యక్షత వహించి, స్త్రీ చైతన్యంకోసం పాటుపడ్డారు. వందేళ్ళ తెలంగాణ తెలుగు కథా చరిత్రలో తొలితరం తెలంగాణా మహిళా కథకుల కథలు ఖచ్చితంగా నిలుస్తాయని తెలుగు సాహితీ లోకం ఆశిస్తుంది.

తెలంగాణ కథకులు మొదటినుంచి కథలు రాసి ఊర్కోలేదు. సమాజవికాసంకోసం కృషిచేసారు. వాళ్ల జీవితాలు, సాహిత్యం వేరు కాదు. అనేక రకాల అననుకూలతల నడుమ తెలంగాణ కథ అట్టడుగువర్గాల నుంచే వికసించింది. తొలిమలితరాల్లో గణనీయమైన కథలు వచ్చినా, భూస్వాముల దోపిడీని పీడనను ఎదుర్కొనే కథలే ఎక్కువ వచ్చాయి. నైజాం రాష్ట్రంలో పీడనకు మించిన సంస్కరణకు మించిన కథా వస్తువులు రచయితలను ప్రభావితం చేయలేకపోయాయి. అందుకే తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చి, నైజాం పీడన పోయేవరకు వలస జీవితాల చిత్రణ జరగలేదు. తర్వాత దశకంలో వలస చిత్రీకరణ జరిగినా, చాలా తక్కువ కథలు వచ్చాయనే చెప్పాలి. పారిశ్రామికీకరణ కార్మికుల వలస కథలు 80 ప్రాంతంలో మొదలయ్యాయి. వలసలు రెండు రకాలుగా సాగాయి. బతుకు దెరువు కొరకు ఒక రకమైతే, సంపాదనకోసం మరో రకం. కథా సాహిత్యంలో ఎక్కువగా బతుకు దెరువుకోసం వెళ్ళిన వలసలనే చిత్రించడం జరిగింది.

తెలంగాణ కథ ఎప్పుడూ నేలవిడిచి సాము చెయ్యలేదు. యదార్థాలను చిత్రించింది. గ్రాంథిక భాష నుంచి సరళ గ్రాంథికం, వ్యవహారికం, తర్వాత ప్రజల భాషలోకి తెలంగాణ కథ మలుపు తిరిగింది. 1948 నుండి 1956 వరకు అంటే ఎనిమిది సంవత్సరాలు. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగింది. ఈ ఎనిమిది సంవత్సరాల్లో ముఖ్యంగా మధ్యతరగతి జీవితం నుంచి ఎక్కువ కథలు వచ్చాయి. జి.రాములు, గూడూరి సీతారాం, జి.సురమౌళి, దాశరథి, హీరాలాల్ మోరియా, కందుకూరి లింగరాజు, వట్టికోట ఆళ్వారుస్వామి, పొట్లపల్లి రామారావులాంటి రచయితలు మధ్యతరగతి జీవితాల్లోంచి ఎదిగి కథలురాసారు. యుగాంతం తర్వాత వలసల్లో చెప్పుకోదగిన కథలు రంగడు, మారాజు, లచ్చి కథలు. ఇవి గూడూరి సీతారాం రాసిన కథలు. తెలంగాణ భాషలో, యాసలో, నానుడులతో రాసిన నికార్సయిన కథలు ఇవి.

1956-70 ప్రాంతంలో తెలంగాణలో చాలా మార్పులొచ్చాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణతో ఉద్యోగాలు కోల్పోయినవారు, వృత్తి కార్మికులు, రైతులు, భూనిర్వాసితులు వలస వెళ్ళారు. గ్రామాల్లో భూస్వాములు వేళ్లూనుకోవడంతో వెట్టిచాకిరి పెరిగింది. గోదావరి నదీతీరం వెంట బొగ్గుగనులు బయటపడి బొగ్గు ఆధారిత పరిశ్రమలు పెరిగాయి. దాంతో కార్మిక వలసలు పెరిగాయి. యాజమాన్యపుదోపిడీ పెరిగింది. భూపోరాటాలు మొదలయ్యాయి. భూపోరాటాలు మొదలయ్యాయి. తెలంగాణ భాషమీద సాహిత్యంమీద వివక్షత పెరిగింది. వృత్తి కార్మికులు, భూస్వాముల ఆగడాలకు తట్టుకోలేనివారు బొంబాయి, బీవండి, షోలాపూర్కు, భూనిర్వాసితులు మైనింగ్ ఏరియాలకు, రైతులు, కూలీలు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. 1962లో డా॥ సి.నారాయణరెడ్డి రాసిన 'బొంబాయి పోయిందు నా కొడుకు ఏడ ఉన్నాడో, ఏం తిన్నాడో' పాట నేత కార్మికుల వలసను తెలుపుతుంది. ఈ మధ్యకాలంలో హీరాలాల్ మోరియా, రామలింగం, తాడిగిరి పోతరాజు, బోయ జంగయ్య, యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, దాశరథి రంగాచార్య, గంగుల నరసింహారెడ్డి, చావా శివకోటి మొదలైనవారంతా కథలు రాసారు. ఈ కథల్లో దొరల పీడన, ప్రతిఘటన, గ్రామీణ జీవితాల చిత్రణ ఉంది. ఈ కాలంలో జరిగిన వలసల మీద కథలు 1980 తర్వాత గాని రచయితలు చిత్రించలేదు. అలా చిత్రించిన కథలను కూడా వేళ్లమీద లెక్కించవచ్చు. అప్పుడు వచ్చిన మొట్టమొదటి పాలమూరు వలస కథ బి.ఎస్.రాములు 'తిరుగుబాటు' కథ. తెలంగాణాలో ఉద్యమం వివిధ సమయాల్లో వివిధ రూపాన్ని తీసుకుంది. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంగా స్వాతంత్ర్యానికి ముందూ ఆ తరువాత కాలంలో సాగింది. తెలంగాణపై వలసవాదుల పెత్తనానికి వ్యతిరేకంగా 1968-72 ప్రాంతంలో తెలంగాణ ఉద్యమంగా సాగింది. తర్వాత దశలో నక్సలైట్ ఉద్యమం ఊపిరిపోసుకుంది. 1975 నుండి 1985 వరకు ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం తెలంగాణ కథకు కొత్త ఊపిరినిచ్చింది. ఉద్యమ కథలు, సింగరేణి కార్మిక కథలు విరివిగా వచ్చాయి.

తెలంగాణ, కథానిక వస్తువైవిధ్యాలకు పుట్ట. ఈ కథానికల్లో నిక్షిప్తమయిన వస్తువులను ఏకరువు పెట్టినాకూడా పెద్ద కథ అవుతుంది. పోరాటాల ఫలితంగా తెలంగాణాలో వచ్చిన మార్పులను, పోరాటాల వల్ల అల్లాడిన గ్రామాలను, తుపాకీ మోతలను, దళితుల, కార్మికుల, వృత్తిపనివాళ్ల వెతలను, మోటబావులు, చెరువులు, కుంటలు, ఇంకిన చెలమలు, నీళ్ళులేని బోరుపొక్కలు, విరిగిన నాగళ్ళు, మూలపడ్డ తొండాలు, చీకుపట్టిన పల్లకీలు, చేతులు విరిగిన మగ్గాలు, ముంబాయికో, దుబాయికో వలసలు వెళ్ళే కుటుంబాలు ఈ వలసలు వెళ్ళేవారు దళారుల చేతిలో మోస పోవడాలు, గోరుచుట్టుపై రోకలిపోటులాగా దేశీయ సమస్యలతో సతమతమయ్యే జనానికి పదగెత్తిన ప్రపంచీకరణ బాధ. ఇలా అనేకానేక సమస్యలు తెలంగాణ కథానికలకు ఇతివృత్తులయ్యాయి. తెలంగాణా కథకులు వైవిధ్యమైన కథానికలు రాసి తెలుగు కథకు ఒక దృక్పథాన్ని ఏర్పరిచారు. T

# సమాజ ప్రతిబింబాలు-యూట్యూబ్ జానపదపాటలు

జంగిటి వేణు

**ఉపోద్ఘాతం :**

లిఖిత సాహిత్యం కన్నా ముందే జానపద సాహిత్యం ఉందనేది జగమెరిగిన సత్యం. జానపద సాహిత్యంలో జానపద పాటలు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. ఇవి మౌఖిక ప్రసారం, అజ్ఞాత కర్తృత్వం అనే ప్రధాన లక్షణాలను కలిగి ఉన్నాయి. తొలినాళ్ళలో పరిశోధకులు జానపద సాహిత్యాన్ని, జానపదపాటలను ఊరూరా తిరిగి సేకరించి, భద్రపరిచినప్పటికి ఇంకా సేకరణకు నోచుకోని జానపద పాటలు, లిఖితబద్ధం కానీ జానపదపాటలు ప్రజల నోళ్లలో ఉన్నాయి. కానీ అనేక వినోద సాధనాలు అందుబాటులోకి రావడం వల్ల జానపద పాటలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. కాలనుక్రమంలో వచ్చిన ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం వల్ల గ్రామీణ ప్రాంతాలకు కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు (రేడియో, టెలివిజన్, మొబైల్), సామాజిక మాధ్యమాలు (ఫేస్ బుక్, యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ మొదలగునవి) చేరువయ్యాయి. వీటి వల్ల గ్రామీణ ప్రాంతంలో సుప్తస్థితిలో ఉన్న జానపద పాటల వెలికితీత మొదలైంది. అలా వెలికి తీసిన జానపద పాటలకు యూట్యూబ్ ఒక వేదికలా మారింది. వీటికి తోడు నేటి రచయితలు జానపద పాటల ఫణితిలో వర్తమాన అంశాలను వస్తువుగా తీసుకుని, సమాజం తీరును కళ్ళకు కట్టినట్టు జానపద బాణీలలో పాటలు రాస్తున్నారు. ఈ పాటలు కూడా వీక్షకులను, విమర్శకులను మెప్పిస్తున్నాయి.

సమాజాన్ని ఉత్తేజం చేయడంలో యూట్యూబ్ పాత్ర ఘననీయం. అమెరికాలో 2005లో ఏర్పడిన యూట్యూబ్, కొద్ది కాలంలోనే ప్రపంచ దేశాలకు విస్తరించింది. భారతదేశంలో యూట్యూబ్ 2006లో అధికారికంగా ప్రారంభించబడింది. నేడు యూట్యూబ్ వినియోగదారులు ఎక్కువగా ఉన్న దేశాలలో భారత్ ముందంజలో వుంది. భారతదేశం సకల మతాలకు సంస్కృతులకు నిలయం చాల మంది వారి సంస్కృతి సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను ఇతర అనేక అంశాలను ప్రపంచానికి తెలియజేయడానికి యూట్యూబ్ ఒక వేదికగా మారింది. వాటితో పాటు యూట్యూబ్‌లో అనేక జానపద పాటలు కూడా వేల సంఖ్యలో వస్తున్నాయి. అలా వస్తున్న జానపట పాటలను మూడు రకాలుగా విభజించుకోవచ్చు.

1. జానపదుల నుండి సేకరించిన పాటలను వారిచేతనే స్టూడియోలో పాడించే పాటలు.

2. జానపదుల నుండి పల్లవి/ చరణం/ ట్యూనింగ్ ని తీసుకుని రాసే పాటలు

3. నేటి రచయితలు రాసే జానపదబాణీల పాటలు.

యూట్యూబ్‌లో వెలువడుతున్న జానపద పాటలన్నీ సమాజాన్ని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. వీటిలో కొన్నింటిని మాత్రమే ప్రస్తావిస్తున్నాను.

**పిసినారికి బుద్ధి చెప్పిన జంగముడు**

భగవద్గీత, ఖురాన్ లాంటి మతగ్రంథాలు దానధర్మం కలిగి ఉండాలని సూచించాయి. కానీ నేడు చాలా మంది దానం చేసే పరిస్థితి ఉన్న కూడా చేయడం లేదు. అలాంటి నేపథ్యమున్న పాట **వచ్చే వచ్చే జంగమయ్య వచ్చినాడు జంగమయ్య** (https://youtu.be/4pZMZtVzagY?siRnyqvVnfAFuxRKs65) ఈ పాట కోత వినోద నుండి సేకరించి MULUGU TV చానెల్‌లో అప్లోడ్ చేశారు. సమాజంలో ఉన్న పిసినారి మనుషుల మనసులను తెలిపేపాట. అలాంటి వారికి మంచి సందేశం అందించే పాట ఇది. కథాత్మకంగా, సంభాషణ రూపంలో సాగే ఈ పాటలో ఒక కుటుంబం శివాలయానికి వెళ్ళగా వారి పాప దేవుడికి దండం పెట్టుకోకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఆ పాపకు శివలీలలు గురించి చెప్తున్న క్రమంలో పాట మొదలవుతుంది. ఒక ఇల్లాలు ఊర్లో ఉంటే దానం చేయవలసి వస్తుందని అడవిలో ఇల్లు కట్టుకుంటుంది. దానితో ఆ పరమేశ్వరుడు ఆ ఇల్లాలిని పరీక్షించదానికి జంగమరూపంలో వెళ్ళి **వచ్చే వచ్చే జంగమయ్య వచ్చినాడు జంగమయ్య** అంటూ భిక్షం అడగగా ఆ ఇల్లాలు.

**"ఇంట్ల బిచ్చం లేదయ్య ఇల్లాలు తొదయ్య**
**బయట బిచ్చం లేదయ్య బాలల్ల**
**తోదయ్య బయలుదేరు బాలజంగామ"**

(https://youtu.be/4pZMZtVzagY?siRnyqvVntAFuxRKs65) అంటూ అబద్ధం చెప్పడంతో ఆ జంగముడు ఏదైనా భిక్షం వేస్తేగానీ వెళ్ళను అంటాడు.

దానితో ఆ ఇల్లాలు అలుకుపిడుస వేసి అవమానిస్తుంది. ఇలాంటి ఇల్లాలు సమాజంలో ఉండకూడదని ఆ జంగమ రూపంలో ఉన్న శివుడు యమధర్మరాజుకు తెలియజేస్తాడు. తర్వాత యమభటులు ఆ ఇల్లాలు దగరికి వెళ్ళడం, నువ్వు మాతో రావాలి అనడంతో ఆ ఇల్లాలు

**"ఇరవై ఆరు వేలు వోసి ఇల్లు జాగ కొనుక్కుంటి**
**అరవై ఆరు వేలు వోసి ఆవు లాగేను కొనుక్కుంటి**
**వాటినెట్ల వదిలి రానయ్య"**

అని యమభటులను అడగగా వారు "ఇల్లు జాగను ఈపునేసుకో, అవు లాగేను ముంగటేసుకో'' అంటూ యమభటులు సమాధానం ఇవ్వడంతో ఈ లోకంలో ఎవరి ప్రయాణం వారిది, వారి ప్రయాణం ముగియగానే వెళ్లిపోవలసిందే కానీ, అతి ప్రేమలు పనికిరావు అనే నగ్న సత్యాన్ని పై చరణాల ద్వారా తెలిపారు. ఆ ఇల్లాలు యమలోకం పోయేటప్పుడు ఆకలి, దూపలు వేస్తే ఎలా? అని ప్రశ్నించగానే నువ్వు చేసిన పుణ్యం, ధర్మాలు మాత్రమే నీ ఆకలిని తీరుస్తాయి అని యమభటులు బదులిస్తారు. దానితో ఇల్లాలు బాధపడుతూ నేనేమీ దానధర్మాలు, పుణ్యాలు చేయలేదని, జంగమ రూపంలో వచ్చింది శివుడని తెలుసుకుని పాపానికి పశ్చాత్తాపం చెంది, అనేక దాన ధర్మాలు చేస్తుంది. దానితో తన మరణం తొలగిపోవడంతో పాట ముగుస్తుంది. అందుకే ఎవరైనా ఉన్నంతలో దానం చేయాలని ఈ పాట సారాంశం.

## దయలేని దచ్చన్న వారిల్లు

ఒక పెండ్లి చేయాలంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలనే అభిప్రాయం నాటి కాలంలో ఉండేది. కానీ మారుతున్న పరిస్థితులకనుగుణంగా, పాశ్చాత్య పోకడల వల్ల నేడు డబ్బు వ్యామోహంలో పడి, ధనవంతుల కుటుంబంలోకి కూతురిని కోడలిగా పంపుతున్నారే తప్ప వ్యక్తిత్వం చూడట్లేదు. పెళ్ళి తర్వాత అత్తగారింట్లో అదనపు కట్నం కోసమో, భర్త పెట్టె కష్టాల వల్ల తనువు చాలిస్తున్న ఆడబిడ్డలెందరో. అలాంటి వారి మనోవ్యథలను కళ్ళకు కట్టినట్లు చూపించే జానపద పాటలలో నక్క లక్ష్మి నుండి సేకరించిన దచ్చన్న వారింట్లో పాట https:/ /youtu.be/rT-HeoRA2pU?si= C--uX63Eet2r q6lH ఒకటి. ఉన్నత కుటుంబంలోకి తమ కూతురిని కోడలిగా పంపిన తల్లితండ్రులకు, అత్తింట్లో కూతురు మానసికంగా, శారీరకంగా హింసకు గురై మళ్ళీ తల్లిగారింటికి చేరుకుంటుంది. ఆ సమయంలో తండ్రితో తన బాధను వెళ్లబోసుకుంటూ

**కూతురు : నల్ల వంకాయ కూర తిన్నవా తండ్రి నల్ల మొకపోనికి నన్నిచ్చినావ**

**తండ్రి : నల్ల వంకాయ కూర తినలేదే బిడ్డ నల్ల మోకపోదాని ఎరుగకిచ్చిన్నే**

**కూతురు : పచ్చి చాపల కూర తిన్నవా తండ్రి పాడు వద్ద కొంపలకు దారా పోసినవ?**

జానపదుల వ్యవహారంలో నల్లమొకం, పాడువడ్డ కొంప అనే పదాలు తిట్లుగా వాడబడుతాయి. కానీ పై చరణాల్లో నలుపు అజ్ఞాతం, అంతుచిక్కని వాటికి సూచిక. నల్లమొకంకు అంతుచిక్కని రాక్షస బుద్ది కలిగినవాడుగా గుర్తించాలి. పాడుపడ్డ కొంప అనగానే శిథిలావస్థలో ఉన్న ఇల్లుగా, భూతప్రేతాలకు నెలవుగా భావిస్తాం. ధనవంతులకు శిథిలావస్థలో ఉన్న ఇల్లుతో పనిలేదు. వారు కావాలనుకుంటే రోజుకో ఇంట్లో ఉంటారు. పై చరణాల్లో పాడువడ్డ హృదయాలతో, పనికిరాని ప్రేమలతో, మానవత్వలేమితో రాక్షసుల్ల ప్రవర్తించే ఇల్లుగా జానపదులు ఈ పదాన్ని ఉపయోగించారు. సర్దిచెప్పి అత్తగారింటికి పంపిన కూతురు భర్త పెట్టె బాధను భరించలేక తల్లిగారింటికి వచ్చి ఆత్మహత్య చేసుకుంటుంది. తన కూతురు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ

తండ్రి : **పట్టు పరుపుల మీద పండేటి బిడ్డ పల్లేరు గాయల్ల పక్కెట్ల పొందే**

అంటూ అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు మరణం తట్టుకోలేక అల్లుడిని చంపేసి, జైలులో తన కూతురు జ్ఞాపకాలతో కాలం గడుపుతాడు.

## కొడుకుని, కట్టుకున్నవాణ్ణి ఖతం చేసిన భార్య

నేటి కాలంలో ప్రియుడితో కలిసి భర్తను చంపిన కిరాత భార్య అని రోజు వార్తల్లో చూస్తూనే ఉంటాం. అలాంటి నేపథ్యమున్న పాటను మంద రాము నుండి సేకరించి పరశు రాం నాగం కొన్ని చరణాలను జోడించి కరుణరసాత్మకంగా తీర్చిదిద్దాడు. https: //youtu.be/ NYg YbNgWas E?si=Tku Vami-kC9LKDg4 పండ్లోయమ్మ పరికి పండ్లు, తునికి పండ్లు అంటూ సాగే పాటలో అక్రమసంబంధం పెట్టుకున్న వ్యక్తి తమ ఇంట్లో ఉండడం చూసిన కొడుకు తల్లిని నిలదీయడంతో ప్రబుద్ధుడు (అక్రమ సంబంధం కలిగిన వ్యక్తి) చంపేస్తాడు. కొడుకు శవాన్ని పూడ్చే క్రమంలో ఎన్నెన్నో ఇబ్బందులు ఎదురౌతాయి. దాంతో చేసేదేమీ లేక ఇంట్లోనే కొడుకుని నిలువునా కోసి కూర వండి కుక్కలకు వేద్దామనుకుంటుంది. అనుకోకుండా అప్పుడే వచ్చిన భర్తకు ఆ కూరను వడ్డిస్తుంది. భర్త అన్నం తినేటప్పుడు పళ్ళెంలో కొడుకు ఉంగరం, గొలుసు కనబడుతుంది. ఇంట్లోనే దాకున్న ప్రియుడు (అక్రమ సంబంధం కలిగిన వ్యక్తి) వచ్చి భర్తని కొట్టి చంపుతాడు. దొంగతనం కోసం వచ్చిన దొంగలు జరిగిన

హృదయ విదారక సంఘటనను చూసి అదే ఇంట్లో ఆ ఇల్లాలును ప్రియుడిని ఉంచి ఇంటికి నిప్పు పెడతారు. దాంతో రంకు జంట బూడిద అయిపోతుంది. ఈ పాటలో జానపదుల వ్యావహారిక పదాలైన గలుమ (ప్రవేశద్వారం), సూరు, అరుగులు, జూటమాట, నెత్తురు, పీనుగ, తానం మొదలగు పదాలతో తాత్కాలిక ఆనందాలకోసం వెతుక్కుంటే జీవితాలే నాశనం అవుతాయనే సందేశాన్ని ఈ పాటలో గమనించవచ్చు.

**తాగుడు పాడుగాను**

జానపదులు పొద్దంత కష్టం చేసి, నొప్పులను మరవడానికి రాత్రిళ్ళు మద్యం సేవిస్తారు. మద్యపానం మరీ ఎక్కువైతే వారి జీవితాలు, వారిని నమ్ముకున్న జీవితాలు రోడ్డున పడే అవకాశం ఎక్కువ. తాగుడుకు బానిసైన వాళ్ళు, వారి వల్ల నలిగిపోతున్న భార్యలు సమాజంలో ఎందరో ఉన్నారు. వారి ఇతివృత్తంగా వచ్చిన జానపద పాటలు కూడా అనేకం ఉన్నాయి.

**అవ్వ నేను జేయ్యలేనే ఈ సంసారం పాడుగాను** https://youtu.be/czrfnWAlLASA? si=kiYM _Jqrw 0B1zV17 అనే పాటలో తాగుబోతు భర్త వల్ల భార్య పడే మానసిక ఆవేదనను తెలిపారు. గతి లేని సంసారం చేయవచ్చు. కానీ సుతి లేని సంసారం చేయలేమనే సామెతలో ఎంతో పరమార్థం దాగిఉంది. భార్య, భర్తలు కలిసి సంసార సాగరం దాటాలి. కానీ తాగుబోతు భర్త తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టు ప్రవర్తిస్తే భర్తతో పాటు, కుటుంబ విలువ కూడా దిగజారుతుంది. అలాంటి భర్తతో తాను సంసారం చేయలేనని **ఈ సంసారం కాలిపోను, కూలిపోను** అంటూ భార్య ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఏ భార్యకైన పవిత్రమైనది మంగళసూత్రం. అలాంటి తాళిని కూడా అమ్ముకుని తాళ్ళల్లో, ఈదుల్లో కల్లుతాగుతూ, జూదం ఆడుతూ ఇంటికి వచ్చి తనతో, తోటి వారితో గొడవకు దిగుతాడాని, చిత్రహింసలకు గురి చేస్తాడని గోడు వెళ్ళబోస్తూ సంసారం ఈదలేనంటూ అమ్మగారింటికి వెళ్లిపోతున్న భార్యను ఇకనుండి నేను మారుతా నువ్వు వెళ్ళకంటూ భర్త ప్రాధేయపడటంతో పాట ముగుస్తుంది.

అత్త తిట్టినందుకు కాదు యారాలు (తోటి కోడలు) నవ్వినందుకు అన్నట్లు భార్య తన భర్త ఇంట్లో ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టిన సహిస్తుంది. కానీ ఇంటిబయట అందరి ముందు తిట్టడం, కొట్టడం లాంటివి చేస్తే తన ఆత్మాభిమానం దెబ్బతిని భర్తతో విడిపోవడానికైనా సిద్దపడుతుంది. ఇలాంటి ఇతివృత్తం గలిగిన పాట కట్టే దెబ్బ తలిగింది. కనుబొమ్మ వలిగింది. పట్టు రైక చినిగింది. పరువంతపోయింది. పరులంతా చూసింద్రు. పకపక నవ్వింద్రు పోనే అవ్వ మొగుడంట https://youtu.be/O4pAKC2 jQ2E?s =4_ O9bELI16a WTN_ m0. దీనిలో భర్తతో తాను వేగలేనంటూ తన భర్త చేస్తున్న పనుల గురించి, ప్రవర్తించే తీరును తల్లిదండ్రులకు తెలిపుతుంది.

**మందుతో మలుపుకున్న వైనం:**

ఒక స్త్రీ ఎన్ని రకాల బాధలైన భరిస్తుంది. కానీ తన భర్త పరాయి స్త్రీతో సాన్నిహిత్యంగా మెదలడం భరించలేదు. భర్త పర స్త్రీ వ్యామోహంలో పడినప్పుడు తెగించి కొట్లాడే స్త్రీలు ఉన్నట్టే, బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆ బాధను దిగమింగుతూ కాలం వెళ్లదీసే వారు ఇంకొందరు. ఇలాంటి ఇతివృత్తంతో యూట్యూబ్ వేదికగా వచ్చిన పాట **మందు వెట్టిందో మాట చెప్పిందో** https://youtu.be/xq1VpSgBFtE?si=ORcHUQQQc34Zq1G6. చెలుకల శ్రీనివాస్ యాదవ్ రాసిన ఈ పాటకు తగ్గట్టు నేటి సమాజంలో ఎందరో స్త్రీలు ఈ పరిస్థితిని అనుభవిస్తున్నారు. అలాంటి వారికి కనువిప్పుకలిగేలా చిత్రీకరించారు. పర స్త్రీ వ్యామోహంలో పడిన తన భర్త తనతో మాట్లాడకుండా, గడపకుండా ఆమె (పరస్త్రీ) ధ్యాసలో ఉంటూ, **"అలుకు జల్లంగా సొర్రుతడవ్వ, సందేలైన పత్త రాడవ్వ"** అని సమాజానికి చెప్తూ, **సక్కనిది గాదది, ఒక్కనితో గాదు పైసెక్కువిస్తే ఇంకోడు మొగడు.** నీ మీద మోజు తీరే వరకు నిన్ను వాడుకుంటుంది. కానీ, సచ్చే దాకా తోడు నేనుంటా అంటూ చెడు తిర్గుగుల్లకు అలవాటు పడ్డ భర్తకు హితోపదేశం చేస్తున్న భార్యను ఈ పాటలో గమనించవచ్చు.

**చక్కంగా ఇల్లు తొక్కమన్న భార్య**

జోగుల లక్ష్మి నుండి ట్యూన్ సేకరించి జోగుల వెంకటేష్ రాసిన ఊడుకుడుకు రొట్టెలు ఉట్టి మీద ఉండంగా పాసిపోయిన రొట్టెలకు పోతివా నాథ https://youtu.be/D6PqWFeziZM?si =4YXTJAREOFjHV9-Z పాటలో ఎన్నో ఆశలతో అత్తగారింట్లోకి అడుగుపెట్టిన భార్యను ఆరు నెలలు కాకుండానే భర్త పక్కన పెట్టి పరాయి స్త్రీకి అలవాటు పడి ఆస్తి, పాస్తులన్నీ పర స్త్రీకి రాసిస్తాడు. ఈ తీరును చూసి తట్టుకోలేక ఎన్నో సార్లు **"ఒక్కదాన్ని ఉండలేను అరుగుమీద పండలేను సక్కంగ మన ఇల్లు తొక్కోయి నాథ"** అంటూ బతిమలాడినపుడు భర్త తీరు మారదు. దానితో ఆ భార్య ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటుంటే భర్త రక్షిస్తాడు. ఈ క్రమంలో పరాయి స్త్రీకి సంబంధించిన వ్యక్తి తన భర్తను చంపబోతుంటే ఆ భార్య అడ్డుగా నిలిచి కత్తి వేటుకు గురవుతుంది. దీంతో మొదటి భాగం పూర్తవుతుంది. తప్పు తెలుసుకుని భార్యను రక్షించుకుని అన్యోన్యంగా ఉంటున్నప్పుడు, పరాయి స్త్రీ తన తప్పుని మన్నించమని వేడుకుంటూ ఆమెకు

రాసిన ఆస్తి, ఆమె ఆస్తి పత్రాలు ఈ జంటకు ఇచ్చి చనిపోతుంది. ఇదే సమయంలో తన భార్య నెలతప్పడం గుర్తించిన భర్త ఆలోచనలో పడడంతో రెండవ భాగం ముగుస్తుంది. ఈ పాటలో మనలను ప్రేమిస్తున్న వారిని నిర్లక్ష్యం చేయడం ద్వారా, వారు ఇంకొకరి ప్రేమకు ఆకర్షితులవుతారు. దానితో సమాజంలో విలువ తగ్గుతూ మానవ జన్మకు అర్థం లేకుండా పోతుందనే హితబోధ చేశారు.

## అనుమానమే పాతరోగం

భార్య భర్తల అన్యోన్య దాంపత్యంలో అనుమానాలు సహజం. ఆ అనుమానాలకు గల పరిస్థితులను, కారణాలను అర్థం అయ్యేలా చెప్పడం ఇద్దరి కర్తవ్యం. లేకుంటే ఆ అనుమానలే పెనుభూతాల్లాగా మారి జీవితాలను ఛిద్రం చేస్తాయి. నేటి సమాజంలో కేవలం అనుమానంతో ప్రాణాలు తీస్తున్న వ్యక్తులెందరో కన్పిస్తున్నారు. ఆ అనుమానాలను తొలగిస్తూ సంసారాన్ని చక్కదిద్దుకునే ఇతివృత్తంతో వచ్చిన పాట **బంతి పువ్వుల వాసన నీ బానిండ్ల** https: / /youtu.be/ wO80iJ KK0eA?si=Yt5EY1MF8QKkPt6G. ఈ పాటలో భార్య భర్త దగ్గర నుండి ఒక్క రోజు బానిండ్ల నుండి బంతి వాసన, మరో రోజు అంగి నుండి అల్లిపువ్వుల వాసన, ఇంకో రోజు శెల్లల (కండువ) నుండి శనిగపువ్వుల వాసనలు రావడం గమనించి తనను నిలదీస్తుంది. దాంతో భర్త ప్రతిగా బంతి చేండ్ల నుండి బర్రె కొట్టుకరావడం వల్ల బంతి వాసన, ఆలమంద మేపి నీళ్ళ గట్టుకు పోతే అల్లిపువ్వుల వాసన, శెల్ల (కండువా) జారీ శనగ తోటలో పడితే శనిగ పువ్వుల వాసనలు వస్తున్నాయి తప్ప, నేను ఏ తప్పు చేయడం లేదని తన భార్యకు అర్థమయ్యే రీతిలో సమధానం ఇవ్వడంతో భార్య **"నిన్నే నమ్మిన దాన్ని శీనయ్య, నన్ను ఆగం జేయబోకు శీనయ్య"** అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న భార్యకు భర్త **ఏడేడు జన్మలకు నేస్తమా నీ తోడు నీడగుంట** అని భర్త భరోసా ఇవ్వడంతో పాట ముగుస్తుంది.

ఈ ప్రపంచంలో స్త్రీని దేవతామూర్తి కొలిచే వారున్నట్టే, స్త్రీని ఆటబొమ్మలా చూసే అధములున్నారు. స్త్రీలు ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కుంటారు. అలాంటి నేపథ్యమున్న పాట **ఆడదాన్ని చూస్తే గాడిదై పోతారు ఎల్లక్క వీళ్ళ మీద మన్నువొయ్య** https: / /youtube / lyWmW8kH7W8?si=c4V53Z7 HQvKo9Azl. ఈ పాటలో ఒక స్త్రీ ఇంటి నుండి మేడారం జాతరకు వెళ్ళే ప్రయాణ మార్గమధ్యంలో ఎవరెవరు ఎలా ప్రవర్తించారో చెప్తూ నేను వారి బిడ్డ, చెల్లె, అక్క లాంటిదాన్నే కదా. అంటూ తన అసహనం వ్యక్తం చేస్తుంది.

ఇలా సమాజంలో జరిగే ఎన్నో అంశాలపైన జానపద పాటలు వచ్చాయి, వస్తున్నాయి. యూట్యూబ్ వేదికగా మొబైల్ వాడకంలోకి వచ్చిన రోజుల్లో దాని అనర్థాలను తెలిపే పాట, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి కాలంలో విద్యుత్ చార్జిల పెంపు పై జానపద పాట, ఎయిడ్స్ పై అవగహన కల్పించిన జానపద బాణీలోని పాటతో పాటు అనేక సామాజిక అంశాలను తెలిపే జానపద, జానపద బాణీలో ఉన్న పాటలు కోకొల్లలు.

## ఉపయుక్త ఆధారాల సూచిక


1. అల్లే మదుబాబు, కట్టేదెబ్బ తలిగింది. కనుబొమ్మ వలిగింది. పట్టు రైక చినిగింది. https: / / youtu.be /O4pAkC2 jQ2E?si=4, _ O9bEI16a WTN _ m0, 2021
2. ఆవదుర్తి లక్ష్మణ్, ఆడదాన్ని చూస్తే గాడిదై పోతారు ఎల్లక్క వీళ్ళ మీద మన్నువొయ్య https : / / youtu.be /ly Wm W8kH7W8?si=c4V53Z7 HQvKo9Azl, 2024
3. అర్వీ యస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, హైదరాబాద్, నవచేతన విజ్ఞాన సమితి, 2018.
4. కోత వినోద, వచ్చే వచ్చే జంగమయ్య పాట https:/ / youtube/4pZMZVzagY?si=nyqv VnfAFuxRKs65, 2024
5. **గూడ దేవేందర్, అవ్వ నేను జేయ్యలేనే ఈ సంసారం పాడుగాను** https:/ /youtu.be / czrfnWAlASA?si=kiYM_Jqrw0B1zV17, 2023
6. చెలుకుల శ్రీనివాస్ యాదవ్, మందు వెట్టిందో మాట చెప్పిందో మాట జెప్పిందో https:/ /youtu.be / xq1VpSgBFtE?si=ORcHUQQQc34Zq1G6, 2024
7. నక్క లక్ష్మీ, దచ్చున్న వారింట్లో పాట https://youtu.be/ rT-H-HeoRA2pU?si= C- -uX63Eet2rq61H, 2021
8. నాగం పరశురామ్, పండ్లోయమ్మ పరికిపండ్లు https:/ / youtu.be /NYgYbNgWasE?si= TkuVami-kC9LKDg4, 2024
9. బిరుదు రాజు రామ రాజు, తెలుగు జానపద గేయ సాహిత్యం, హైదరాబాద్, తెలుగు అకాడమి, 2015
10. ముక్కపల్లి శ్రీనివాస్, బంతిపూల వాసన https:/ / youtu.be/wO80iJKK0eA?si=Yt5EY1MF 8QKkPt6G, 2020


**రచయిత: పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం,**

# ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యపుటలు: విమర్శనాత్మక పరిశీలన(2015-2017)

డా. కె.లావణ్య


āndhrajyōti dinapatrika sāhitya puṭalu:
vimarśanātmaka pariśīlana (2015 - 2017)

A Thesis Submitted to the University of Hyderabad
in Partial Fulfillment of the Degree of
Doctor of Philosophy
In
Telugu

Researcher
K. LAVANYA
(16HTPH16)

Supervisor
Dr. PAMMI PAVAN KUMAR

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500046
Telangana, India
2019

**పరిశోధన శీర్షిక** (Title of the research)

దినపత్రికలు ఏ రోజుకారోజు జరిగిన సంఘటనలను ప్రచురిస్తూ సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నాయి. ఇవి సమాచారాన్ని చేరవేయడమే కాక సమాజంలోని పరిస్థితులను విశ్లేషిస్తున్నాయి. ఇలాంటి అంశాలతో పాటు దినపత్రికలు సాహిత్య సంబంధ విషయాలకు కూడా ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇలా సాహిత్యాంశాలను ప్రచురిస్తున్న ప్రస్తుత దినపత్రికలలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలోని 'వివిధ' సాహిత్య పుటపై పరిశోధన చేసాను. ఈ సాహిత్య పుటలో కవిత్వం, వ్యాసం, పుస్తక సమీక్షలు, సాహిత్య కార్యక్రమాల వివరాలు, సాహిత్య ఆహ్వానాలు, పురస్కార ప్రదానోత్సవ ఆహ్వానాలు, సాహిత్య ప్రక్రియల పోటీల వివరాలు-ఆహ్వానాలు మరియు పుస్తకావిష్కరణలకు సంబంధించిన అంశాలు ప్రచురితమవుతున్నాయి. ఆ అంశాలను పరిశీలించాలని "ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యపుటలు: విమర్శనాత్మక పరిశీలన(2015-2017)" అనే అంశంపై పి. హెచ్. డి పరిశోధన చేసాను. దీన్ని ఆచార్య పమ్మి పవన్ కుమార్ పర్యవేక్షణలో తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2019లో సమర్పించాను.

**పరిశోధన నేపథ్యం** (Background of research)

ప్రస్తుతం తెలుగులో చాలా దినపత్రికలు వెలువడుతున్నాయి. ఇవన్నీ వేరు వేరు పేర్లతో సాహిత్యాన్ని అందిస్తున్నాయి. కొన్ని దినపత్రికలు వారానికి ఒకసారి ప్రత్యేక పుట(ల) ద్వారా సాహిత్యాన్ని అందిస్తే, మరికొన్ని పత్రికలు వార, మాస పత్రికల ద్వారా సాహిత్యాన్ని అందిస్తున్నాయి. దినపత్రికలలో ముద్రితమవుతున్న సాహిత్యాంశాలను విశ్లేషించడం, సమీక్షించడం ద్వారా సమకాలీన సాహిత్య స్పృహను వెలుగులోకి తీసుకురావడం నా పరిశోధన నేపథ్యం.

**పూర్వ పరిశోధనల సమీక్ష** (Review of Literature)

పత్రికలకు సంబంధించి వెలువడిన ముఖ్యమైన పరిశోధన, ముద్రిత గ్రంథాలు ఇవి: డా. పమ్మిపవన్ కుమార్ 'కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషా పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథం, జోగు చిరంజీవి 'తెలుగు దినపత్రికలలో సాహిత్యపుటలు: చర్చనీయాంశాలు' అనే పరిశోధన వ్యాసం, ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ 'తెలుగులో సాహిత్య పత్రికలు' అనే గ్రంథం, కె. రాంప్రసాద్ 'తెలుగు దినపత్రికల్లో సాహిత్యం (1970-1990)' అనే సిద్ధాంత గ్రంథం, యం. ఆనంద్ 'అంతర్జాలంలోని తెలుగు సాహిత్య పత్రికలు-భాష, సాహిత్య సేవ' అనే పరిశోధన వ్యాసం మొదలైనవి.

**పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక** (Methodology and conceptual framework)

పత్రికారంగంలో కాలానికి అనుగుణంగా విభిన్నమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ మార్పులపై నిత్యం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అందులో భాగంగా నేను 2015 జనవరి నుంచి 2017 డిసెంబరు వరకు వెలువడిన 'వివిధ' సాహిత్య పుటలను నా పరిశోధనకు ఎంచుకున్నాను. పరిశోధనకు నిర్ణయించుకున్న మూడు సంవత్సరాల కాలంలో మొత్తం 156 సాహిత్య పుటలు వెలువడాల్సి ఉండగా, అందులో నాలుగు సార్లు ఇతరత్ర కారణాల వల్ల పత్రిక వెలువడలేదు.

మిగిలిన 152 సాహిత్యపుటలలో 159 వ్యాసాలు, 59 పుస్తక సమీక్షలు, 291 కవితలు ప్రచురింపబడ్డాయి. వీటిని అధ్యయనం చేసి, ఆ వివరాలను, విశేషాలను ఈ పరిశోధనలో వివరించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి అంతర్జాల ఎడిషన్ (Internet) నుండి సేకరించిన సాహిత్యపుటలను పూర్తిగా అధ్యయనం చేసి వాటిలో ప్రచురితమైన అంశాలను కవిత్వం, వ్యాసం మరియు పుస్తక సమీక్షలుగా విభజించుకున్నాను. వీటన్నిటి నుండి భాషాంశాలను ప్రత్యేకంగా సేకరించాను. వాటిని ఆయా ప్రక్రియల ఆధారంగా పరిశీలన చేసి నా పరిశోధన గ్రంథంలో విశ్లేషించాను.

**పరిశోధన ఉద్దేశ్యం, లక్ష్యం** (Aims & Objectives)

ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురిస్తున్న 'వివిధ' సాహిత్య పుటలలోని సాహిత్యాంశాలపైన, ప్రక్రియలపైన, రచనా విధానంపైన భాష, సాహిత్యాల కోణంలో అధ్యయనం చేయడానికి ఈ పరిశోధన ఉద్దేశించబడింది.

ఈ పరిశోధన ద్వారా 'వివిధ' సాహిత్యపుటల్లో ముద్రితమైన కవిత్వం, వ్యాసం, సమీక్షలు ఎలా వస్తున్నాయో పరిశీలించడం. సాహిత్యాంశాలను పరిశీలించే క్రమంలో, ఆ ప్రక్రియలను విశ్లేషించి ఫలితాంశాలను వివరించడం, 'వివిధ' సాహిత్యపుటల్లోని భాషను అధ్యయనం చేసి ఆ విశేషాలను వివరించడం ఈ పరిశోధన లక్ష్యాలు.

**అధ్యాయ విభజన** (Chapter division)

ఈ పరిశోధన గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించుకున్నాను. అవి: 1. తెలుగు దినపత్రికల పరిచయం: విషయ విశ్లేషణ, 2. కవిత్వం-వస్తు విశ్లేషణ, 3. 'వివిధ' వ్యాసాలు, ఇంటర్వ్యూలు: విశ్లేషణ, 4. పుస్తక సమీక్షలు-విశ్లేషణ, 5. ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్య పుటలు: భాషాపరిశీలన.

**పరిశోధన ఫలితాంశాలు** (Research findings)

1. ఆంధ్రజ్యోతి దినపత్రిక 'వివిధ' సాహిత్యపుటల ద్వారా సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ, తెలుగు సాహిత్యాభివృద్ధికి, సాహిత్య చరిత్ర పునర్నిర్మాణానికి కృషి చేస్తోంది.

2. ఆంధ్రజ్యోతి దినపత్రిక సృజనాత్మక సాహిత్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

3. తెలుగు సాహిత్యంలోని అన్ని రకాల ప్రక్రియల ప్రచురణకు ప్రాధాన్యతనిస్తోంది. కవిత్వం, వ్యాసం, పుస్తక సమీక్ష వంటి ప్రక్రియలకు అధిక ప్రాధాన్యాన్నిస్తోంది.

4. ప్రముఖుల, చిరస్మరణీయుల సాహిత్యానికి ప్రాధాన్యతనిచ్చి సమాజంలో వారి గౌరవాన్ని పెంపొందించే విధంగా కవితలు, వ్యాసాలను ప్రచురిస్తోంది.

5. సమాజంలో జరుగుతున్న సమకాలీన సంఘటనలకు ఎక్కువ అవకాశాన్ని కల్పించి, వాటిపై వచ్చిన కవిత్వాన్ని అధికంగా ముద్రిస్తోంది.

6. తెలుగు సాహిత్యానికి చెందిన ప్రముఖ కవులు/రచయితలు/ రచయిత్రులను, కళా రంగాలకు చెందిన వ్యక్తులను ఇంటర్వ్యూ చేసి, ఆ రంగాలకి వారు అందించిన కృషిని ప్రచురిస్తోంది.

7. జాతీయాలు, సామెతలు మొదలైనవాటి ప్రయోగాలు ఈ సాహిత్యపుటలలో కనిపిస్తున్నాయి.

8. ఈ సాహిత్యపుటలలో ఇంగ్లీషు, ఉర్దూ వంటి అన్యదేశ పదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**భావి పరిశోధకులకు సూచనలు** (Suggestions for upcoming researchers)

ప్రసార మాధ్యమాలలో పత్రికలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి. కాలంతో పాటు పత్రిక రచనలలో ముద్రితమయ్యే అంశాలలో, భాషలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ మార్పులను గమనిస్తూ వార్తాంశాలను రాయవలసిన ఆవశ్యకత ఉంది. సాంకేతిక యుగంలో పత్రికలలో వస్తున్న మార్పులపై పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. పత్రికలు సాహిత్య కృషిని ఎంతవరకు అందిస్తున్నాయి, అందించకపోవడానికి గల కారణాలను విశ్లేషించి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**పరిశోధకురాలి వివరాలు:** డా. కె. లావణ్య, అప్పారెడ్డి గూడ గ్రామం, షాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా, ఫోన్: 9133550365, lavanyakumarik1993@gmail.com

నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.

వెబ్ పేజీ: https://nadustunnatelangana.com

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



In every walk with nature
one receives far more than they seeks.

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007